www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 262 | మంగళవారం | 13 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



రభసభ

కౌన్సిల్ చైర్మన్ స్వామిగౌడ్ కంటికి గాయం



గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగులుతూ ప్లకార్డులతో కాంగ్రెస్ సభ్యుల నినాదాలు, మైక్ హెడ్‌సెట్ విసురుతున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి



బడ్జెట్ సమావేశాల తొలిరోజు గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగులుతూ కాంగ్రెస్ ప్లకార్డుల నిరసన

కోమటిరెడ్డి వెంకటరెడ్డి విసిరిన మైక్ హెడ్‌సెట్ తగిలి గాయపడిన కౌన్సిల్ చైర్మన్

సరోజినిలో చికిత్స • కార్నియాకు దెబ్బ తగిలినట్లు ఆసుపత్రి ప్రకటన • ప్రముఖుల పరామర్శ

మన తెలంగాణ / హైదరాబాద్: తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం సమావేశాలు ఆరంభం కాగానే గవర్నర్ నరసింహన్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగం ప్రారంభించారు. కొద్దిసేపటికే కొంత మంది కాంగ్రెస్ సభ్యులు తమ స్థానాల నుంచి స్పీకర్ పోడియం సమీపానికి వచ్చారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. 'దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి, రైతు వ్యతిరేక ప్రభుత్వం నశించాలి' అంటూ వారు నినాదాలు చేశారు. గవర్నర్ ప్రసంగం ప్రతులను చించి పోడియం వైపు విసిరారు. వారిని మార్షల్స్ అడ్డుకోవడంతో సభలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గవర్నర్ ప్రసంగించినంత సేపూ కాంగ్రెస్ సభ్యులు పోడియం దగ్గరే నిలబడి నిరసన తెలిపారు. ఆ పార్టీ సభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మైక్ హెడ్‌ఫోన్‌ను పోడియం వైపు విసరగా అది గాంధీ ఫొటోకు తగిలి దాని కింద కుర్చీలో కూర్చున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై పడింది. దీంతో ఆయన కంటికి గాయమైంది. అసెంబ్లీ నుంచి నేరుగా సరోజినిదేవి కంటి తరువాయి 6లో



ఆదర్శ రాష్ట్రం



మూడున్నర ఏళ్లలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొని వివిధ రంగాల్లో ఘనమైన ప్రగతి సాధించాం

కొత్త రాష్ట్రమే అయినా మొత్తం దేశానికి ఆదర్శంగా నిలిచింది

క్లిష్టతరమైన లోటును పూడ్చుకొని ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతున్నాం

కాళేశ్వరం సహా భారీ ప్రాజెక్టులు త్వరలోనే పూర్తి : బడ్జెట్ సభ సంయుక్త సమావేశంలో గవర్నర్

3లో

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం

50 మందికి పైగా మృతి

త్రిభువన్ ఎయిర్‌పోర్టులో కూలిన బంగ్లా విమానం

ఇరాన్‌లో టర్కీ విమానం కూలి 11 మందికి పైగా మృతి



ఖాట్మండు/యుఎఇ: నేపాల్‌లోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం (టిఐఎ)లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన యుఎస్–బంగ్లా ఎయిర్‌లైన్స్ విమానం దిగుతుండగానే కుప్పకూలిపోవడమే కాకుండా నిప్పంటుకుంది. నలుగురు విమాన సిబ్బంది, 67 మంది ప్రయాణికులతో ఢాకా నుంచి బయలుదేరిన విమానం మధ్యాహ్నం 2.20 గంటలకు రన్‌వేపై దిగుతున్నప్పుడు ఒక్కసారిగా కూలిపోయింది. ప్రమాద కారణంగా మంటలు చెలరేగి తరువాయి 6లో

ప్రజాస్వామ్యంపై దాడి



కాంగ్రెస్ సభ్యుల తీరు హేయం

స్వామిగౌడ్‌పై వీధి గూండాల్లా ప్రవర్తించారు : హరీశ్‌రావు

15న బడ్జెట్ 6

27 వరకు అసెంబ్లీ

మన తెలంగాణ/ హైదరాబాద్ : గవర్నర్ నరసింహన్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు దాడి చేసిన తీరు హేయమైనదని శాసనసభా వ్యవహారాల మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై జరిగిన దాడి ప్రజల మీద, ప్రజాస్వామ్యం మీద జరిగిన దాడి అని అన్నారు. కాంగ్రెస్ నేతలు వీధి గూండాల్లా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఆర్‌ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు పల్లా రాజేశ్వర్ రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్, ఎంఎల్‌ఎ మర్రి జనార్ధర్‌రెడ్డిలతో కలిసి సోమవారం ఏర్పాటు తరువాయి 6లో

సమావేశాలు ముగిసే వరకు 3

కోమటిరెడ్డి సస్పెన్షన్

ప్రధాన అంశాల ప్రస్తావన లేని గవర్నర్ ప్రసంగం : కాంగ్రెస్ 3

మూడు రాజ్యసభ స్థానాలకు ఐదు నామినేషన్లు దాఖలు 6



మద్దతు ధర కోసమే

రైతు సమితులు ఆధిపత్యానికి కాదు


చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తూ గుత్తా

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎవరి మీదనో అధిపత్యం చెలాయించేందుకు రైతు సమన్వయ సమితులు ఏర్పాటు కాలేదని, పంటలకు మద్దతు ధర ఇప్పించడమే తరువాయి 6లో

కుంచెపోటు



ముంబయిని ముంచెత్తిన రైతు జన మహాసంద్రం



10లో

దారుణ హత్య

కూకట్‌పల్లిలో పట్టపగలు ఇంటర్ విద్యార్థిని వెంటాడి చంపిన దుండగులు

మన తెలంగాణ/ హైదరాబాద్/ మూసాపేట/ కూకట్‌పల్లి: ఇంటర్మీడియట్ పరీక్షలు రాయడానికి వెళ్తున్న విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. కూకట్‌పల్లిలోని జాతీయ రహదారిపై సోమవారం ఉదయం సినీఫక్కీలో చోటుచేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.... మూసాపేటకు చెందిన పాలరాజు కుమారుడు ఎలజల సుధీర్ (19) కూకట్‌పల్లి ప్రతిభ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం సిఇసి గ్రూపు చదువుతున్నాడు. సోమవారం కూకట్‌పల్లి చైతన్య ఐఐటి క్యాంపస్‌లో పరీక్ష రాయడానికి ఉదయం 8 గంటల సమయంలో మూసాపేటకు చెందిన తన స్నేహితులు మేఘనాథ్, సుధీర్, సాయిలతో కలిసి బైకుపై బయలుదేరాడు. కూకట్‌పల్లి మెట్రో ఎదురుగా ఉన్న సాగర్ హోటల్ వద్ద అప్పటికే వేట కొడవళ్ళతో కాపు కాసిన నలుగురు యువకులు సుధీర్‌పై దాడికి యత్నించారు. విషయాన్ని గమనించిన సుధీర్ బైకును అక్కడే వదిలేసి వేగంగా వెళ్తున్న ప్రైవేటు స్కూల్ బస్సును ఎక్కబోతుండగా దుండగులు అతని చొక్కా పట్టుకొని కిందికిలాగేశారు. అనంతరం వేట కొడవళ్ళతో తల, మెడ భాగంలో నరకడంతో సుధీర్ నడిరోడ్డుపై రక్తపు మడుగులో తరువాయి 6లో



సుధీర్ (ఫైల్ ఫొటో)

వక్ఫ్ భూములను పరిరక్షించాలి : మహమూద్ అలీ



మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని వక్ఫ్ భూములను పరిరక్షించాలని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ అన్నారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాదాపూర్, గుట్టల బేగంపేట్‌లోని 91 ఎకరాల వక్ఫ్ భూములను గతంలోనే వక్ఫ్‌బోర్డు గుర్తించిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా గుట్టల బేగంపేట్ మసీదును సందర్శించినపుడు వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించాలని కెసిఆర్ చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ భూముల వ్యవహారం న్యాయస్థాన పరిధిలో ఉందని, అయినప్పటికి కొందరు వ్యక్తులు వక్ఫ్ భూములను కబ్జా చేస్తున్నారని సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండి కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే అక్కడ జరుగుతున్న నిర్మాణాలను నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్, ప్రభుత్వ సలహాదారు ఏకె ఖాన్, వక్ఫ్ బోర్డు చైర్మన్, ఎంఎల్‌సి సలీమ్, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి దాన కిషోర్, వక్ఫ్ బోర్డు సిఈఓ మన్నాన్, మాదాపూర్ డిసిపి , సిఐ తదితరులు పాల్గొన్నారు.

సౌదీ జైలులో మగ్గుతున్న యువకుడు

మన తెలంగాణ/ ఇందల్‌వాయి (నిజామాబాద్ జిల్లా): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు నిజామాబాద్ ఎంపి కవిత కృషితో సౌదీ జైలులో మగ్గుతున్న ఇందల్‌వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పులి సాయిలు తన సొంతింటికి చేరుకున్నాడు. నెలరోజులుగా సరైన వీసా లేని కారణంగా సౌదీ జైలులో ఉంటున్న సాయిలు కుటుంబ సభ్యులు ఇందల్‌వాయి జాగృతి మండల కన్వీనర్ గంగాధర్‌గౌడ్‌కు తెలుపగా వారు రాష్ట్ర కన్వీనర్ నవీన్‌చారికి సమాచారం అందించారు. వారు సౌదీలోని ఇండియన్ ఎంబసికి మెయిల్ ద్వారా పూర్తి వివరాలు పంపడంతో రెండురోజుల్లోనే అతడిని స్వదేశం పంపించారు.

డొంక కదులుతోంది

గ్రామీణ బ్యాంక్ స్కాంలో మరో ఇద్దరి ప్రమేయం ఉందని తేల్చిన సిబిఐ



మన తెలంగాణ/ హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అజీజ్‌నగర్ శాఖలో వెలుగు చూసిన రూ.9 కోట్ల కుంభకోణం కేసులో సిబిఐ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. నాలుగేళ్ళుగా నడుస్తున్న ఈ కుంభకోణం ఒక ఖాతాదారుడి ఫిర్యాదు మేరకు తొలుత మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా రూ.9 కోట్లకుపైగా కుంభకోణం జరిగినట్లు నిర్ధారణ కావడంతో ఈ కేసు దర్యాప్తు సిబిఐకి బదిలీ అయింది. రంగంలోకి దిగిన సిబిఐ పోలీసులు 15 రోజుల నుంచి బ్యాంక్ రికార్డులను, డిపాజిట్ల వివరాలను పరిశీలించారు. నాలుగేళ్ల నుంచి ఈ బ్యాంక్‌లో విధులు నిర్వహించి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన అధికారులను కూడా సిబిఐ పోలీసులు పిలిపించి విచారించారు. బ్యాంక్ అకౌంటెంట్ జైపాల్‌రెడ్డి ఈ కుంభకోణానికి సూత్రధారని సిబిఐ పోలీసులు తేల్చారు. ఇతనికి సంబంధించిన ఆస్తులపై కూడా సిబిఐ, ఎసిబి అధికారులు దాడులు చేసి కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను జప్తు చేశారు. జైపాల్‌రెడ్డి ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు మరో కేసు నమోదైంది. ఈ వ్యవహారంలో జైపాల్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు బ్యాంక్ అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. వారి పేర్లు చెప్పడానికి అధికారులు నిరాకరించారు. ఈ ఇద్దరూ జైపాల్‌రెడ్డితో కలిసి పథకం ప్రకారమే కుంభకోణానికి పాల్పడ్డారని సిబిఐ దర్యాప్తులో తేలింది. వందలాది మంది డిపాజిట్ల డబ్బులను అక్రమంగా డ్రా చేసుకుని తమ సొంతానికి వాడుకున్నట్లు తేలింది. జైపాల్ రెడ్డి మాదిరిగానే వీరిద్దరు కూడా ఆ డబ్బుతో ఇతర ప్రాంతాలలో వ్యవసాయ భూములు, ప్లాట్లు, భవనాలు ఖరీదు చేసి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి వారి కుంటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలను రాబడుతున్నారు. వారి ఆస్తులపై కూడా త్వరలో దాడులు నిర్వహించి ఎసిబి కేసులు నమోదు చేసే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. మొత్తం దర్యాప్తుకు మరో నెల రోజుల సమయం పడుతుందన్నారు. దర్యాప్తు పూర్తయిన తరువాతనే అరెస్టుల పర్వం కొనసాగుతుందని చెప్పారు.గోల్‌మాల్ అయిన డిపాజిట్లను ఖాతాదారులకు చెల్లిస్తామని బ్యాంక్ అధికారులు హామీ ఇచ్చారు. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి డబ్బు త్వరలో చెల్లించేందుకు ఏర్పాటు జరుగుతున్నాయని వారు తెలిపారు.

అదనపు డిజిగా బాధ్యతలు చేపట్టిన జితేందర్



మన తెలంగాణ/ హైదరాబాద్ : ఇంతకాలం రాష్ట్ర పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న జితేందర్‌ను అదనపు డిజిపిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం నూతన బాధ్యతలు స్వీకరించారు. 1992 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన జితేందర్ న్యూఢిల్లీలో ఎంఫిల్ (లైఫ్ సైన్స్) పూర్తి చేశారు. నిర్మల్ ఎఎస్‌పిగా మొదట బాధ్యతలు చేపట్టిన ఆయన ఎస్‌పిగా మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాలలో విధులు నిర్వహించారు. వైజాగ్, వరంగల్ రేంజ్, గ్రేహౌండ్స్‌లో డిఐజిగా పనిచేశారు. సిఐడి, విజిలెన్స్, పోలీసు అకాడమీ, నగర ట్రాఫిక్ విభాగంలో ఐజి హోదాలో బాధ్యతలు నిర్వర్తించారు. విధినిర్వహణలో ప్రతిభ కనబర్చిన జితేందర్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ మెడల్, ఐపిఎం, రాష్ట్రపతి పోలీసు పథకం అందుకున్నారు. ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, వైజాగ్‌లో పనిచేస్తున్న సమయంలో నక్సల్స్ అణచివేతలో చురుకైన పాత్ర పోషించారు. ఆదివారం జరిగిన ఐపిఎస్‌ల భారీ బదిలీలలో హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా అంజనీకుమార్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన రాష్ట్ర గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్‌ను మర్యాదపూర్వకంగా కలుకున్నారు. అలాగే ఐజి షికాగోయల్ హైదరాబాద్ క్రైమ్ అదనపు పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

మరో ఇద్దరు ఐపిఎస్‌ల బదిలీ..

మరో ఇద్దరు ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి ఉత్తర్వు లు జారీ చేశారు. హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా పనిచేస్తున్న ఎ.వి.రంగనాథ్‌ను నల్గొండ ఎస్‌పిగా బదిలీ చేయ గా అక్కడ పనిచేస్తున్న డి.వి.శ్రీనివాస్‌రావును డిజిపి కా ర్యాలయంలో రిపోర్టుగా ఉత్తర్వులు పేర్కొన్నారు.

ఐటి శాఖతో వెబ్‌సైట్ల నిర్వహణ



- **ఉన్నతాధికారుల సమీక్షలో సిఎస్ ఎస్‌కె జోషి**

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీల వెబ్‌సైట్లను ఐటి శాఖ ద్వారా నిర్వహించే విషయమై 10 రోజుల్లో తగు నివేదికను సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. జోషి ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వెబ్‌సైట్లు, పోర్టల్‌కు సంబంధించి ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఐటి శాఖ డైరెక్టర్ కొణతం దిలీప్‌లతో సచివాలయంలో సోమవారం సిఎస్ సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి 265 వెబ్ సైట్లు, పోర్టల్స్ ఉన్నాయని, వీటి నిర్వహణ, సమాచార ఆధునీకరణ, కేంద్ర ప్రభుత్వం నిర్దేశాల మేరకు నిబంధనలను పాటించడం, అనువైన నూతన టెక్నాలజీని వినియోగించడం, మొబైల్ ఫ్రెండ్లీ విధానం తదితర అంశాలతో నివేదికను రూపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఐటి శాఖ సర్వీసు ప్రొవైడర్‌గా పని చేయాలన్నారు. అవసరమైతే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారం కూడా తీసుకోవాలన్నారు. వెబ్ సైట్ల నిర్వహణ, సమాచారం అప్‌డేషన్‌కు సంబంధించి ప్రభుత్వం తరఫున చేపట్టవలసిన చర్యలు , ప్రతి వెబ్ సైట్‌లలో ఉండవలసిన వివిధ శాఖల సర్వీసు వివరాలు నివేదికలో ఉండాలన్నారు. ప్రతి శాఖకు సంబంధించి ట్విట్టర్, ఫేస్‌బుక్ అకౌంట్ ఉండేలా కూడా చూసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ లోగో, ముఖ్యమంత్రి కెసిఆర్ ఫోటో ఉండాలన్నారు. వెబ్‌సైట్ల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అన్ని శాఖల వెబ్ సైట్లకు రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ కేంద్ర స్థానంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాల వివరాలు, ఉత్తర్వులు తెలుగు లోనే అప్‌లోడింగ్ చేయాలన్నారు. వివిధ శాఖల కార్యక్రమాల వివరాలు తెలియజేసేలా వెబ్‌సైట్లు ఉండాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్, ఐటి శాఖ పోర్టల్‌ను కూడా తామే నిర్వహిస్తున్నామని ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. వివిధ శాఖలకు సహకారం కూడా తామే అందిస్తున్నామని, డిజిటల్ మీడియా విభాగం ద్వారా సిఎం కెసిఆర్, ఐటి మంత్రి కెటిఆర్‌ల సోషల్ మీడియా అకౌంట్లను కూడా నిర్వహిస్తున్నామన్నారు. వెబ్ పోర్టల్ సిబ్బందికి వివిధ అంశాలపై పూర్తి శిక్షణనిచ్చామని, కేంద్ర ప్రభుత్వ నిబంధనలు, ఫేస్‌బుక్ నిర్వహణపై వారికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇందుకు గూగుల్ సహకారం తీసుకుంటున్నామన్నారు. సూర్యాపేట జిల్లా లో ప్రజా సమస్యలపై ఫిర్యాదులు, వాటి పరిష్కారం కోసం అమలు చేస్తున్న 'జనహిత' విధానాన్ని సిఎస్ సమీక్షించారు. ఫిర్యాదులను 'ఈ మెయిల్, ఆన్‌లైన్ , వాట్స ప్ మొబైల్‌లో కూడా చేస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ పద్ధతిని అమలు చేసే విధానంపై అధికారులకు సిఎస్ సూచించారు.

కొలిక్కిరాని కొత్త పంచాయతీలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిన కొత్త పంచాయతీల వ్యవహారం ఇంకా కొలిక్కిరాలేదు. కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినా కొత్తగా పంచాయతీలయ్యే గ్రామాలు, తండాలపై స్పష్టత రాలేదు. గ్రామాలను పంచాయతీలుగా చేయాలంటూ స్థానిక రాజకీయ నేతల నుంచి అధికారులకు ఇంకా ప్రతిపాదనలు అందుతూనే ఉ న్నాయి. వీటిని పరిగణలోకి తీసుకోకూడదని తొలు త అధికారులు భావించినా కొన్ని వత్తిడుల రీత్యా అనివార్యమవుతోంది. అందువల్లనే కొత్త పంచాయతీలకు తుదిరూపు ఇవ్వలేక పోతున్నామని ఆ శాఖ అధికారి ఒకరు చెప్పారు. నాలుగైదు నెలలుగా ఎం తో కసరత్తు చేసి ఓ రూపునిచ్చినా కథ మళ్లీ మొదటికి వస్తోందని, ఇది సమస్యాత్మకంగా మారిందని ఆయ న వాఖ్యానించారు. కొత్త పంచాయతిరాజ్ చట్టం త యారీ దాదాపు పూర్తయినా సంఖ్య, కూర్పు ఇంకా కొలిక్కి రాలేదని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ సమావేశాలు ముగియకముందే తేల్చేసి సభలో ప్రవేశపెట్టాలని సర్కారు నుంచి ఒత్తిడి పెరుగుతోందని, అందువల్లనే అన్ని పనులనూ పక్కన పెట్టి దీనిపైనే ప్రధాన దృష్టి సారించామని తెలిపారు. నిబంధనల మేరకు, ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో కొత్తగా పంచాయతీలుగా మారే అర్హతలున్న గ్రామాల జాబితాను పది రోజుల క్రితమే పంచాయతీరాజ్ అధికారులు ప్రభుత్వానికి అందచేశారు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవడమే తరువాయి.

15 నుంచి ఒంటి పూట బడులు

మన తెలంగాణ/ హైదరాబాద్ : వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకున్న రాష్ట్ర విద్యాశాఖ ఒంటిపూట బడులను నిర్వహించాలని భావించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఈ నెల 15నుంచి విద్యాసంవత్సరం చివరి రోజు వరకు ఒంటిపూట తరగతులను నిర్వహించాలని నిర్వహించాలని పాఠశాల విద్య డెరెక్టర్ జి.కిషన్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలన్నింటిని ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు మాత్రమే నడిపించాలని పేర్కొన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలకు కూడా ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. పదోతరగతి పరీక్షా కేంద్రాలున్న పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులను నిర్వహించాలని స్పష్టం చేశారు. ఐచ్చిక సెలవులను ఆయా పాఠశాలలు, లేదా ఉపాధ్యాయులు ఉపయోగించుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాంగ్రెస్‌పై గరంగరం

- **అసెంబ్లీలో ఆ పార్టీ సభ్యుల ప్రవర్తన, కోమటిరెడ్డి దాడిపై టిఆర్‌ఎస్ ధ్వజం**

మన తెలంగాణ / హైదరాబాద్ : ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ సభ్యుల ప్రవర్తనపై టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు తీవ్రంగా మండిపడ్డారు. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌పై దాడికి పాల్పడిన కాంగ్రెస్ ఎంఎల్‌ఏలపై ఏడాది సస్పెన్షన్ వేటు వేయాలని కొందరు, వారి ఎంఎల్‌ఏ పదవి ముగిసేంత వర కు సభ నుండి సస్పెండ్ చేయాలని మరికొందరు డిమాండ్ చేశారు. సభ ముగిసిన అనంతరం వేర్వేరుగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

ముందస్తు ప్రణాళిక ప్రకారమే : పాతూరి

ముందస్తుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారమే కాంగ్రెస్ సభ్యులు గూండాల్లా ప్రవర్తించారని శాసనమండలి ఛీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలి చైర్మన్ స్వామి గౌడ్‌పై దాడిని ఖండిస్తున్నామన్నారు. హేయం గా ప్రవర్తించిన సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలి రోజే కాంగ్రెస్ సభ్యుల ప్రవర్తన ఇలా ఉంటే మిగతా రోజుల్లో ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు యాత్రలో సంస్కార హీనంగా ప్రవర్తించిన కాంగ్రెస్ నేతలు అసహనంతో సాక్షాతూ అసెంబ్లీలోనే భౌతిక దాడులకు దిగడం సిగ్గు చేటు అని వ్యాఖ్యానించారు.


ఇది బ్లాక్ డే: బోడకుంటి

తెలంగాణ శాసన సభ చరిత్రలోనే బ్లాక్ డే అని మండలి విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు అన్నారు. స్వామి గౌడ్‌పై కాంగ్రెస్ సభ్యులు దాడి చేసి తమ అసహనాన్ని చాటుకున్నారని అన్నారు. గవర్నర్ మాట్లాడుతుండగా మొత్తం మూడు సార్లు కాంగ్రెస్ సభ్యులు దాడికి దిగారని అన్నారు. భౌతిక దాడులకు పాల్పడిన వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. మొత్తం బడుగు బలహీన వర్గాలపైనే కోమటి రెడ్డి దాడి చేసినట్టుగా భావిస్తున్నామన్నారు.

అనర్హత వేటెయ్యాలి : గంగాధర్ గౌడ్

కాంగ్రెస్ సభ్యులు బస్సు యాత్ర ఫెయిల్ అయ్యిందన్న అసహనాన్ని శాసనసభలో చూపారని, భౌతిక దాడులకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని ఎంఎల్‌సి వి.గంగాధర్‌గౌడ్, నారదాస్ లక్ష్మణ్‌రావులు అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ లో ఇలాంటి ఘటనే జరిగితే మూడేళ్ళ పాటు సభ్యుల పై వేటు వేశారని, చైర్మన్ స్వామి గౌడ్‌పై భౌతిక దాడి చేసిన వారిపై మొత్తం పదవీ కాలానికి సస్పెండ్ చేయాలని, మళ్లీ పోటీచేయకుండా అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు.

సభకు తాగొచ్చారు : పల్లా




కొందరు కాంగ్రెస్ సభ్యులు అసెంబ్లీకి తాగి వచ్చారని, మొత్తం శాసన వ్యవస్థనే తలదించుకునేలా కాంగ్రెస్ సభ్యులు ప్రవర్తించారని మండలిలో ప్రభుత్వ విప్ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కొందరు సభ్యులు ప్రతిపక్ష నేత జానారెడ్డిపై తూలిపడ్డారని, ఆయన తన సహచర సభ్యుల అల్లరి చూడలేక మధ్యలోనే లేచి వెళ్లి పోయారన్నారు. బూతులతో చెలరేగిన కాంగ్రెస్ సభ్యులను ఏడాది పాటు సస్పెండ్ చేయాలని, తాగి వచ్చి భౌతిక దాడులకు దిగిన వారిని అరెస్టు చేసి, మిగిలిన అసెంబ్లీ టర్మ్ మొత్తం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

స్వామిగౌడ్‌పై హత్యాయత్నం : జోగు రామన్న



శాసనసభలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా మండలి చైర్మన్ స్వామి గౌడ్‌పై కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు హత్యాయత్నం చేశారని బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. బిసి బిడ్డ మండలి చైర్మన్ కావడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. టిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉద్యమ సమయంలోనూ స్వామి గౌడ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం హత్యాయత్నం చేసిందన్నారు. మూడు రాజ్యసభ సీట్లలో రెండింటిని బిసిలకు ఇవ్వడం కోమటిరెడ్డి లాంటి వారికి కంటగింపుగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే గుండాల పార్టీ అని, బిసిలను అణగదొక్కిన పార్టీ అని, ఆ పార్టీని ప్రజా క్షేత్రం లో పాతర వేస్తామన్నారు.

పథకం ప్రకారమే దాడి : తలసాని



బలహీన వర్గాల ప్రతినిధి, శాసనమండలి ఛైర్మన్ స్వామి గౌడ్‌పై కాంగ్రెస్ ఎంఎల్‌ఏ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దాడి దుర్మార్గమని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ముందస్తుగా వేసుకున్న వ్యూహం ప్రకారమే కాంగ్రెస్ సభ్యులు దాడి చేశారని ఆరోపించారు. టిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ శాసనసభలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు గూండాల్లా ప్రవర్తించారని అన్నారు. ఎన్నడూ లేని విధంగా కెసిఆర్ నాయకత్వంలో అమలవుతున్న పథకాలను చూసి కాంగ్రెస్ నేతలకు అసహనం పెరుగుతోందన్నారు. చట్టపరంగా కాంగ్రెస్ సభ్యుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డెబ్బై సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత బడుగు ,బలహీన ,వెనకబడిన వర్గాలకు కెసిఆర్ హాయం లోనే తెలంగాణలో స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఒకేసారి ఇద్దరు వెనుకబడిన వర్గాల ప్రతినిధులకు రాజ్యసభ అవకాశం కల్పించిన సిఎం కెసిఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వారిని సస్పెండ్ చేయాలి : శ్రీనివాస్ గౌడ్

చైర్మన్ స్వామిగౌడ్‌పై దాడులకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మొదట కాంగ్రెస్ పార్టీ భౌతిక దాడులకు పాల్పడ్డ వారి నేతలను సస్పెండ్ చేయాలని టిఆర్‌ఎస్ ఎంఎల్‌సి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గూండాల్లా ప్రవర్తించారన్నారు. దాడి చేసిన వారిపై కాంగ్రెస్ పరంగా చర్యలు తీసుకోనట్లయితే బిసి సంఘాలతో కలిసి ధర్నా చేస్తామని ఎంఎల్‌ఏ గంగుల కమలాకర్ హెచ్చరించారు.



19 నుంచి పాస్‌బుక్‌ల ముద్రణ?

మన తెలంగాణ / హైదరాబాద్ : పట్టాదారు పాస్‌బుక్‌ల ముద్రణ ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఈ నెల 15 నుంచి 18 వరకు అన్ని గ్రామాల్లో రైతుల భూమి పట్టాలకు సంబంధించిన వివరాలను ప్రదర్శనకు ఉంచాలని, రైతుల నుంచి అందే ఫిర్యాదులను పరిశీలించి అవసరమైన సవరణలు చేసి డిజిటల్ సంతకాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా చొరవ తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సిసిఎల్‌ఎ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌లతో జరిగిన వీడియా కాన్ఫరెన్సు సందర్భంగా ఈ అంశాలను స్పష్టం చేసినట్లు తెలిసింది.ఈ నెల 18వ తేదీకల్లా భూ రికార్డులకు సంబంధించి తుది మార్పులు జరిగి తాహసీల్దార్ల డిజిటల్ సంతకాలు జరిగితే ఆ డాటా ఆధారంగా పాస్‌బుక్‌ల ముద్రణ 19వ తేదీ లేదా 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు సిసిఎల్‌ఎ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు పాస్‌బుక్‌ల ముద్రణకు ముందుకొచ్చిన ఎనిమిది ప్రైవేటు ప్రింటింగ్ ప్రెస్‌లలో మూడింటికి తగిన సాంకేతిక అర్హతలు లేకపోవడంతో పోటీ నుంచి తప్పుకున్నాయి. ఈ వారం రోజుల వ్యవధిలో ఆ ప్రక్రియను పూర్తిచేసే సమయానికి తహసీల్దార్ల డిజిటల్ సంతకాలు పూర్తవుతాయని, ఆ ప్రకారం ప్రింటింగ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నాయి. కొన్ని భద్రతా ప్రమాణాలను తగ్గించినందువల్ల రెండు వారాల వ్యవధిలో 72 లక్షల పాస్‌బుక్‌ల ముద్రణ పూర్తయ్యే అవకాశముంది.

ఇది బ్లాక్ డే : టిఆర్ఎస్

మన తెలంగాణ/హైదరాబాద్ : ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తున్నపుడు శాసనమండలి ఛైర్మన్ కుర్చీని అవమానపరిచే విధంగా కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టిఆర్ఎస్ ఎంఎల్‌ఎ కొండా సురేఖ అన్నారు. ఛైర్మన్‌పై దాడిని టిడిపి ఖండించకపోవడం బాధాకరమన్నారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలపకుండా ఉద్దేశపూర్వకంగానే దాడికి పాల్పడటం మంచి పద్ధతి కాదని, ఇది 'బ్లాక్ డే' అని వ్యాఖ్యానించారు. టిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు జీవన్ రెడ్డి, షకీల్ అహ్మద్, ఒడితెల సతీష్ గౌడ్‌లతో కలిసి సురేఖ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. సభలో ఏ సమస్య ఉన్నా చర్చించేందుకు సిద్ధంగాఉన్నామని, ప్రభుత్వ వైఫల్యాలు ఉంటే ఎండగట్టాలని చెప్పినా కాంగ్రెస్ సభ్యులు పెడచెవిన పెట్టి ప్రవర్తించిన తీరు విస్మయాన్ని కలిగించిందన్నారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రచ్చ చేయడానికే ముందస్తుగా వేసుకున్న ప్రణాళికల్లో భాగంగానే కాంగ్రెస్ సభ్యు లు దాడి చేసారన్నారు. బస్సుయాత్ర తుస్సు కావడంతో అసహనంతో హెడ్‌సెట్ విసిరేసారన్నారు.

దాడులు సహించం : శ్రీనివాస్ గౌడ్

ప్రధాన ప్రతిపక్ష నేత సమక్షంలోనే శాసనసభ వేదికగా మండలి ఛైర్మన్‌పై కాంగ్రెస్ పార్టీ దాడులకు పాల్పడడం సిగ్గు చేటని టిఆర్ఎస్ ఎంఎల్‌ఎ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పొరపాటున కండ్లలో కుచ్చుకుని గాయం మాత్రమే అయిందని, కంటిచూపే పోయి ఉంటే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది మేమేనంటూ ఎన్నికల్లో ఎంతగా ప్రచారం చేసుకున్నా ప్రజలు ఛీ కొట్టారని, అయినా ఆ పార్టీ నాయకులకు బుద్ధి రావడం లేదన్నారు. ఇలాంటి దాడులను ఇకపై అసెంబ్లీ వేదికగా సహించబోమన్నారు. కాంగ్రెస్ పాలనలో ఈ రాష్ట్రం దివాలా తీసిందని, వ్యవసాయం, కుల వృత్తులు చిన్నాభిన్నం అయ్యాయని అన్నారు.

గవర్నర్ నిజాలే చెప్పారు : నారదాసు

ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగంలో అన్నీనిజాలే ఉన్నాయని టిఆర్ఎస్ ఎంఎల్‌సి నారదాసు లక్ష్మణరావు అన్నారు. 125 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ ఇలాంటి దుష్ట చర్యకు పాల్పడడం సరికాదన్నారు. రైతులకు పంట నష్టం కింద డబ్బులుఅందజేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఎన్నడైనా ఉందా అని ప్రశ్నించారు.సభలో చెప్పుకోవడానికి ఆ పార్టీకి ఏం లేకనే ఇలాంటి దాడులకు పాల్పడ్డారన్నారు.

దాడిని ఖండిస్తున్నాం : కర్నె ప్రభాకర్

పేపర్లు విసరడంలో అనుభవజ్ఞులుగా ఉన్న కాంగ్రెస్ నేతలు సాక్షాత్తూ గవర్నర్‌పై విసరడం దురదృష్టకరం, అవాంఛనీయం అని టిఆర్ఎస్ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ అన్నారు. మరో ఎంఎల్‌సి శంభీపూర్ రాజుతో కలిసి ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. మండలి ఛైర్మన్‌పై ఇలాంటి దాడులను టిఆర్ఎస్ ఎల్పీ పక్షాన ఖండిస్తున్నామన్నారు. గవర్నర్ ప్రసంగం ప్రారంభించగానే అందులో ఏముందో కూడా చూడకుండా దాడులకు పాల్పడడాన్ని తెలంగాణ సమాజం అసహ్యించుకుంటోందన్నారు. దేశంలోని సామాన్య ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని, జానారెడ్డి సమక్షంలోనే ఇలాంటివి జరగడం సరికాదన్నారు.


ఇక్కడో నీతి, అక్కడ మరో నీతా?

టిఆర్ఎస్‌పై బిజెపి నేతల ఆగ్రహం




అసెంబ్లీ సమావేశాలకు నీతులు చెబుతున్న అధికార టిఆర్ఎస్, పార్లమెంట్‌లో ఆ పార్టీ సభ్యులు వెల్‌లోకి వెళ్లి స్పీకర్ ముఖం ఎదుటే ప్లకార్డులను ఎలా ప్రదర్శిస్తున్నారని బిజెపి శాసనసభాపక్ష నేత కిషన్ రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీలో సభ్యులు ప్రవర్తించాల్సిన తీరుపై సందేశం ఇచ్చే టిఆర్ఎస్ పార్లమెంటులో తమ పార్టీ ఎంపిలకు ఎందుకు వర్తింపజేయడంలేదని ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో సోమవారం ఎంఎల్‌సి ఎన్.రాంచంద్రరావుతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ శాసనసభ ప్రాధాన్యతను ప్రభుత్వం తగ్గిస్తోందని ఆరోపించారు. గవర్నర్ విదేశీ పర్యటన కోసమే అసెంబ్లీ సమావేశాలను కుదించడం మంచి పద్ధతి కాదని, విదేశీ పర్యటన నేపథ్యంలో సమావేశాలను కూడా ముందుగానే ప్రారంభించి ఉండవచ్చుగదా అని వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రసంగంలో ఉద్యోగాల భర్తీ పై స్పష్టత ఇవ్వలేదని, రైతులకు గిట్టబాటు ధరలను ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. రైతుల ఆత్మహత్యలు, తాగు, సాగు నీటి ఎద్దడిని పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో పోలీసుల నిర్బంధాలు పెరుగుతున్నాయన్నారు. రిజర్వేషన్లపై టిఆర్ఎస్ అనవసరంగా పార్లమెంట్‌లో గొడవ చేస్తుందని, వారికి రాత్రి కలరాగానే ఉదయమే పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలా అని ఎద్దేవా చేశారు. రాంచంద్రరావు మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో పురోగతి కనిపించలేదన్నారు. ప్రజల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందన్నారు.

టిఆర్ఎస్ ద్వంద్వ వైఖరి : టిడిపి



రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు సమస్యలు,నిరసనలు తెలిపేందుకు నగరంలోని ధర్నాచౌక్‌ను ఎత్తివేయిం చిన సిఎం కె.చంద్రశేఖర్‌రావు మాత్రం ఢిల్లీ వెళ్లి జంతర్‌మంతర్ దగ్గర ధర్నా చేస్తారా ఇదేం ద్వంద వైఖరి అని టిడిపి ఎమ్ఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య ప్రశ్నించారు. ఇక్కడ ధర్నాలు చేయకుండా అడ్డుకుంటున్నవారికి ఢిల్లీలో ధర్నా చేసే అర్హతే లేదన్నారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించిన అనంతరం ఎంఎల్‌ఎ ఆర్.కృష్ణయ్యతో కలిసి సండ్ర మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ,గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం చేపట్టిన, చేపట్టబోతున్న కార్యక్రమాలపై ఎటువంటి స్పష్టత లేదని, సంక్షేమరంగాన్ని పూర్తిగా విస్మరించారని అన్నారు.ఎస్‌సి వర్గీకరణ లేదని గవర్నర్ ప్రసంగాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూపసలేని ప్రసంగాన్ని గవర్నర్‌చేశారన్నా రు.బడుగు, బలహీనవర్గాలను ప్రస్తావించకుండా డబ్బా కొట్టుకున్నారన్నారు.

వాస్తవాలకు దూరంగా ప్రసంగం



మన తెలంగాణ/హైదరాబాద్ : వాస్తవాలకు దూరంగా గవర్నర్ ప్రసంగం ఉందని సిపిఐ(ఎం) ఎంఎల్‌ఎ సున్నం రాజయ్య విమర్శించారు.దీనిని తీవ్రం గా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ అటవీ హక్కు చట్టాన్ని ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, దళితులు, గిరిజనుల ప్రస్తావనే గవర్నర్ ప్రసంగంలో లేదన్నారు. పోడు భూములు, కౌలు భూమి సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.4 వేలు పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎండ తీవ్రత పెరుగుతోందని, నిర్దిష్టమైన కార్యక్రమాలు ఏమీ ప్రభుత్వం చేపట్టడం లేదన్నారు.




అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజు గవర్నర్ నరసింహన్‌ను తోడ్కొని వస్తున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్, స్పీకర్ మధుసూదనాచారి, సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావు

ఆదర్శ రాష్ట్రం

- మూడున్నరేళ్లలో ఘనమైన ప్రగతి సాధించాం
- క్లిష్టతరమైన లోటును పూడ్చుకొని ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతున్నాం
- అసెంబ్లీ సంయుక్త సమావేశంలో గవర్నర్ నరసింహన్ ప్రసంగం

మన తెలంగాణ / హైదరాబాద్: మూడున్నరేళ్లలో ప్రభుత్వం అనేక సవాళ్లను అధిగమిస్తూ వివిధ రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధించిందని, అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ బంగారు తెలంగాణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, కొత్త రాష్ట్రమే అయినా యావత్తు దేశానికి ఆదర్శంగా నిలిచిందని గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ వ్యాఖ్యానించారు.రాష్ట్ర బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం ఉభ య సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తూ,దశాబ్ధాలుగా క్లిష్టతరమైన ఆర్థిక లోటును పూడ్చడమే కాకుండా ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతోందని చెప్పారు. కాళేశ్వరం సహా ఇతర భారీ ప్రాజెక్టులను త్వరలోనే పూర్తిచేస్తామని, రైతులకు గోదావరి, కృష్ణా జలాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రగతి వైపు ప్రయాణిస్తోందని, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికలు, గొర్రెల పంపిణీ, కల్యాణ లక్ష్మి , రైతులకు రుణమాఫీ తదితర పథకాలను విజయవంతంగా అమలుచేస్తోందని గవర్నర్ వివరించారు.ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేడంలో గణనీయమైన సానుకూల ప్రభావాన్ని చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రశంసలు పొందాయయని గవర్నర్ చెప్పారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఆర్థిక రంగంలో పురోగతి సాధిస్తున్నామని, ప్రతి ఏడాది ఆర్థికాభివృద్ధిరేటు పెరుగుతూనే ఉన్నదని, గడిచిన మూడేళ్లలో సరాసరి వార్షిక వృద్ధి రేటు (జిఎస్‌డిపిలో) 8.6% నమోదైందని, జాతీయ సరాసరి సగటు 7.5%తో పోల్చుకుంటే ఇది 1.1% అధికమని పేర్కొన్నారు. 2016–17లో జాతీయ తలసరి ఆదాయం రూ.1.03 లక్షల కాగా రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1.54 లక్షలుగా ఉందన్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు సాగునీరు అందించేందుకు అనేక భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులను నిర్మిస్తూ కృష్ణా, గోదావరి జలాలను పొలాలకు మళ్లిస్తోందని వివరించారు. మొత్తం 23భారీ,13 మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులను చేపట్టామని, కాళేశ్వరంప్రాజెక్టుకు ప్రభు త్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. ఇప్పటివరకు 16.64 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీటి సదుపాయాన్ని కల్పించగా, 8.97 లక్షల ఎకరాల ఆయుకట్టును స్థిరీకరించినట్లు వివరించారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతుల సంక్షేమానికి చేపట్టిన చర్యల్లో భాగంగా 35.3 లక్షల మంది రైతులకు లక్ష రూపాయలలోపు రుణాలను మాఫీ చేశామన్నారు. మరోవైపు నాయణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు సరఫరా చేస్తూ సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తూ గ్రీన్ హౌస్, పాలీహౌస్‌ల దిశగా రైతులను మళ్ళిస్తూ వారి ఆదాయాన్ని పెంచడంతో పాటు గత ఏడాది ఆహార ఉత్పత్తిని 101.29 లక్షల టన్నులకు పెంచామని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడేనాటికి గోడౌన్ల సామర్థ్యం కేవలం 4.17 లక్షల టన్నులు మాత్రమేనని, ఇప్పుడు 356 శాస్త్రీయ గోడౌన్లను నిర్మించి 18.30 లక్షల టన్నులకు పెంచామని తెలిపారు.

అధిక జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉందని, ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా 23 లక్షల పంపు సెట్లకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. కేవలం వంద రోజుల వ్యవధిలోనే 10,823 గ్రామాల్లో భూ రికార్డుల ప్రక్షాళనను విజయవంతంగా పూర్తిచేశామని, త్వరలోనే రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను అందజేస్తామన్నారు. రాష్ట్రంలో గొర్రెల పంపిణీ పథకం ప్రగతిదాయకంగా ఉందని, గొల్ల కురుమలకు 75 శాతం సబ్సీడీతో ఇప్పటికే 50.10 లక్షల గొర్రెలను అందించామన్నారు.మాంసం ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రం ఎదుగుతోందన్నారు. వంద సంచార పశు వైద్యశాలల ద్వారా సుమారు1.62 లక్షల పశువులకు వైద్యం అందించినట్లు తెలిపారు.మిషన్ భగీరథ పనులు 95% పూర్తి అయ్యాయని,5,500 గ్రామీణ ప్రాంతాలకు, 13 పట్టణ ప్రాంతాలకు నీటి సరఫరాను అందజేయగా రెండున్నర వేల గ్రామాల్లో ఇంటింటికీ నల్లా ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు దేశవ్యాప్తంగా ప్రశంసలు లభించాయని, పలు రాష్ట్రాల అధికారులు వచ్చి అధ్యయనం చేశారన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణతో భూగర్భ జలాలు పెరిగాయని చెప్పారు. రాష్ట్రం ఏర్పాటు అనంతరం విద్యుత్ ఉత్పత్తిలో గణనీయమైన ప్రగతి సాధించామని, పరిశ్రమలకు రెండు రోజుల పవర్ హాలిడేను ఎత్తివేసి నిరంతరం విద్యుత్ సరఫరా చేసే స్థాయికి చేరుకుందన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి విద్యుత్ ఉత్పత్తి 7,778 మెగావాట్లు ఉంటే ఇప్పుడుఅది 15,344 మెగావాట్లకు పెరిగిందని, మరో 12,931 మెగావాట్లను జోడించి మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఆవిర్భవిస్తుందని, కొన్ని విద్యుత్ ఉత్పత్తిప్లాంట్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో కూడా 3,283 మెగావాట్లతో దేశంలోనే ముందున్నామన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు 517 ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ గురుకుల పాఠశాలలను ప్రారంభించామని వివరించారు. ఆరోగ్య రంగంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'కెసిఆర్ కిట్'కు మంచి స్పందన లభిస్తోందని, దీనివల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందని తెలిపారు. ప్రభుత్వం రవాణా రంగానికి కూడా అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గతేడాది హైదరాబాద్ మెట్రో రైల్ ప్రారంభమైందని, పిపిపి పద్ధతిలో చేపట్టిన అతిపెద్దదైన ఈ ప్రాజెక్టు మొదటి దశలో భాగంలో 30 కిలో మీటర్ల మార్గం ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. జాతీయ రహదారులను జిల్లా, మండల రహదారులతో అనుసంధానం చేస్తున్నట్లు వెల్లడించారు. నేతన్నకు 'చేయూత' పథకం ద్వారా చేనేతలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. వరంగల్‌లో ఏర్పాటు కానున్న మెగా టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం 23 సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు గవర్నర్ వెల్లడించారు. శాసనసభ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని, సభలో చర్చలు ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఆశిస్తున్నారు. తొలుత తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించిన గవర్నర్ చివరలో ప్రపంచ తెలుగు మహసభలపై తెలుగులోనే మాట్లాడి ప్రసంగాన్ని ముగించారు.

ఐటికి హైదరాబాద్ కేంద్రం

తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామంగా, ఐటి పరిశ్రమలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందన్నారు. త్వరలోనే టిహబ్–2ను ప్రారంభించనున్నామని, బుద్వేల్‌లో ఐటి క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పరిశ్రమల అభివృద్ధికి 'టిఎస్ ఐపాస్' పాలసీని రూపొందించామని, దరఖాస్తు చేసుకున్న పదిహేను రోజుల వ్యవధిలోనే అనుమతులను మంజూరు చేస్తున్నామని, 6,206 పారిశ్రామిక యూనిట్లు ఏర్పడ్డాయని,ఇందులో 3,703 యూనిట్లు కార్యకలాపాలను ఇప్పటికే ప్రారంభించాయని, సుమారు 4.47 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు నెలకొన్నాయని, ఇప్పటివరకుమొత్తం రూ.1.18 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి సమకూరాయని తెలిపారు.హైదరాబాద్ నగరం 1500 ఐటి పరిశ్రమలకు కేంద్రంగా మారిందని, సుమారు 4.30 లక్షల మంది పనిచేస్తున్నారని,గత ఆర్థిక సంవత్సరంలో సాఫ్ట్‌వేర్ ఎగుమతులు రూ. 85,470 కోట్లకు చేరుకుందని గవర్నర్ పేర్కొన్నారు. ఐటి రంగంలో 'స్టార్టప్'లను ఆకర్షించేందుకు 'టిహబ్'ను ప్రారంభించామని, బుద్వేల్ కేంద్రంగా మరో ఐటి కారిడార్‌ను నిర్మించే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. ద్వితీయశ్రేణి నగరాలైన వరంగల్, కరీంనగర్, ఖమ్మం,నిజామాబాద్‌లకు కూడా ఐటి రంగాన్ని విస్తరింపజేస్తున్నట్లు తెలిపారు.

గవర్నర్‌తో అన్నీ అబద్ధాలే చెప్పించారు : కాంగ్రెస్



మన తెలంగాణ/హైదరాబాద్ : గవర్నర్ ప్రసంగంలో ప్రధాన అంశాలను పొందుపర్చలేదని, చెప్పిన అంశాలన్నీ అబద్దాలేనని టిపిసిసి అధ్యక్షులు కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డివ్యాఖ్యానించారు. ప్రభుత్వం తమపై సభలో పోలీసులను ఎగదోసి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని, సభలో తమ గొంతు నొక్కేశారని ఆరోపించారు. తాము12, 13 మందిఎంఎల్‌ఎలు మాత్రమేనని 50 మంది పోలీసులను పెట్టి అణచివేశారని, గాయాలు కూడా అయ్యాయన్నారు. పార్లమెంట్‌లో పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలుపుతున్నారని, తాము కూడా ప్రజాస్వామ్య పద్ధతితో నిరసన తెలుపుతుంటే టిఆర్ఎస్ ప్రభు త్వం కావాలనే పోలీసులతో దాడి చేసిందన్నారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం చేసిన అనంతరం కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు భట్టి విక్రమార్క, రామ్మోహన్ రెడ్డి, చిన్నారెడ్డి, గీతారెడ్డి, డికె అరుణ, సంపత్ కుమార్, కోమటిరెడ్డి, ఎంఎల్‌సి షబ్బీర్ అలీ, ఆకుల లలితలతో కలిసి ఉత్తమ్ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. గవర్నర్ ప్రభుత్వాన్ని వ్యక్తిగతంగా ప్రచారం చేసే విధంగా మాట్లాడడం తగదన్నారు. సిఎం కెసిఆర్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పూర్తిగా దిగజార్చారని... రాష్ట్రాన్నిఅప్పుల కుప్ప గా మార్చారని విమర్శించారు. 60 ఏండ్లలో రూ.69 వేలకోట్ల అప్పులు చేస్తే నాలుగేండ్లలో టిఆర్ఎస్ ప్ర భుత్వం 1.40 లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్ర భావితరాలను తాకట్టుపెట్టిందన్నారు.సాగునీటిప్రాజెక్టుల్లో జరిగే అవినీతిపై గవర్నర్ ప్రసంగించి ఉంటే బాగుండేదని అంతకంతకు పెరిగిన వ్యయంపై ఎందుకు ప్రస్తావించలేదన్నారు.కాళేశ్వరానికిజాతీయహోదా రాకపోవడానికి ప్రభు త్వం రీడిజైనింగే కారణమన్నారు.కొత్తగా16 లక్షల ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీరందిస్తున్నారని, అది కూడా తాము ప్రారంభించిన ప్రాజెక్టులతోనేనని,కోటి ఎకరాల మాగాణ ఎటుపోయిందని విమర్శించారు. ముస్లిం, గిరిజన రిజర్వేషన్ గురించి ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. గత పదేళ్లలో ఇలా తక్కువ సమయంలో గవర్నర్ ప్రసంగాన్ని ముగించడాన్నితానెప్పుడూ చూడలేదని ఎంఎల్‌ఎ చిన్నారెడ్డి అన్నారు.

తాగొచ్చారనడం అవమానించడమే: జానారెడ్డి



మన తెలంగాణ/ హైదరాబాద్: కాంగ్రెస్ ఎంఎల్‌ఏలు మద్యం తాగి సభకు వచ్చారని టిఆర్ఎస్ ఎంఎల్‌సి పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించడం శాసనసభను అవమానించడమేనని కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకులు కుందూరు జానారెడ్డి అన్నారు. అలాంటి వారు ఎవరైనా ఉంటే స్పీకర్ పరీక్షించి చర్యలు తీసు కోవాలని కోరారు.గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రస్తావన లేకపోవడంతో తమ సభ్యులు ఆవేదనతో నిరసన వ్యక్తం చేశారని, ఆ స్ఫూర్తిని అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ సభ్యులు ప్రజాస్వామికంగానే సభలో నిరసన తెలిపారని, టిఆర్ఎస్ ఎంపిలు పార్లమెంట్‌లో ఇదే విధంగా నిరసనలు తెలుపుతున్న విషయాన్ని అధికార పార్టీ గుర్తుంచుకోవాలన్నారు. తమ ఎంఎల్‌ఏ ల పట్ల మార్షల్స్ దురుసుగా ప్రవర్తించారని, తన టేబుల్ ఎదుట ఎంఎల్ ఏలను నెట్టడంతో అది విరిగి తనకు వొత్తుకుపోయిందన్నారు.సిఎల్‌పి కార్యాలయంలో సిఎల్‌పి ఉపనేతలు టి.జీవన్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమా ర్కలతో కలసి సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాటాడారు. ప్రజల బాధలు గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావన లేకపోవడం తమను తీవ్ర అసహానానికి గురిచేసిందని, ప్రజా స్వామి కంగానే నిరసన తెలిపాలంటే కనీ సం పోడియం వద్దకు పోనియ్యకుండా మార్షల్స్ అడ్డుకున్నారని తెలిపారు. తమ కంటే ఎన్నో రెట్లు ఎక్కువ మంది మార్షల్స్ సభలో అడ్డుగా నిలబడ్డారని, వారు సభ్యులను నెట్టడంతో చివరకు తన ముందు టేబుల్ విరిగి బరువుపడడం తో అక్కడి నుండి లేచి వెళ్ళాల్సివచ్చిందన్నారు. గతంలోగవర్నర్ ప్రసంగాన్ని ఇంత కంటే ఎన్నో రెట్లు టిఆర్ఎస్ అడ్డుకున్నదని, సభ్యులపై నడుచుంటూ గవర్నర్ ప్రసంగాన్ని అడ్డు కున్న ఘటన గుర్తుంచుకో వాలన్నారు. పార్ల మెంటులో తెలంగాణ బిల్లు వచ్చిన సందర్భంగా నాటి తమ ఎంపి పొన్నం ప్రభాకర్‌పై పెప్పర్ స్ప్రేతో దాడి చేసినా సంయమనం పాటించామని చెప్పారు. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వం వింత నాటకం ఆడుతోందని, ప్రతిపక్షం లేకుండా చేసేందుకు మండలి చైర్మన్‌కు గాయమైనట్లు ప్రభుత్వం చెబుతోందని, ఇది ముమ్మాటికీ కుట్రేనని ఆరోపించారు. మండలి చైర్మన్‌కు ఎలాంటి దెబ్బ తగలలేదని, ప్రసంగం తర్వాత ఆయన గవర్నర్‌ను బయటి వరకు వచ్చి సాగనంపారని, అప్పుడు బాగానే కనిపించారని అన్నారు. జీవన్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఘటనకు సిఎందే బాధ్యత అని, ఈ ఘటనకు కుట్ర టిఆర్ఎస్‌ఎల్‌పి భేటీలోనే జరిగిందన్నారు.

సమావేశాలు ముగిసే వరకు

కోమటిరెడ్డిపై వేటు?

రాజ్యాంగ నిపుణులతో సంప్రదింపులు

స్వామిగౌడ్‌పై దాడిని ఖండించిన బిఎసి

మన తెలంగాణ/ హైదరాబాద్ : బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం సమయంలో చోటు చేసుకున్న పరిణామాలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. గవర్నర్ ప్రసంగిస్తుండగా ఆయనపై ప్రసంగ పాఠం పుస్తకాన్ని చింపి విసరడం, మైకులను, హెడ్‌ఫోన్లను లాగేసి అటు వైపు వేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విసిరిన హెడ్‌ఫోన్ శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ కంటికి తగిలి గాయమైన వ్యవహారాన్ని తేలిగ్గా వదిలిపెట్టొద్దని భావిస్తుంది. కోమటిరెడ్డిపై బడ్జెట్ సమావేశాలు ముగిసేంత వరకు సస్పెన్షన్ వేటు వేసే విషయాన్ని పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అక్కడితో విడిచి పెట్టకుండా ఈ వ్యవహారంపై విచారణ జరిపేలా ఎథిక్స్ కమిటీకి ప్రతిపాదించాలని కూడా యోచిస్తున్నట్లు తెలిసింది. దీనిపై మంగళవారం సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టే అవకాశం ఉంది. గవర్నర్ ప్రసంగం సందర్భంగా దూకుడుగా వ్యవహరించిన మరో ముగ్గురు కాంగ్రెస్ సభ్యులపై చర్యలు తీసుకునే విషయంలో కూడా తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాల అసెంబ్లీల్లో ఇలాంటి జరిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే అంశంపై కూడా స్పీకర్ కార్యాలయం సమాచారం సేకరించడం, అడ్వొకేట్ జనరల్, రాజ్యాంగ నిపుణులతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. గతంలో మహారాష్ట్ర , మధ్యప్రదేశ్‌లో సభలో అవాంఛనీయంగా వ్యవహరించిన ఘటనల్లో కారకులైన ఎంఎల్‌ఏలను సుదీర్ఘ కాలం సస్పెండ్ చేసిన ఉదంతాలు ఉన్నాయి. గవర్నర్ ప్రసంగం సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై శాసనసభ బిఎసి సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. ఈ అంశం పై ఎంఐఎం శాసనసభా పక్ష నాయకులు అక్బరుద్దీన్ ఓవైసీ తీవ్ర స్థాయిలో మండిపడినట్లు తెలిసింది. ఈ ఘటన దేశ ప్రజాస్వామ్యంలోనే మాయని మచ్చ అని, కారకులపై కఠిన చర్య తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. సిఎల్‌పి నాయకుడు జానారెడ్డి మొత్తం ఘటనపై విచారం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ ఘటన వీడియోలను పరిశీలించి, నిర్ణయం తీసుకునే అధికారాన్ని బిఎసి సమావేశం స్పీకర్‌కు కట్టబెట్టినట్లు సమాచారం. శాసనమండలి బిఎసి సమావేశం చైర్మన్ స్వామిగౌడ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఇదిలా ఉండగా సభ ముగిసిన తరువాత బిజెఎల్‌పి కార్యాయంలో బిజెఎల్‌పి నేత జి.కిషన్‌రెడ్డితో సిఎల్‌పి నేత కె.జానారెడ్డి, ఉపనేత టి.జీవన్‌రెడ్డి లు భేటీ అయ్యారు.

"ఒక పర్వతాన్ని అధిరోహించిన తర్వాతే ... ఇంకా ఎక్కాల్సిన పర్వతాలు ఎన్నో ఉన్నాయని తెలుస్తుంది.
– నెల్సన్ మండేలా"



అపూర్వమైన రైతు మహాయాత్ర

సంపాదకీయం

ముప్పదివేలకుపైగా మహారాష్ట్ర రైతులు నాసిక్‌నుంచి ముంబయికి సుమారు 180 కిలోమీటర్లు సాగించిన మహాపాదయాత్ర స్వతంత్ర భారత చరిత్రలో రైతాంగ ఉద్యమాల్లో అపూర్వం. మార్చి 6న నాసిక్‌నుంచి 20వేలమందితో ప్రారంభమైన 'లాంగ్‌మార్చ్' ఆదివారం వాణిజ్య రాజధాని ముంబయి శివారుకు చేరింది. సోమవారం శాసనసభ ముట్టడి లక్ష్యంగా మొక్కవోని దీక్షతో సాగిన యాత్రలో దారిపొడవునా వివిధ ప్రాంతాలనుంచి రైతులు చేరటంతో అంతిమంగా 50వేలకు చేరింది. వ్యవసాయరంగం సంక్షోభంపట్ల పాలకపార్టీలు తగినంత దృష్టి సారించకపోవటంవల్ల ఇటీవల కాలంలో పలు రాష్ట్రాల్లో రైతులు స్వచ్ఛందంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం రైతు ఆందోళనకారులపై కాల్పులు జరిపి ముగ్గురిని బలిగొనటం గుర్తుచేసుకోదగింది. మహారాష్ట్ర రైతు యాత్ర అయత్నకృత ఆందోళనలకు భిన్నమైంది. అఖిలభారత కిసాన్‌సభ నాయకత్వంలో క్రమశిక్షణాయుతంగా నిర్వహించబడిన కార్యక్రమం. నడినెత్తిన సూరీడు నకనకలాడుతున్నా, కింద తారురోడ్డు సలసలకాలుతున్నా లెక్కచేయకుండా వజ్ర సంకల్పులై ఈ యాత్రలో పాల్గొన్న పురుష, స్త్రీ రైతులందరూ అభినందనలకు పాత్రులు.

ఈ యాత్ర ముంబయి చేరాక పాలక బిజెపి మినహా ప్రభుత్వ భాగస్వామి అయిన శివసేన సహా రాష్ట్రంలోని సర్వరాజకీయ పక్షాలు సంఘీభావం తెలపటం విశేషం. వచ్చే సంవత్సరం ఎన్నికలు రానున్నందున ఈ ఆందోళనను బిజెపికి వ్యతిరేకంగా భావించేవారు లేకపోలేదు. అయితే తమది రైతుల న్యాయమైన కోర్కెల సాధనకై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తలపెట్టిన కార్యక్రమంగా నిర్వాహకులు వివరించారు. ''రైతుల సమస్యల పట్ల సున్నితత్వంతో వ్యవహరించాలి. వాటికి ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనాలని'' ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి భయ్యాజీ జోషి ప్రభుత్వానికి సలహా ఇచ్చారంటే బిజెపి – గ్రామీణ భారతం మధ్య పెరుగుతున్న అగాధాన్ని ఆయన గ్రహించారనుకోవచ్చు. ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నావిస్ రైతు ప్రతినిధులతో చర్చలకై మంత్రుల బృందాన్ని నియమించారు. రైతుల ఆందోళనల నేపథ్యంలో ఇతర బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు పడ్నావిస్ కూడా రైతు రుణాల మాఫీ అంటూ రైతులకు ఉపశమనం కన్నా ప్రచారానికి ఉపయోగపడే అరకొర పథకం ప్రకటించారు. అదీ సక్రమంగా అమలు కాలేదు.

రైతుల రుణాలను పూర్తిగా రద్దు చేయాలి, వ్యవసాయోత్పత్తులకు న్యాయమైన ధర, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు, రాళ్లవానకు పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం వగైరా రైతుల డిమాండ్లలో ఉన్నాయి. ఆహార ధాన్యాలు, పప్పులు, పత్తిపంటల్లో ఉత్పత్తి తగ్గినందున 2017–18 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ వృద్ధిలో 8.3 శాతం రుణాత్మకత (ప్రతికూలత) ఉంటుందని మహారాష్ట్ర శాసనసభకు గతవారం సమర్పించిన ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఇటీవల రాళ్లవాన, పత్తికాయను తొలిచే క్రిముల (బోల్‌వామ్) దాడివల్ల పంటలకు మరింత నష్టం వాటిల్లింది. దిగుబడులు తగ్గినా, పెరిగినా సరైన ధర రాదు. వ్యవసాయ సంక్షోభానికి ఇది అద్దం పడుతోంది. ఆరుగాలం శ్రమించిన రైతుకుటుంబాలు అప్పులపాలై హతాశులవుతున్నారు. రైతు ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర ఒకటని గుర్తు చేసుకోదగింది.

వ్యవసాయరంగ సంక్షోభం, దానిపై ఆధారపడిన రైతులు, ఇతర గ్రామీణ ప్రజల దుస్థితి కొంత హెచ్చుతగ్గులతో దేశవ్యాప్తంగా ఉన్న తీవ్రమైన సమస్య. ఇందుకు ప్రకృతి మాత్రమే కాదు, ప్రభుత్వ విధానాలు కూడా కారణం. ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశాలను శిరసావహిస్తున్న కేంద్రప్రభుత్వం, పంట దిగుబడులు పెరిగినప్పుడు ఎగుమతులు అనుమతించకుండా, దిగుబడులు తగ్గినప్పుడు దిగుమతులు అనుమతిస్తూ రైతుల నడ్డివిరుస్తోంది. రైతుల పొట్టలు గొట్టే మార్కెట్ శక్తుల మాయలు షరా మామూలే. రైతుల ఉద్ధరణకు ఏవేవో చేస్తున్నామని ప్రభుత్వాలు ఎన్ని కబుర్లు చెబుతున్నా, వారి దుస్థితి నానాటికీ దిగజారటం వాటి వైఫల్యానికి నిదర్శనం. అందువల్ల జాతీయ స్థాయిలో సమగ్రమైన చర్చ జరగాలి – కొన్ని శాశ్వత పరిష్కారాలు రూపొందించి, కచ్చితంగా అమలు జరపనిదే ప్రభుత్వాలు రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు.


అన్నా హజారే మాట్లాడరేం?

చూపు

జన లోక్‌పాల్ బిల్లు కావాలని అన్నాహజారే అప్పుడు పట్టుపట్టారు. ప్రధానమంత్రి మోడీ కూడా పదవీబాధ్యతలు స్వీకరించగానే లోక్‌పాల్ నియమిస్తామని హామీ ఇచ్చేశారు. నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రధానమంత్రికి తన వాగ్దానం గుర్తుకు రాలేదు. అన్నాహజారేకి నిరాహారదీక్ష కూడా గుర్తుకు రాలేదు. కాని సుప్రీంకోర్టు అప్పుడప్పుడు ఈ విషయాన్ని గుర్తు చేస్తూనే ఉంది. అయినా ప్రభుత్వం లోక్‌పాల్ ఏర్పాటుకు గట్టి ప్రయత్నమేదీ చేయలేదు. ఈ మధ్యకాలంలో అనేక కుంభకోణాలు కూడా అలా వచ్చి ఇలా వెళ్ళిపోయాయి. అన్నాహజారే గారి పౌరసమాజం కాని, ప్రజలు కాని, మీడియా కాని ఎవరూ ప్రశ్నలు సంధించలేదు. లోక్ పాల్ ఎక్కడ అని నిలదీయలేదు. కాని సుప్రీంకోర్టు కాస్త గట్టిగానే అడిగింది. లోక్‌పాల్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలు చెప్పాలని కోరింది. చివరాఖరుకు మార్చి 1వ తేదీన లోక్‌పాల్ నియామక కమిటి మీటింగు జరపాలని నిర్ణయించారు. ఇది కూడా కంటి తుడుపు చర్యే. ప్రతిపక్షం నుంచి మల్లికార్జున్ ఖర్గేను ప్రత్యేక ఆహ్వానితునిగా పిలిచారు. ఆయన ఆ ఆహ్వానాన్ని తిరస్కరించారు. ఒక ఆదర్శ నాయకుని మాదిరి వ్యవహరించాలని ప్రధానికి హితవు పలికారు. ప్రత్యేక ఆహ్వానితునిగా అక్కడ హాజరై చేసేదేముంది? చర్చలో పాల్గొనే అవకాశం లేదు. నా అభిప్రాయాలను రికార్డు చేసే అవకాశం లేదు. ఓటింగ్ చేసే అవకాశం లేదు. ఇది కంటి తుడుపు చర్య. లోక్‌పాల్ ఎంపిక ప్రక్రియలో ప్రతిపక్షం కూడా పాల్గొంది అని చెప్పుకోడానికి మాత్రమే ఈ ఆహ్వానం పంపించారంటూ విమర్శించారు. లోక్‌పాల్ నియామక కమిటీలో ప్రతిపక్షమే లేదు. ప్రధానమంత్రి, ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభ స్పీకరు, ప్రముఖ న్యాయవేత్త ఈ కమిటీలో ఉన్నారు. ప్రతిపక్ష నాయకుడు కూడా ఈ కమిటీలో ఉండాలి. ప్రతిపక్షాల్లో అతి పెద్దపార్టీ అయిన కాంగ్రెసుకు ప్రధాన ప్రతిపక్షం హోదా లేదు కాబట్టి ప్రతిపక్ష నాయకుడిని ఈ కమిటీలో చేర్చలేదట. అన్నాహజారే గారు కోరిన జన లోక్‌పాల్ ఇది కాదుకదా. మరి అన్నాహజారే నేడు నోరువిప్పడం లేదు ఎందుకని? లోక్‌పాల్‌ను వెంటనే నియమించాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని కోరిన తర్వాత గాని ఈ కమిటీ సమావేశం తేదీ ప్రకటించలేదు. ప్రతిపక్ష నాయకుడు లేనందున నియామక ప్రక్రియ ఆపరాదని కూడా చెప్పింది. కాబట్టి ఇక ప్రధాన ప్రతిపక్ష నాయకుడు ఎవరు లేకుండానే నియామకం చేసేస్తారా? నియామక కమిటీలో పూర్తి స్థాయి సభ్యునిగా పిలవకుండా, ఏదో పిలిచామని చెప్పుకోడానికి ప్రత్యేక ఆహ్వానం అని పంపితే, అలాంటి సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితుడు పాల్గొని చేసేదేముంటుంది?

ఈ మధ్య మరో వార్త వచ్చింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు నుముంచి పారిపోయిన నీరవ్ మోడీ ఈ విషయంలో విచారణాధికారులకు సహకరించేది లేదని స్పష్టం చేశాడట. దోచుకున్న డబ్బులు కూడా నీరవ్ మోడీ ఇచ్చే అవకాశం లేదు. ఈ కేసులో మరో నిందితుడు మెహూల్ చౌకసీ ఎక్కడున్నాడో ఎవరికీ తెలియదు. ఒక కార్యక్రమంలో ఇంతకు ముందు ప్రధానమంత్రి ఈ మెహూల్ చౌకసీని మెహూల్ భాయీ అని అప్యాయంగా సంబోధించారు కూడా. నీరవ్ మోడీ దావోస్‌లో ప్రధానమంత్రితో పాటు ఫోటో దిగాడు. ఇప్పుడు వీళ్ళిద్దరు దేశం వదిలి పారిపోయారు.

దేశంలో అవినీతి కుంభకోణాలను అరికట్టడానికి లోక్‌పాల్ వంటి సంస్థ అవసరమని డా.ఎల్.ఎమ్. సంఘ్వి ప్రతిపాదించారు. స్వీడన్‌లో 1809లో బ్యూరోక్రసి అవినీతిని విచారించే సంస్థను పరిశీలించి,



అలాంటి సంస్థ మనకు అవసరమని చెప్పారు. భారతదేశంలో మొదటి లోక్‌పాల్ బిల్లు 1968లో, రెండవసారి 1971లో, మూడవసారి 1977లో ప్రవేశపెట్టారు. నాల్గవసారి 1985లో, ఐదవసారి 1989లో, ఆరవసారి1996లో, ఏడవసారి1998లో ప్రవేశపెట్టారు. ఎనిమిదవసారి 2001లో, తొమ్మిదవసారి 2011లో ప్రవేశపెట్టారు. 1968 నుంచి 2011 వరకు ఏడుగురు ప్రధానుల కాలంలో ఈ బిల్లు చట్టంగా మారలేదు. ఇప్పుడు ఈ సమస్య మోడీ గారి ముందు ఉంది. ఆయన అవినీతి గురించి చాలా కఠినంగా మాట్లాడుతున్నారు కానీ, అవినీతిపరులను నిరోధించడంలో చాలా మెతగ్గా వ్యవహరిస్తుంటారు. లోక్‌పాల్ నియామకానికి ఆయనెందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పుడు కూడా మార్చి 1వ తేదీ సమావేశం సుప్రీంకోర్టు తీవ్రంగా చెప్పిన మాటల తర్వాతనే ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఈ విషయమై తగిన చర్యలు వెంటనే తీసుకోకపోతే న్యాయస్థానం పట్ల అనుచిత వ్యవహారశైలిగా భావిస్తామని తీవ్రంగా చెప్పిన తర్వాతనే ఈ సమావేశానికి సిద్ధమయ్యారు. ఇంతకుముందు న్యాయస్థానం చెప్పిన తర్వాతనే విదేశీ ఖాతాల గురించి కూడా బయటపెట్టారన్నది జ్ఞాపకం చేసుకోవాలి. ప్రధాన మంత్రికి లోక్‌పాల్ నియామకం పట్ల ఏమాత్రం ఆసక్తి లేదు. ఈ నాలుగు సం॥ల కాలంలో ఆయన మీడియాతో మాట్లాడిందిలేదు. కేవలం తమకు అనుకూలంగా వ్యవహరించే ఒకటి రెండు మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇవ్వడం తప్ప. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో విలేఖరుల ప్రశ్నలకు జవాబులిచ్చే అలవాటు ఆయనకు లేదు. ఎన్నికల సభల్లో, ఇతర కార్యక్రమాల్లో తమ ప్రభుత్వ విజయాల గురించి చెప్పే మాటలే ఆయన పత్రికా సమావేశంలోను చెప్పవచ్చు. కాని అప్పుడు ప్రశ్నలు కూడా వస్తాయి కాబట్టి ఆయన మీడియా సమావేశాలంటే ఇష్టపడరు.

ఇప్పటి వరకు మీడియాలో ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలను చూసినా అవన్నీ చాలా పకడ్బందీగా, తమకు పూర్తి అనుకూలంగా ఉండే మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలే. ఒక హెడ్ మాస్టరు మాదిరిగా ఆయన చెబుతుంటే స్కూలు పిల్లల మాదిరిగా బుద్ధిగా వినడం తప్ప ఆ ఇంటర్వ్యూ చేసిన పాత్రికేయులు ఆయనను ఇబ్బందిపెట్టే ప్రశ్నలేవీ అడగలేదు. కాబట్టి లోక్‌పాల్ విషయంలో ఎన్నడూ మీడియా ఆయన్ను ప్రత్యక్షంగా ప్రశ్నించే అవకాశమే లేదు. మీడియా కూడా చాలా వరకు కొన్ని ప్రశ్నలు అడక్కూడదనే నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. ప్రధాని నిజంగా అవినీతిని అంతం చేయాలనుకుంటే లోక్‌పాల్ నియామకం ఆయనకు కష్టమేమీ కాదు. అందులో ఇబ్బంది పడవలసింది ఏదీ లేదు.

ప్రధాని లోక్‌పాల్ విషయంలో ఆసక్తి చూపించడం లేదు. రాఫెల్ విమానాల కొనుగోలు పౌరసమాజాన్ని ఉత్తేజపరిచి, యుపిఏ ఎన్నికల్లో పరాజయం పాలయ్యేలా చేసిన అన్నా హజారే కూడా ఇప్పుడు దాదాపు 30వేలకోట్ల కుంభకోణం బయటపడిన తర్వాతైనా, తదితర ఒప్పందాల విషయంలో అనుమానాలు బయటపడుతున్న నేపథ్యంలో అయినా మౌనవ్రతాన్ని వదిలి పౌరసమాజాన్ని మరోసారి ఉత్తేజితం చేయాలి, ఉద్యమించాలి. ప్రతిపక్షాలు ఈ కుంభకోణాల విషయంలో నామమాత్రంగా విమర్శలు, ఆరోపణలు గుప్పించడం తప్ప ప్రజాఉద్యమంగా ప్రజల్లోకి తీసుకు వెళ్ళే ఆలోచన చేయడం లేదు. కనీసం వామపక్షాలైనా అవినీతికి వ్యతిరేకంగా జాతీయస్థాయి ఉద్యమానికి సమాయత్తం కావాలి. కమలహాసన్ ఇటీవల తమిళనాట ప్రారంభించిన రాజకీయ పార్టీ ప్రధాన నినాదం అవినీతిని నిర్మూలించడమే, ఢిల్లీలో ఆప్ పార్టీ ఇదే నినాదంతో అధికారంలోకి వచ్చింది. ఈ పార్టీలు అవినీతిపై సమైక్య వేదికను నిర్మించే ప్రయత్నం చేయాలి.

✻ సబ

కశ్మీర్‌కు విఫల 'సందేశం'



వాహెద్
7093788843

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మిక గురువు, ప్రతి వివాదంలోను శాంతిదూతలా ప్రత్యక్షమయ్యే ప్రముఖ బాబా శ్రీశ్రీ రవిశంకర్ మార్చి 10వ తేదీన ''పైగామె ముహబ్బత్'' (ప్రేమసందేశం)పేరుతో శ్రీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమం రసాభాస అయ్యింది. కార్యక్రమానికి వచ్చిన వారు తీవ్రమైన నిరసన తెలియజేశారు. చివరకు శ్రీశ్రీ రవిశంకర్ తన ప్రసంగాన్ని అర్థాంతరంగా ముగించుకోవలసి వచ్చింది. ఆయన కార్యక్రమంలో ఆజాది నినాదాలే కాదు, మిలిటెంట్లకు అనుకూల నినాదాలు కూడా వినిపించాయి. షేరె కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో ఈ కార్యక్రమం జరిగింది. శ్రీశ్రీ రవిశంకర్ ఇక్కడ కీలకోపన్యాసం చేశారు. ప్రేమ సందేశం వినిపించడానికి ఇక్కడికి తనను పిలిచారని, కశ్మీరులో చాలా మంది మౌనంగా శాంతి కోసం పనిచేస్తున్నారని, ఇక్కడ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, ఆ రాజకీయేతర మానవీయ కార్యక్రమాల్లో భాగంగానే తాను వచ్చానని చెప్పి శ్రీ శ్రీ రవిశంకర్ ప్రసంగం ప్రారంభించారు. కాని ఆయన లేచి నిలబడగానే అక్కడ హాజరైన వారి లో అలజడి ప్రారంభమైంది. అబద్దాలు చెప్పి, మోసం చేసి తమను ఈ కార్యక్రమానికి పిలిచారని మండిపడ్డారు. బ్యాంకు రుణాలు రద్దు చేసే కార్యక్రమం అని చెబితే కొందరు వచ్చారంట. కుట్టుమిషన్లు పంచిపెడతామని కొందరిని పిలిచారట. షోపియాన్, పుల్వామా, బుడ్గామ్ వంటి దూరప్రాంతాల నుంచి కూడా ప్రజలు వచ్చా రు. పొద్దుట 8 గంటల నుంచి వారిని కూర్చోబెట్టి ఉంచారు. కనీసం పచ్చిమంచినీళ్ళు కూడా అక్కడ అందుబాటులో లేవు. క్రికెట్ కిట్లు పంచిపెడతారంటే కొందరు వచ్చారట. అలీషా గీలాని మాట్లాడతారంటే విండానికి కొందరు వచ్చారట. ఇలా అబద్దాలు చెప్పి ప్రజలను పిలిచిన తర్వాత శ్రీ శ్రీ రవిశంకర్ కీలకోపన్యాసం అంటూ మాట్లాడడానికి రాగానే మండిపడిన ప్రజలు ఆజాదీ, మిలిటెంట్లకు అనుకూల నినాదాలు చేస్తూ సభాస్థలి వదిలి వెళ్ళిపోయారు. కశ్మీరు ప్రజలను మోసగించడానికి కేంద్రప్రభుత్వం పన్నిన మరో పన్నాగమిదంటూ కొందరు విమర్శించడం కూడా ఆ సభలో వినిపించింది. కశ్మీరు ప్రజల విషయంలో బిజెపి, హిందూత్వ సంస్థల వైఖరి ఇక్కడి ప్రజలకు బాగా తెలుసు. మోడీని ప్రశంసించడంలో అలసట తెలియని శ్రీశ్రీ రవిశంకర్ విషయంలో కశ్మీరు ప్రజలకు మొదటి నుంచి వ్యతిరేకత ఉంది. కాని ఆర్ట్ ఆఫ్ లివింగ్ పత్రికా ప్రకటన మరోలా ఉంది. కశ్మీరు సాధారణ ప్రజలు శ్రీశ్రీ రవిశంకర్‌ను ఆహ్వానించారు. జమ్ము కశ్మీరు కోఆర్డినేషన్ కమిటీ పేరుతో సాధారణ ప్రజలు ఏర్పరచిన సంస్థ ఆయన్ను పిలిచింది. సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న కశ్మీరు సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనడానికి ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ తెలియజేసింది. బాబరీ మసీదు వివాదంలోను శ్రీ శ్రీ రవిశంకర్ బెదిరింపులతో ప్రతిపాదించిన శాశ్వత పరిష్కారాన్ని అందరూ చూశారు.

శ్రీశ్రీ రవిశంకర్ తన సభలో ఏం జరిగిందో నిజాయితీగా దేశంలోని ప్రజలందరికీ చెప్పాలని, జమ్ము కశ్మీరు ప్రజల మనోభావాలను అందరికీ తెలియజేయాలని అక్కడి శాసనసభ్యుడు రషీద్ అన్నారు. కశ్మీరు ప్రజలు గతాన్ని మరిచిపోవాలంటూ నీతులు చెప్పే ముందు శ్రీ శ్రీ రవిశంకర్ కేంద్రప్రభుత్వంతో కూడా గత కాలపు అహంకారాన్ని వదిలి వాస్తవికతను దృష్టిలో పెట్టుకుని కశ్మీరు సమస్య పరిష్కారానికి ముందుకు రావాలంటూ విజ్ఞప్తి చేయవలసిందని అన్నారు. కశ్మీరు ప్రజల కోసం శ్రీశ్రీ రవిశంకర్ ఎప్పుడైనా గొంతు విప్పారా? 1989 తర్వాతి నుంచి ఊచకోతలకు గురవుతున్నారని ఆయన అన్నాడు. కశ్మీరులో భద్రతాదళాల కాల్పుల్లో మరణిస్తున్న సాధారణ ప్రజల హత్యలను శ్రీ శ్రీ రవిశంకర్ ముందుగా ఖండించవలసింది అంటూ ఆయన ఇప్పుడిక్కడికి వచ్చి ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురించి కశ్మీరీలకు చెప్పడం గాయం పై కారం జల్లడం వంటిదన్నాడు. కశ్మీరీ ప్రజలకు ప్రేమసందేశం ఇచ్చే ముందు షోపియాన్ తదితర ప్రాంతాలకు, ఆర్మీ క్యాంపులకు వెళ్ళి ప్రేమసందేశం ఇవ్వాలని చెప్పాడు. దాదా పు లక్ష మంది మరణించిన తర్వాత, అపహరణలకు, చిత్రహింసలకు గురవుతున్నప్పుడు, పెల్లెట్ గన్స్ దాడులతో కనుచూపు కోల్పోతున్నప్పుడు, చివరకు మరణించిన వారి మృతదేహాలను కూడా కుటుంబసభ్యులకు ఇవ్వని వాతావరణంలో బతుకుతున్న వారికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ శ్రీ శ్రీ రవిశంకర్ కన్నా బాగా తెలుసని ఆయన అన్నాడు. తన సభలో వినిపించిన ఆజాది నినాదాలతో శ్రీ శ్రీ రవిశంకర్ కు వాస్తవాలు అర్థమై ఉండాలని చెప్పాడు.

> కశ్మీరులో ప్రజలు నాయకుల వెనక నడవడం లేదు. నాయకులే ప్రజల వెనక నడుస్తున్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించి కశ్మీరు సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించే దిశగా నిజాయితీతో కూడిన ప్రయత్నాలు జరగాలి. శ్రీనగర్ రాకముందే శ్రీ శ్రీ రవిశంకర్ తన నిజరూపం ఏమిటో స్పష్టంగా చూపించేశారు. బాబరీ మసీదు వివాదంలో మందిరానికి అనుకూలంగా తీర్పు రాకపోతే, మెజారిటీ ప్రజల మనోభావాలను గౌరవించకపోతే దేశం మరో సిరియా అయిపోతుందని రక్తపాతం జరిగిపోతుందని బెదిరించడంలో శాంతి సందేశం కాని, ప్రేమ సందేశం కానీ ఏదీ లేదు. ఇంత బాహాటంగా బెదిరింపులకు దిగిన మతతత్వ నాయకుడెవరూ లేదు. ఇలాంటి బెదిరింపులే ఒక ముస్లిం నాయకుడి నుంచి వస్తే ఈ పాటికి గగ్గోలు చెలరేగిపోయి ఉండేది. అనేక కేసులు దేశవ్యాప్తంగా నమోదయ్యేవి. అరెస్టు జరిగేది. కాని శ్రీ శ్రీ రవిశంకర్ ఏం చెప్పినా చెల్లుతుందన్నట్లు నెలకొన్న వాతావరణంలో ఆయన చెప్పే ప్రేమసందేశాన్ని కశ్మీరీలు వింటారని కాని, లేదా కశ్మీరు సమస్యకు శాశ్వత పరిష్కారం ఆయన సాధిస్తాడని కాని ఎలా ఆశించగలం.

కశ్మీరు సమస్య నేటిది కాదు. గెడ్డం పెంచుకుని తెల్లబట్టలేసుకుని కాస్త నవ్వుతూ మాట్లాడేసి ప్రేమసందేశం పంచేశాం కాబట్టి సమస్య శాశ్వత పరిష్కారం అయిపోతుందంటే కొందరు నమ్ముతారేమో కాని అది కశ్మీరు ప్రజలను అవమానించడమే అవుతుంది. సూఫీలు తిరుగాడిన నేలలో శ్రీ శ్రీ రవిశంకర్ గారి ప్రేమ సందేశం అవసరం లేదు. సమస్యలకు సరయిన పరిష్కారం కావాలి. ఇలాంటి నాటకీయ ప్రయత్నాలతో శాంతిని సాధించలేం. ఇలాంటి ప్రయత్నాలు ఇంతకుముందు కూడా చాలా సార్లు జరిగాయి. ఫలితాలేమీ లేవు. కశ్మీరు మౌలికంగా రాజకీయ సమస్య. ఇప్పుడు మానవీయ సంక్షోభంగా మారిపోయిందంటే తప్పులేదు. కశ్మీరులో నియమించిన భద్రతాదళాలు, సైనికదళాల సంఖ్య చూస్తేనే అక్కడి పరిస్థితి అర్థమవుతోంది. కశ్మీరు సమస్యకు శాశ్వత పరిష్కారమన్నది ఎవరో ఒక శాంతిదూత తెల్లబట్టలేసుకుని, స్వంత రాజకీయ ఎజెండాలతో ప్రేమసందేశం ఇస్తే సాధ్యం కాదు. ఒక ఆధ్యాత్మిక గురువుగా ఆయన సభకు పిలవడంలోనే అబద్దాలు చెప్పడంతో పరిస్థితి అర్థమవుతుంది. అబద్దాలు చెప్పి పిలిచిన సభలో ప్రేమసందేశం ఎలాంటి ప్రేమను బోధిస్తుంది? నిజాయితీ లేని ప్రేమసందేశం ఉంటుందా? మోసం చేసి తమను సభకు పిలిచారని, గంటలకొద్ది కూర్చోబెట్టిన తర్వాత శ్రీ శ్రీ రవిశంకర్ గారి ప్రేమసందేశం వినమంటున్నారని అర్థం కాగానే ప్రజలు లేచి నిరసన తెలియజేయడం ప్రారంభించారు. ఉద్యోగాలిచ్చే కార్యక్రమమని, డబ్బులిస్తామని, రుణాలు రద్దు చేస్తామని వీలయినన్ని అబద్దాలు చెప్పి ప్రేమసందేశం వినిపించడమేమిటి? వచ్చిన వారిలో కొందరు తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయించుకునే కార్యక్రమమని ఫైళ్ళు చేతబట్టి మరీ వచ్చారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురు శ్రీ శ్రీ రవిశంకర్ కశ్మీరుకు రావడం ఇదే మొదటిసారి కాదు. ఇంతకుముందు వచ్చినప్పుడు ఆయన సయ్యద్ అలీషా గిలానీ, మీర్వాయిజ్ వంటి వేర్పాటువాదులను కలుసుకుని మాట్లాడారు. కశ్మీరు ప్రజలు అనుభవిస్తున్న బాధ గురించి కూడా ఆయన మాట్లాడతారు. ఒకప్పుడు అంటే తొంభయిలలో చాలా మంది మేధావులు, సామాజిక కార్యకర్తలు కశ్మీరు వెళ్ళడం, అక్కడి ప్రజల బాధల గురించి మాట్లాడడం జరిగేది. కాని ఈ సానుభూతి ప్రకటనల వల్ల కశ్మీరీ సమస్య పరిష్కారం కాలేదు. పైగా ఇలాంటి సానుభూతి ప్రకటనలు ఎంతో మృదువుగా చేసిన చాలామంది పెద్దలకు స్వంత రాజకీయ ఉద్దేశ్యాలున్నట్లు కూడా తర్వాత కశ్మీర్ ప్రజలు గ్రహించారు. ఇదో పెద్ద మోసంగా భావిస్తున్నారు. మాజీ గూఢచారి దులాత్ తన పుస్తకంలో కశ్మీరు గురించి చాలా వాస్తవాలు రాశారు. మిలిటెంట్ నాయకులకు డబ్బులిచ్చి లొంగదీసిన తీరుతెన్నుల గురించి కూడా రాశారు. కశ్మీరు ప్రజల్లో సున్నీ, షియా, గుజ్జార్, పహాడీ వంటి తెగల మధ్య విభేదాలు సృష్టిం చే ప్రయత్నాలు కూడా జరిగాయన్నది కశ్మీరీలకు తెలుసు. కాని అర్థం చేసుకోవలసిన విషయమేమంటే, కశ్మీరు సమస్య ఏదో ఒక సముదాయానిది కాదు, ఏదో ఒక పార్టీది కాదు, ఏదో ఒక వ్యక్తిది కాదు. ఇది కోటిన్నర మంది కశ్మీరీల సమస్య. ఏ నాయకుడు, ఏ పార్టీ, ఏ ఒక్క ఆధ్యాత్మిక గురువు కూడా ఈ జనసముదాయం కన్నా ఎక్కువ కాదు. కశ్మీరులో ప్రజలు నాయకుల వెనక నడవడం లేదు. నాయకులే ప్రజల వెనక నడుస్తున్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించి కశ్మీరు సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించే దిశగా నిజాయితీతో కూడిన ప్రయత్నాలు జరగాలి.

శ్రీనగర్ రాకముందే శ్రీ శ్రీ రవిశంకర్ తన నిజరూపం ఏమిటో స్పష్టంగా చూపించేశారు. బాబరీ మసీదు వివాదంలో మందిరానికి అనుకూలంగా తీర్పు రాకపోతే, మెజారిటీ ప్రజల మనోభావాలను గౌరవించకపోతే దేశం మరో సిరియా అయిపోతుందని రక్తపాతం జరిగిపోతుందని బెదిరించడంలో శాంతి సందేశం కాని, ప్రేమ సందేశం కానీ ఏదీ లేదు. ఇంత బాహాటంగా బెదిరింపులకు దిగిన మతతత్వ నాయకుడెవరూ లేడు. ఇలాంటి బెదిరింపులే ఒక ముస్లిం నాయకుడి నుంచి వస్తే ఈ పాటికి గగ్గోలు చెలరేగిపోయి ఉండేది. అనేక కేసులు దేశవ్యాప్తంగా నమోదయ్యేవి. అరెస్టు జరిగేది. కాని శ్రీ శ్రీ రవిశంకర్ ఏం చెప్పినా చెల్లుతుందన్నట్లు నెలకొన్న వాతావరణంలో ఆయన చెప్పే ప్రేమసందేశాన్ని కశ్మీరీలు వింటారని కాని, లేదా కశ్మీరు సమస్యకు శాశ్వత పరిష్కారం ఆయన సాధిస్తాడని కాని ఎలా ఆశించగలం. పైగా ఇలాంటి ప్రయత్నాలు, కశ్మీరీలు మరోసారి మోసపోయినట్లు భావించే వాతావరణం, పుండుపై కారం చల్లినట్లనిపించే కార్యక్రమాలు కశ్మీరు సమస్యను పరిష్కరిస్తాయా? అందరూ ఆలోచించవలసిన అవసరం ఉంది.

ఆదివాసీ ధ్రువతార బాబురావ్ సెడ్మాకీ



గుమ్మడి లక్ష్మీ నారాయణ
9491318409

భారత తొలి స్వాతంత్ర్య సంగ్రామం (1857) నుండి 1947 దాకా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న భూమి పుత్రులను బ్రిటీష్ పాలకులు బలి తీసుకున్నారు. కొందరిని బానిసలుగా, పీడితులుగా మార్చారు. రాజ్య దురాక్రమణ దారులైన తెల్లదొరలు ఆదివాసులపై కుట్రలు, కుతంత్రాలతో యుద్ధం ప్రకటిస్తూ తాంతియా భీల్, రాణి దుర్గావతి, రాణి మా గైడిన్ల్యూ, బిర్సాముండా, రాంజీగోండ్ మొదలైన ఆదివాసీ యోధులను బలిగొన్నారు. మధ్య భారతదేశంలో క్రీ.శ. 1240–1749 మధ్య మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలో ఏర్పడిన ఆదివాసీ గోండ్వానా రాజ్యంలో రాజులుగా వెలుగొందిన గోండు గిరిజన పాలకులకు, జమీందారులను, మోకాసలను సైతం బలిగొన్నారు. గోండ్వానా సమరశీలురలో పులిలాంటి యోధుడు పులిసూర్ బాబురావ్ సెడ్మాకీ. గోండ్వానా రాజ్యంలో సెడ్మా కీ 'ఆదియోధుడు'. మధ్యభారతావనిలో గోండ్వానా ప్రాంతమైన – చంద్రాపూర్ (మహారాష్ట్ర)లోని గోండులు సెడ్మాకీ ఆధ్వర్యంలో తిరుగుబాటు(1856–58) చేయగా, మరోవైపు ఆదిలాబాద్ సరిహద్దుల్లో మార్సికోల్ల రాంజీగోండ్ బ్రిటీష్ సైన్యాలపై రోహిల్లాలు – గోండుల తిరుగుబాటు(1857–60)ఉద్విగ్నంగా జరిగింది.



భారత స్వాతంత్ర్య సమరంలో ఆరిపోతున్న దీపాలను వెలిగిస్తున్నట్లు ...నేలకొరిగిన వీరుని స్థానంలో మరొకరిని ఎదిగేలా చేసి తెల్లదొరతనంపై ఎదురుదాడికి సిద్ధం చేశాడు. ఎన్నో సవాళ్ళను, ప్రతిబంధకాలను ఎదుర్కొంటూ గోండ్వానా రాజ్యసంరక్షణ సమరానికి నాయకత్వం వహించిన గోండ్వాన వీరుడు సెడ్మాకీ. గోండ్వానాలో అంతర్భాగమైన మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా గోండి గ్రామంలో జమీందర్ కుటుంబంలో 1833, మార్చి 12న జన్మించిన సెడ్మాకీ బాల్యంనుంచే అస్త్ర, శస్త్ర విద్యలో నైపుణ్యం సాధించి 28 ఏళ్ళకు – జమీందారీ వంశ వారసుడిగా బాధ్యతలు తీసుకున్నాడు. దురాక్రమణ, దుశ్చర్యలనుంచి గోండ్వానా రాజ్యరక్షణకు ప్రతిజ్ఞ చేశాడు. తెల్లదొరల అకృత్యాలను, వారి దాడులను తిప్పికొట్టడానికి కోయతోరులను, మరాఠీలను, ముస్లింలను కూడా ఏకం చేసి, తన సైన్యంతో తెల్లదొరలపై తొలిసారి 1858, మార్చి 22న యుద్ధం ప్రకటించాడు. ఆ యుద్ధంలో బ్రిటీష్ సైన్యాన్ని సెడ్మాకీ చిత్తుగా ఓడించాడు.

బ్రిటీష్ కెప్టెన్ క్రికటన్ సారథ్యంలో సిగ్నాపూర్ పరిసరాలలో గోండులపై దండెత్తినా పరాజయం తప్పలేదు. పైగా చంద్రాపూర్ వైపు పారిపోయి తలదాచుకున్నారు. బ్రిటీష్ బలగాలు సెడ్మాకీని ఓడించడానికి బ్రిటిష్ సైన్యాధిపతిగా నెక్స్‌ఫియార్‌ను యుద్ధానికి పంపించారు. ఆధునిక ఆయుధాలు కొరవడినప్పటికీ గోండుసైన్యాలు సాంప్రదాయక బరిసెలు, బల్లెములు, బడితెలు, కత్తులతోనే ఎదుర్కొని బ్రిటీష్ సైన్యాలను ఓడించారు.

యుద్ధంలో పరాజయాన్ని జీర్ణించుకోలేని బ్రిటీష్ ప్రభుత్వం సెడ్మాకీని కొరియర్ ద్వారా నిర్బంధించడానికి ప్రణాళికలు చేసింది. క్రికటన్, నెక్స్‌పియార్‌లు సెడ్మాకీని పట్టించిన వారికి కానుకగా జమీందారీగా నియమిస్తామని ప్రకటించారు. తనకు ఆమోదీ రాజపుత్రిక లక్ష్మీ బాయి నమ్మిన బంటు కావడంతో రక్షణార్థం ఆమె వద్దకు తరచూ వెళ్లేవాడు. ఆమె సెడ్మాకీ యొక్క పోరాట పటిమను ప్రశంసిస్తూ, తన వద్ద విశ్రాంతి తీసుకోవాలని కోరింది. ఆమె నమ్మక ద్రోహంతో సైన్యానికి సమాచారం తెలిసి రాత్రికి రాత్రే ఆంగ్లేయులు నిద్రలోని సెడ్మాకీని బంధించి చంద్రాపూర్‌తరలించారు. తెల్లదొరల కబంధ హస్తాలకు చిక్కి, 1858 అక్టోబర్ 21న ఉరితీయబడిన బాబురావ్ సెడ్మాకీ అజరామరుడు. స్వతంత్ర్య భారత సంగ్రామంలో గోండ్వానా రాజ్య పరిరక్షణకు, గోండ్వానా స్వయం పాలనకు కృషి చేశాడు. సెడ్మాకీ ప్రపంచ ఆదివాసీల పోరాట చరిత్రలో ఒక ధృవతార.

సెడ్మాకీ గోండ్వానా రాజ్యకోటలు నేటికీ చంద్రాపూర్‌లో దర్శనమిస్తాయి. సెడ్మాకీ నుండి తెలంగాణలో కుమ్రంభీం దాకా ఆదివాసీలు తమ పోరాట వారసత్వాన్ని కొనసాగించిన వీరయోధులు. స్వాతం త్ర్యం సిద్ధించి 70 ఏళ్లయినా ఆదివాసీలు తమ అస్థిత్వ, ఆత్మగౌరవ పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ జల్–జంగల్–జమీన్ కోసం, స్వయం పాలనాధికారాల కోసం ఎదురుచూడటం తప్ప ఆదివాసీలకు వేరే గత్యంతరం లేదేమో!

మన తెలంగాణ
5
హైదరాబాద్
మంగళవారం
13 మార్చి, 2018
www.manatelangana.news





తళుక్కుమన్న తొలి తార



సృష్టి ఎప్పుడు ప్రారంభమైంది...అనే విషయంపై చాలా సంవత్సరాలుగా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో విశ్వంలో తొలి నక్షత్రాన్ని కనుగొని ప్రపంచ శాస్త్రవేత్తలందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది ఐదుగురు శాస్త్రవేత్తల బృందం. వారిలో భారతదేశానికి చెందిన నివేదితా మహేష్ ఉండటం విశేషం. బృందంలో ఒకరిగా నిలిచి అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది.

తమిళనాడు కోయంబత్తూరుకు చెందిన నివేదితకు చిన్నప్పటి నుంచీ పరిశోధనలంటే ఇష్టం. దీంతో కోవైలోని పీఎస్‌జీ కాలేజీ ఆఫ్ టెక్నాలజీలో ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ పూర్తిచేసింది. అనంతరం బెంగళూరులోని రామన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ఖగోళశాస్త్ర విభాగంలోని ఆచార్యులు సుబ్రమణ్యన్‌తో కలిసి పనిచేసింది. అప్పుడే ఆమెకు ఖగోళ సృష్టి రహస్యాలను ఛేదించాలనే ఆసక్తి కలిగింది. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో పీజీ, అరిజోనా స్టేట్ యూనివర్సిటీలో రీసెర్చ్ అసిస్టెంట్‌గా, తర్వాత సీనియర్ అసిస్టెంట్‌గా అంచెలంచెలుగా ఎదిగింది. అరిజోనా విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తల బృందంలో ఒకరిగా ఉండి తొలి నక్షత్రకాంతిని కనుక్కొని ప్రపంచ దృష్టిని ఆకట్టుకుంది.

గత నాలుగేళ్లుగా నివేదిత సహా ఐదుగురు శాస్త్రవేత్తల బృందం విశ్వం ప్రారంభమైనప్పుడు తొలి నక్షత్రాల నుంచి వెలువడిన కాంతికిరణాలను గుర్తించడంపై పరిశోధనలు చేస్తున్నారు. అనంత విశ్వంలో 13.8 బిలియన్ల సంవత్సరాల క్రితం అతి పెద్ద విస్ఫోటనం ఏర్పడింది. ఈ క్రమంలో విశ్వం ఒక్కసారిగా చీకటి పదార్థంగా అంటే డార్క్ మేటర్‌గా మారినట్లు పరిశోధనలు చెబుతున్నాయి. ఆ సమయంలో సూర్యుడూ, నక్షత్రాలు, కాంతిలేని శూన్యం, చీకటి మాత్రమే ఉండేది. అయితే అది చల్లబడి పరమాణువులుగా విడిపోవడమే కాకుండా, కాంతినిరోధకాలుగా మారాయి. దాదాపు 3,70,000 సంవత్సరాల వరకు అంతా చీకటే అని గత పరిశోధనలు వెల్లడించాయి. ఆ చీకటి నుంచి దాదాపు 180 మిలియన్ల సంవత్సరాల తర్వాత వచ్చిన తొలి కిరణం వెలుతురును గుర్తించారు నివేదిత బృందం. ఈ అంశంపై నాలుగేళ్లుగా వారు పరిశోధన చేస్తున్నారు. ఈ రీసెర్చ్‌లో మొదట నక్షత్రాలు ఆవిర్భవించి , కాస్మిక్ డాన్‌గా పిలిచే విశ్వం ప్రారంభమై ఉండొచ్చని భావిస్తున్నారు. తొలి నక్షత్ర వెలుగుతో ఎన్నో అంశాలను పరిశోధించే అవకాశం కలిగినట్లు చెబుతోంది నివేదిత.

"నక్షత్రాలు ఆవిర్భవించడానికి కారణాలు, అవి ఏ పరిస్థితుల్లో ఏర్పడ్డాయనే అంశాలపై పరిశోధన చేశాం. ప్రత్యేక టెలిస్కోప్ ద్వారా కనిపెట్టిన కాంతి కిరణాలకు సంబంధించి మరింత పరిశోధన చేయబోతున్నాం. నా మొదటి సెమిస్టర్‌లోనే ఇంత పెద్ద పరిశోధనలో నేకూ భాగసామ్యం కలగడం అదృష్టం" అంటోంది నివేదిత. ఈ పరిశోధనా ఫలితం కేవలం విశ్వం ప్రారంభం కావడానికి పట్టిన సమయం గురించి మాత్రమే కాకుండా, ఏళ్ల తరబడి విశ్వమంతా చీకటిలో ఉండటానికి గల నిగూఢమైన కారణాలను వెదకడానికి అవకాశంగా మారిందంటోంది.

భవిష్యత్తు మాదే!

రాబోయే కాలంలో ఉద్యోగాల విషయంలో భారత్‌కు మంచి భవిష్యత్తు ఉందంటోంది నీల్సన్ సర్వే. 63 దేశాల్లో 30 వేల మందితో ఆన్‌లైన్ సర్వే నిర్వహించారు. పాయింట్ల ఆధారంగా భారత్ మొదటి స్థానంలో నిలిచింది.



ఫిలిప్పీన్స్, ఇండోనేషియాలకు రెండు మూడు ర్యాంకులొచ్చాయి. సర్వేలో యువత మనోభావాలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం..

కొత్త ఉద్యోగాల కల్పనకు ఇండియా లో పూర్తి సానుకూల వాతావారణం ఉందని యాభైశాతం మంది యువతీ యువకులు అభిప్రాయపడుతున్నారు. వీరిలో 17 శాతం మంది తమ ఉద్యోగాలకు పూర్తి భరోసా ఉందంటున్నారు. నచ్చిన వస్తువులు కొనడం, పెట్టుబడులు పెట్టడానికి ఇది అనువైన కాలమని 68 శాతం నగరవాసులు తేల్చి చెప్పారు.

వరుస ప్రాధాన్యాల ప్రకారం 66 శాతం పొదుపునకు, 56శాతం మంది సరదా పర్యటనలకు, 52 శాతం మంది టెక్నాలజీ వస్తువులు కొనడానికీ, 48 శాతం మంది దుస్తులు కొనుగోలుకు మక్కువ చూపుతున్నట్లు సర్వేలో తెలిసింది.

నిజాయితీగా ఉండండి!



చాలా మంది ప్రవేశపరీక్షలు రాసి ఇంటర్వ్యూలో మాత్రం సఫలం కారు. ఎంత సబ్జెక్టుపై పరిజ్ఞానం ఉన్నా..కొన్ని చిన్న చిన్న విషయాలు తెలీకపోవడం వల్ల విజయం సాధించలేరు. ముఖాముఖిలో అభ్యర్థి హావభావాలు, నిజాయితీ లాంటి అన్ని విషయాలు పరిగణలోకి తీసుకుంటారు. ఇంటర్వ్యూ గదిలోకి ప్రవేశిస్తూనే అక్కడి అధికారులకు నమస్కారం చేయాలి. ఇంటర్వ్యూ చేసే అధికారి ఒకవేళ కరచాలనానికి చెయ్యి చాపితేనే అభ్యర్థి కూడా అందుకు ముందుకు రావాలి. అంతేగానీ చొరవ పనికిరాదు. కుర్చీ వద్దకు రాగానే అధికారి కూర్చోమంటేనే కూర్చోవాలి. అక్కడ నాలుగైదు కుర్చీలుంటే అధికారికి ఎదురుగా ఉండే కుర్చీలో కూర్చోవాలి. పొరపాటు మాట్లాడితే రెండుసార్ల కంటే క్షమించండి అనే పదాన్ని ఉపయోగించొద్దు. అడిగిన ప్రశ్నకు సమాధానం తెలీకపోతే తెలియదని నిజాయితీగా చెప్పాలి. ప్రశ్న అడిగినవారిపైనే దృష్టి నిలిపి సమాధానం చెప్పాలి. కుర్చీలో నిటారుగా కూర్చోవాలి. చేతులు తొడలపై పెట్టుకోవాలి. కాళ్లూ చేతులూ ఊపుకుంటూ మాట్లాడటం తప్పు. తెలిసిన జవాబునైనా తొందరపాటు లేకుండా స్పష్టంగా చెప్పాలి. ఇంటర్వ్యూ ముగిసిన తర్వాత అధికారికి అభివాదం చేస్తూ నవ్వు ముఖంతో బయటకు రావాలి. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన అంశం ఏమంటే లోపలికి వెళ్లేటప్పుడుగానీ, బయటకు వచ్చేటప్పుడు గానీ తలుపు శబ్దం చేయకూడదు.

టీవీ చూస్తే కేన్సర్ ముప్పు!

రోజుకు 4 గంటలకుపైగా టీవీ చూసే మగాళ్లకు కేన్సర్ ముప్పు అధికమని నిపుణులు చెబుతున్నారు. గంటల తరబడి కంప్యూటర్‌లో వీడియోగేమ్స్ ఆడటం, ఎక్కువ సేపు టీవీ చూడటం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్న విషయం తెలిసిందే. 5 లక్షల మందికిపైగా స్త్రీ, పురుషులపై ఇందుకోసం అధ్యయనం నిర్వహించారు. తక్కువ సేపు టీవీ చూసే మగాళ్లు పెద్ద పేగు కేన్సర్ బారిన పడే ముప్పు తక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. టీవీ ఎక్కువ చూసే 2391 మంది మగాళ్లకు ఆరేళ్ల తర్వాత కేన్సర్ వ్యాధి సోకినట్లు నిర్ధారించారు.

ఫ్రాన్స్‌లోని ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ కేన్సర్, బ్రిటన్‌కు చెందిన ఇంపీరియల్ కాలేజీ లండన్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలు టీవీ చూసే అలవాటు, పెద్ద పేగు కేన్సర్ మధ్య సంబంధంపై అధ్యయనం చేపట్టాయి. శారీరకంగా శ్రమించడం పెరిగే కొద్దీ పురుషుల్లో కేన్సర్ ముప్పు తగ్గుతున్నట్లు అధ్యయనంలో తేలింది. కంప్యూటర్ స్క్రీన్‌కు, పెద్దపేగు కేన్సర్‌కు సంబంధం లేదని పరిశోధకులు తేల్చడం విశేషం. ఎప్పుడూ ఒకే చోట కూర్చోవడం వల్ల బరువు పెరిగే అవకాశం ఉంది. ఒంట్లో కొవ్వు పేరుకుపోతుంది. అధికంగా పేరుకుపోయిన కొవ్వు హార్మోన్ల స్థాయిలపై ప్రభావం చూపుతుంది. ఇది కణాల పెరుగుదలను ప్రభావితం చేసి.. పెద్ద పేగు కేన్సర్ రావడానికి దోహదం చేస్తుందని పరిశోధకులు తెలిపారు.



సదారణాల పచ్చబొట్లు...





టాటూలు యువతను కట్టిపడేస్తున్నాయి. ఇటీవల కొందరు కళాకారులు త్రీడీ ఎఫెక్టుల్ని ఇచ్చి మరీ టాటూలు వేస్తున్నారు. ఒంటిమీద ఆ బొమ్మలు నిజంగా ఉన్నట్లే అనిపించడం వీటి ప్రత్యేకత. తాజాగా త్రీడీ టాటూ స్టిక్కర్లు మార్కెట్లోకి వస్తున్నాయి.



నయా గాడ్జెట్స్

సెన్సార్ జేసీస్ J1 మౌస్

జేసీస్ J1 మౌస్ చూడటానికి మాములు మౌస్ లాగా వున్నా, ఇది పని చేసే సమయంలో ఒత్తిడి లేకుండా ఉంటుంది. ఈ మౌస్‌లో హైలైట్ ఏంటి అంటే స్క్రోల్ వీల్ పైన వున్న ఫింగర్ ప్రింట్ సెన్సార్ పాస్వర్డ్ (Passwords) గుర్తుకు పెట్టుకోవాల్సిన అవసరం లేకుండా చేస్తుంది. అకౌంట్స్ చాలా త్వరగా ఓపెన్ చేసుకొనే అవకాశం ఉంటుంది. చాలా మంది కంప్యూటర్స్‌ని రోజుకి 3/5 సార్లు అన్నా ఆన్ చేస్తారు. ఇలాంటప్పుడు ఈ మౌస్ సులభంగా ఉపయోగపడుతుంది.





మాగ్‌పై



జీపీఎస్ గ్యాడ్జెట్ స్మార్ట్ జీపీఎస్ టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తుంది. ఎక్కడకైనా కొత్త ప్రదేశానికి వెళ్తే .. ఎక్కడున్నామో, గమ్యానికి ఎంత దూరంలో ఉన్నామో, ఎంత సమయంలో చేరుకుంటామో ఇలాంటి వివరాలన్నీ మొబైల్‌కి చూపుతుంది. మొబైల్‌కి కనెక్ట్ చేసుకోవాలి. ఏదైనా వస్తువును పోగొట్టుకున్నా.. ఒకవేళ ఆ వస్తువును మాగ్‌పైకి కనెక్ట్ చేసి ఉంటే అది ఎక్కడుందో కూడా తెలుసుకోవచ్చు. ప్రయాణాల్లో ఇలాంటి గ్యాడ్జెట్ తోడుంటే వస్తువులు జాగ్రత్తగా వుంటాయి. ఇది ఒక జీపీఎస్ ట్రాకర్.

రైల్వే ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ది మంత్' అవార్డులు

మన తెలంగాణ / హైదరాబాద్ : కర్తవ్య నిర్వహణలో అత్యధిక అంకితభావంతో, జాగరూకతను ప్రదర్శించి క్లిష్ట పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించిన ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ది మంత్' అవార్డులను దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్ ప్రధానం చేశారు. రైల్వే నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. రైల్ నిలయంలో రైల్వే భద్రత, సమయపాలన, సరుకు రవాణ అంశాలపై డివిజనల్ మేనేజర్లతో వీడియా కాన్ఫరెన్స్ ద్వారా జాన్ థామస్ సమీక్షించారు. సమావేశంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉద్యోగులకు అవార్డులను ప్రదానం చేసిన అనంతరం జాన్ థామస్ మాట్లాడుతూ వ్యవస్థాగత వైఫల్యాలను తగ్గించడం ద్వారా రైళ్లను నియమిత సమయంలో నడపవలసిన కర్తవ్యం అధికారులకు ఉందన్నారు. లోకోల వైఫల్యాలు, యార్డులలో పట్టాలు తప్పడం, లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలకు కారణాలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల్లోని ఉద్యోగులను తప్పనిసరిగా శిక్షణకు పంపే విషయంలో రైల్వే బోర్డు మార్గదర్శకాలను అనుసరించాలని ఆయన సూచించారు.



గవర్నర్ ప్రసంగమంతా కెసిఆర్ మాటలే



మన తెలంగాణ / హైదరాబాద్ : ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు నిత్యం వల్లిస్తున్న మాటలనే గవర్నర్ నరసింహన్ తన ప్రసంగంలో ప్రస్తావించారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ చేసిన ప్రసంగంలో రెండు పడకల ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి, కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య లాంటి ముఖ్యమైన అంశాల ప్రస్తావన భూతద్దం పెట్టి వెతికినా కనపడలేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, యంబిసి, మైనారిటీ రిజర్వేషన్ల పెంపు ప్రస్తావన గవర్నర్ ప్రసంగంలో అసలే లేదన్నారు. బంగారు తెలంగాణ జపం చేస్తూ, లక్షల కోట్ల రూపాయలు తెచ్చి అప్పుల తెలంగాణాగా మార్చారని విమర్శించారు. గవర్నర్ ప్రసంగం మొత్తం మేడి పండు మాదిరిగానే వుందన్నారు. గవర్నర్ ప్రసంగం అర గంటలోనే తూతూ మంత్రంగా ముగిసిందని, చివరి సమావేశాలు అయినప్పటికీ ప్రభుత్వ ప్రధాన హామీలను గురించి గవర్నర్ ప్రస్తావించకపోవడం బాధకరమన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సిఎం కెసిఆర్ నీతి గురించి మాట్లాడడం హర్షణీయమని, అయితే తొలుత పార్టీ ఫిరాయింపుదారుల శాసనసభ్యత్వాన్ని రద్దు చేసి రాజకీయ నీతి, నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. తల్లిపాలు తాగి రొమ్ముగుద్దిన పార్టీ ఫిరాయింపుదారుల రాజీనామాలు లేఖలు స్పీకర్ వద్ద నెలలు, సంవత్సరాల తరబడి పెండింగ్‌లో వున్నాయని, వాటిపై కెసిఆర్ వైఖరి ఏమిటని ఆయన ప్రశ్నించారు. టిఆర్‌ఎస్ ప్రతిపక్ష స్థానంలో వున్నప్పుడు గవర్నర్ ప్రసంగం లేదా బడ్జెట్ ప్రసంగానికి ఆటంకం కలిగించిన విషయం గుర్తు లేదా, ఆ విషయంపై ఆయన ఆత్మవిమర్శ చేసుకున్నారా అని వెంకటరెడ్డి ప్రశ్నించారు. కెసిఆర్ వైఖరి ఆత్మస్తుతి పరనింద తరహాలో ఉందన్నారు.

వాస్తవ సాగుదారులకు పెట్టుబడి



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి ప్రోత్సాహక పథకంపై అందరి అభిప్రాయాలు సేకరించి వాస్తవ సాగుదారులకు (భూమి యజమానులు, కైలుదారులు) వర్తింపజేయాలని కౌలు రైతులు, మహిళా రైతుల సదస్సు డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మఖ్దూంభవన్‌లో జరిగిన సదస్సులో ప్రోత్సాహక పథకంపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించింది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం భూమి లేని వారికి వ్యవసాయ భూమిని 5 ఎకరాల మెట్ట భూమిగా కానీ, రెండున్నర ఎకరాల తరి భూమి కానీ ఇవ్వాలని, ఇందు కోసం 3 నెలలో ఆదేశాలు జారీ చేయాలని సదస్సు ప్రభుత్వాన్ని కోరింది. సదస్సులో తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం అధ్యక్షులు వి.ఎస్.ప్రసాద్ శాస్త్రి ప్రసంగిస్తూ పెట్టుబడి పథకాన్ని కేవలం భూయజమానులకు మాత్రమే పరిమితం చేయడం సమంజసం కాదని, భూములను సాగుచేస్తున్న వారందరికీ అందజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ, ప్రధాన కార్యదర్శి టి.విశ్వేశ్వరరావు, కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి కె.సూర్యనారాయణ తదితరులు ప్రసంగించారు.

దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)

కుప్పకూలిపోయాడు. పట్టపగలు ట్రాఫిక్ పోలీసులు , వాహనదారులు చూస్తుండగానే రెప్పపాటు సమయంలో ఈ దారుణం చోటు చోసుకుంది. అత్యంత ట్రాఫిక్ రద్దీ కలిగి ఉండే కూకట్‌పల్లి జాతీయ రహదారిపై చోటు చేసుకున్న దారుణ హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. హత్య జరగడంతో ట్రాఫిక్ గంటల తరబడి స్తంభించిపోయింది. ఇంటర్మీడియట్ పరీక్షలకు వెళ్ళే విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. హత్యకు పాల్పడిన నలుగురు యువకుల్లో ముగ్గురు పరారీకాగా ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సంఘటనా స్థలాన్ని కూకట్‌పల్లి ఎసీపీ భుజంగరావు, సిఐ ప్రసన్నకుమార్‌లు పరిశీలించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

పాతఘర్షణలకు ప్రతీకారంగానే హత్య!

పాతఘర్షణలకు ప్రతీకారంగానే హత్య జరిగినట్లు విశ్వసనీయంగా తెలసింది. గతంలో మృతుడు సుధీర్‌కు గతంలో మిత్రులుగా ఉన్న వారే హత్యకు పాల్పడినట్లు సమాచారం. సుధీర్ స్నేహితులుగా భావిస్తున్న నవీన్, కృష్ణ, మహేష్, తేజలు ఈ దారుణానికి ఒడిగట్టినట్లుగా భావిస్తున్న పోలీసులు వారికోసం గాలిస్తున్నారు. ఈనెల 9న మృతుడు సుధీర్ తన ప్రాణ స్నేహితుడి చెల్లెలును మహేష్ అనే నిందితుడు వేధించడంతో సుధీర్ మహేష్‌తోపాటు అతని స్నేహితులతో ఘర్షణ పడ్డారు. దీంతో వారిపై కూకట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఒక అమ్మాయిని ఏడిపించానని తనపైనే దాడిచేస్తావా అని మనసులో కసి పెంచుకున్న జిల్లా మహేష్‌తోపాటు తేజ, నవీన్, కృష్ణలు సుధీర్‌ను ఎలాగైనా చంపాలన్న కసితో కొబ్బరిబొండాలు కొట్టే కత్తులతో దాడి చేసి ఈ దారుణానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడితోపాటు నిందితులు కూడా ఇంటర్మీడియట్ చదువుతున్న వారేనని తెలిసింది. వీరికి గంజాయి, డ్రగ్స్ , లిక్కర్ అలవాట్లు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తే తెలిసీ తెలియని వయస్సులో ఉన్న యువకులు మాదకద్రవ్యాల వాడకం, హత్యలు చేయడానికి కూడా వెనకాడకపోవడానికి కారణాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

ఘోర విమాన ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఈ విషయాన్ని టిఐఎ ప్రతినిధి ప్రేమ్ నాథ్ ఠాకుర్ తెలిపారు. 'ఈ ప్రమాదంలో 50 మందికిపైగా చనిపోయి ఉంటారని భావిస్తున్నాం. సహాయక చర్యలు చేపట్టాం. వివరాలను సేకరిస్తున్నాం' అని టిఐఎ జనరల్ మేనేజర్ రాజ్‌కుమార్ ఛత్రీ తెలిపారు. గాయపడిన 20 మందిని చికిత్స నిమిత్తం ఖాట్మండు మెడికల్ కాలేజ్‌కు తరలించారు. విమానంలో ప్రయాణించినవారిలో కనీసం 17 మందిని రక్షించాం అని నేపాల్ పర్యాటక మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సురేశ్ ఆచార్య చెప్పారు. విమాన ప్రమాదానికి సాంకేతిక సమస్యలు కారణం కావొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా 'విమానానికి కొటేశ్వర్ మీదుగా దక్షిణ దిక్కు రన్‌వేపై దిగడానికి అనుమతి ఇవ్వగా, అది ఉత్తర దిక్కు దిగడానికి యత్నించింది' అని నేపాల్ పౌర విమాన ప్రాధికార సంస్థ డైరెక్టర్ జనరల్ సంజీవ్ గౌతం 'ఖాట్మండు పోస్ట్'కు చెప్పారు. విమానం దిగేప్పుడు నియంత్రణ తప్పి ఉంటుంది. అందుకే అది అసాధారణరీతిలో దిగడానికి యత్నించి ఉంటుందని అనుమానిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇరాన్‌లో కూలిన టర్కీ విమానం: 11 మంది మృతి

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యుఎఇ) నుంచి యువతుల బృందంతో ఇస్తాంబుల్‌కు బయలుదేరిన టర్కీ ప్రైవేట్ జెట్ విమానం ఆదివారం రాత్రి కూలిపోయింది. భారీ వర్షంలో ఆ విమానం ఇరాన్ కొండప్రాంతంలో కూలిపోగా అందులో ప్రయాణిస్తున్న 11 మంది మృతి చెందారని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గురైన టర్కీ విమానం టెహరాన్‌కు 370 కిమీ. దూరంలో ఉన్న షహర్‌-ఎ కొర్ద్ సమీపంలో పర్వతాన్ని ఢీకొని పేలిపోయిందని ఇరాన్ ప్రతినిధి మొజ్‌తబా ఖాలేది చెప్పారు.

రాజ్యసభ బరిలో ఐదుగురు

టిఆర్‌ఎస్ నుంచి ముగ్గురు, ఒకరు కాంగ్రెస్, మరొకరు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్‌లు









మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ స్థానాలకు సోమవారం నాడు ఐదుగురు అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. ఇందులో ముగ్గురు టిఆర్‌ఎస్, ఒకరు కాంగ్రెస్, ఒకరు ఇండిపెండెంట్ అభ్యర్థులు ఉన్నారు. టిఆర్‌ఎస్ తరపున జోగినపల్లి సంతోష్‌రావు, బడుగుల లింగయ్య యాదవ్, బండా ప్రకాశ్‌లు నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ నుండి కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరామ్ నాయక్ నామినేషన్ వేయగా, జాజుల భాస్కర్ అనే వ్యక్తి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఐదుగురు కూడా నామినేషన్‌ల దాఖలుకు చివరి రోజైన సోమవారం నాడే ఎన్నికల రిటర్నింగ్ అధికారి, శాసనసభ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహా చార్యులకు సమర్పించారు. మంగళవారం నాడు నామినేషన్‌లను పరిశీలించి, ఏమైనా లోపాలుంటే నామినేషన్‌ను తిరస్కరిస్తారు. కాగా స్వతంత్ర అభ్యర్థి నామినేషన్‌పై ప్రతిపాదకులుగా అవసరమైన పది మంది ఎంఎల్‌ఎల సంతకాలు లేనట్లు సమాచారం.

భారీగా తరలొచ్చిన సంతన్న అభిమానులు

టిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌రావు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి టిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం తొమ్మిది గంటలకు అసెంబ్లీ ఎదుట తెలంగాణ అమరవీరుల స్థూపం వద్దకు వారంతా చేరుకున్నారు. టిఆర్‌ఎస్ రాజ్యసభ అభ్యర్థులు సంతోష్, లింగయ్య యాదవ్, ప్రకాశ్‌లు అమరులకు నివాళులర్పించారు. అనంతరం ఎంఎల్‌లు, ఎంఎల్‌సిలు వెంట రాగా నామినేషన్ వేసేందుకు అసెంబ్లీకి చేరుకున్నారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో సంతోష్‌తో పాటు టిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు డాక్టర్ కె.కేశవరావు, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ప్రభుత్వ ఛీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, కోవాలక్ష్మి ఉన్నారు. బడుగుల లింగయ్య యాదవ్ నామినేషన్ కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంఐఎం సభ్యులు జాఫర్ హుస్సేన్‌లు పాల్గొన్నారు. బండా ప్రకాశ్ వెంట నామినేషన్ దాఖలు సందర్భంగా బండా ప్రకాశ్ వెంట ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు కె.టి.రామారావు, టి.పద్మారావు, ఇంద్రకరణ్‌రెడ్డిలు ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాం నాయక్ నామినేషన్ వేసే సమయంలో వెంట టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సిఎల్‌పి నేత కె.జానారెడ్డి, ఉప నేత డాక్టర్ జె.గీతారెడ్డి, విప్ ఎస్.ఎ.సంపత్‌కుమార్‌లు ఉన్నారు.

బిఎస్‌పి, వైసిపి మద్దతూ కోరతాం: ఉత్తమ్

కాంగ్రెస్ అభ్యర్థి బలరామ్ నాయక్‌కు మద్దతు ఇవ్వాల్సిందిగా టిఆర్‌ఎస్, బిజెపి మినహా అన్ని పక్షాల మద్దతు కోరతామని టిపిసిసి ఛీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నామినేషన్ అనంతరం ఆయన జర్నలిస్టులతో మాట్లాడుతూ బిఎస్‌పి, వైసిపి ఎంఎల్‌ఎలు టిఆర్‌ఎస్‌ఎల్‌పిలో విలీనమైనట్లు స్పీకర్ బులెటిన్ ఇచ్చినప్పటికీ, చట్టం ప్రకారం అది సాధ్యం కాదన్నారు. కాబట్టి ఆ రెండు పార్టీల అధినేతలను కూడా మద్దతు కోరతామని చెప్పారు.

27 వరకు అసెంబ్లీ

15న బడ్జెట్, నేడు గవర్నర్ ప్రసంగంపై చర్చ



మన తెలంగాణ/ హైదరాబాద్ : శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 27వ తేదీ వరకు నిర్వహించాలని శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ(బిఎసి) నిర్ణయించింది. ఈ నెల 15న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. మొత్తం 12 పని దినాల పాటు నిర్వహించేందుకు బిఎసి షెడ్యూలును ఖరారు చేసింది. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం చర్చను ప్రారంభించనున్నారు. బుధవారం దీనిపై ప్రభుత్వం సమాధామివ్వనుంది. స్పీకర్ ఎస్.మధుసూదనాచారి అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో సోమవారం గవర్నర్ ప్రసంగం ముగిసిన తరువాత బిఎసి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి శాసనసభా వ్యవహారాల మంత్రి టి.హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ప్రతిపక్ష నాయకులు కె.జానారెడ్డి, కాంగ్రెస్ సభ్యులు మల్లు భట్టి విక్రమార్క, ఎంఐఎం పక్ష నాయకులు అక్బరుద్దీన్ ఓవైసీ , బిజెఎల్‌పి నేత జి.కిషన్‌రెడ్డి, టిడిపి ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య, సిపిఐ(ఎం)సభ్యులు సున్నం రాజయ్య, ప్రభుత్వ ఛీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, విప్ గొంగిడి సునీతా తదితరులు పాల్గొన్నారు. గురువారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరువాత మరుసటి రోజైన 16వ తేదీ సెలవు ఇవ్వనన్నారు. సాధారణ బడ్జెట్‌పై చర్చను ఈ నెల 17వ తేదీ నుండి ప్రారంభించాలని ప్రభుత్వం ప్రతిపాదించగా, చర్చను ప్రారంభించాల్సిన ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఆ రోజు సెలవు ఇవ్వాలని కోరింది. ఈ నెల 16,17, 18 తేదీలలో ఢిల్లీలో కాంగ్రెస్ అఖిల భారత ప్లీనరీ జరగనుందని, దానికి శాసనసభ్యులంతా హాజరుకావాల్సి ఉందని బిఎసిలో జానారెడ్డి తెలిపారు. ఎట్లాగో ఈ నెల 16న, 18(ఉగాది)న సెలవు ఉన్నందున, మధ్యలో 17వ తేదీ సెలవు ఇవ్వాలని, దానికి బదులుగా ఈ నెల 25వ తేదీ ఆదివారం సభను నిర్వహించాలని కోరారు. ఇందుకు బిఎసి సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. దీంతో ఈనెల 16, 18, 26 తేదీలలో సెలువులు ఉండనున్నాయి. పద్దులపై ఈ నెల 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు చర్చ, సమాధానం, 27వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ, ఓటింగ్ ఉంటుంది. సభ పని దినాలు కేవలం 12 రోజుల ఉండడంపై బిఎసిలో విపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. గతంలో కనీసం 40 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు సాగేవని గుర్తు చేశాయి. అయితే, నిర్దిష్టంగా ఇన్ని రోజులు పాటు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిబంధనలు లేవని ప్రభుత్వం సమాధానమిచ్చినట్లు తెలిసింది.

కొత్త పంథాలో మండలి : శాసనమండలి సమావేశాలు కూడా ఈ నెల 27వ తేదీ వరకు నిర్వహించాలని మండలి బిఎసి సమావేశం నిర్ణయించింది. అయితే ఈ సారి సమావేశాల్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టనుంది. సాధారణంగా శాసనసభలో పద్దులపై చర్చ జరిగే సమయంలో మండలికి సెలవులు ఇస్తారు. ఈసారి సెలవులు ఇవ్వకుండా ఆ రోజుల్లో స్వల్ప వ్యవధి చర్చలు చేపట్టాలని బిఎసి నిర్ణయించింది. మండలిలో డిప్యూటీ చైర్మన్ విద్యాసాగర్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, శాసనసభ వ్యవహారాల మంత్రి టి.హరీశ్‌రావు, ప్రతిపక్ష నాయకులు షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి (కాంగ్రెస్), అమీనుల్ జాఫ్రీ (ఎంఐఎం), ప్రభుత్వ ఛీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు బోడకుంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టిజెఎసిలో కపిలవాయి చేరిక



మన తెలంగాణ/హైదరాబాద్ : సమస్యలను విన్నవించుకునేందుకు ప్రజలకు కనీసం ధర్మదర్శనానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంలేదని, ప్రజాస్వామ్యదేశంలో ప్రజలను కలువని ఏకైక ప్రభుత్వం ఇదేనని తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు కనీస గౌరవం కూడా లేకుండాపోయిందన్నారు. ఉద్యమ ఆకాంక్షల అమలు, ప్రజలు కన్న కలలు నెరవేరడానికి తెలంగాణ సాధన కోసం పనిచేసిన తెలంగాణవాదులందరూ తమతో కలిసి పనిచేసేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంఎల్‌సి కపిలవాయి దిలీప్‌కుమార్ నేతృత్వంలో టిఆర్‌ఎల్‌డి మాజీ అధ్యక్షులు డా. మహ్మద్ రియాజ్, ఆకుల శ్రీనివాస్, తుర్లపాటి సుబ్రమణ్యం, జ్యోష్ణ తిరునగరి, రవీందర్, మహ్మద్ నజీర్, విశాల్ బంజారి, ముద్దంమల్లేష్‌గౌడ్, పార్థసారథి, రామకృష్ణయాదవ్ తదితరులు కోదండరామ్ ఏర్పాటు చేయనున్న రాజకీయ పార్టీలో సోమవారం చేరారు.

రభసభ

(మొదటిపేజీ తరువాయి)

ఆసుపత్రికి వెళ్ళి చికిత్స చేయించుకున్నారు. డాక్టర్లు ఆయన కంటికి తగిలిన గాయాన్ని పరిశీలించి ప్రాథమిక చికిత్స చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ తెలిపారు. కార్నియాకు దెబ్బతగిలిందని, దీనికి తగిన చికిత్సను అందిస్తున్నామని ఆయన వివరించారు. కన్ను సాధారణ స్థితికి చేరుకోవడానికి కనీసం నెల రోజులు పడుతుందని, ఎలాంటి శస్త్రచికత్స అవసరం లేదని చెప్పారు. మందులతోనే ఇది తగ్గుతుందని సూపరింటెండెంట్ వివరించారు. ఆసుపత్రిలో చేరిన స్వామిగౌడ్‌ను ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు, పలువురు మంత్రులతో పాటు అనేకమంది ప్రజాప్రతినిధులు పరామర్శించారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ఆసుపత్రికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గాయంపై సూపరింటెండెంట్‌తో చర్చించారు. చికిత్సకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని మంత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. మండలి ఛైర్మన్‌ను పరామర్శించిన వారిలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, ఎంఎల్‌సి శ్రీనివాసరెడ్డి, ఎంపి కేశవరావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ ఆరోగ్య పరిస్థితి గురించి సూపరింటెండెంట్‌తో చర్చించారు. ఇదిలా ఉండగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం పట్ల నిరసన తెలియజేస్తూ బిజెపి సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. గవర్నర్ ప్రసంగం ప్రతిని సభ్యులకు అందించగానే వాటిని చదివిన కొద్ది సేపటికే బిజెపి సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసి వెళ్ళిపోయారు.

ప్రజాస్వామ్యంపై దాడి



(మొదటిపేజీ తరువాయి)

చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గవర్నర్‌ను ఏకవచనంతో సంభోదిస్తూ అనరాని మాటలు అన్నారని, జరిగిన ఘటనలు బాధ కలిగించాయని పేర్కొన్నారు. మైక్‌లు,హెడ్‌ఫోన్‌లు విరగ్గొట్టి గవర్నర్‌పైకి విసిరారని, పెన్నులు, కండ్ల జోడులను, చింపిన పుస్తకాల ముక్కలను యథేచ్ఛగా గవర్నర్‌పైకి విసిరారని చెప్పారు. గవర్నర్ లక్ష్యం గా చేసుకుని శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తాను గవర్నర్‌ను టార్గెట్ చేసి విసిరిన హెడ్‌ఫోన్ పొరపాటున స్వామిగౌడ్‌కు తగిలిందని, ఆయనపై దాడి చేసే ఉద్దేశం తనకు లేదని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నట్లు టివిలో వచ్చిందన్నారు. కాగా కాంగ్రెస్ దాడిలో గాయమైంది స్వామిగౌడ్‌కు కాదని ప్రజాస్వామిక వ్యవస్థకని అన్నారు. సిఎం కెసిఆర్ బాగా కష్టపడి అభివృద్ధి చేస్తున్న తెలంగాణకు మంచి పేరు రావడం జీర్ణించుకోలేక కాంగ్రెస్ నేతలు దాడికి దిగారని ఆరోపించారు. తెలంగాణ పరువు తీయాలని కాంగ్రెస్ నేతలు దాడికి దిగారని అన్నారు. సిఎల్‌పి నేత జానారెడ్డి లాంటి వారు ఈ దాడిని ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. ఈ దాడి వెనుక ఏదో కుట్ర ఉన్నదని జానారెడ్డి, భట్టి విక్రమార్కలు అనడం విచారకరమన్నారు. గవర్నర్‌పై దాడి చేసిన వారిది కుట్ర అంటారా? సభలో సంయమనం పాటించి గౌరవాన్ని కాపాడిన మాది కుట్ర అంటారా? అని ప్రశ్నించారు. అన్నీ అంశాలను చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నామంటే కాంగ్రెస్ పారిపోతోందన్నారు.

మాది భగత్‌సింగ్ పోరాటం, వారిది ఉగ్రవాదం : ఉద్యమ సమయంలో తాము గొడవ చేసింది నిజమేనని, పరాయి పాలనలో జరిగిన ఆ సభలో తమ గొంతు నొక్కారని, అందుకే ఆనాడు ఆలా వ్యవహరించామని హరీశ్‌రావు అన్నారు. నాడు సభలో మా నిరసనకు, నేడు సభలో కాంగ్రెస్ చర్యలకు దేశభక్తికి, దేశద్రోహానికి ఉన్నంత తేడా ఉన్నదన్నారు. పార్లమెంట్‌పై భగత్ సింగ్ దాడి చేశారని, కొన్నేళ్ళ క్రితం ఉగ్రవాదులు దాడి చేశారని, తమది భగత్ సింగ్ తరహాలో దేశభక్తితో కూడుకున్నదని, కాంగ్రెస్ చేసిన దాడి పార్లమెంట్ మీద ఉగ్రవాదులు చేసిన దాడి లాంటిదని వ్యాఖ్యానించారు. సభలో జరిగిన ఘటనలపై సిసి టీవీ ఫుటేజ్ ఆధారంగా రికార్డుల పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకునే అధికారాన్ని స్పీకర్‌కు బిఎసి అప్పజెప్పిందని వెల్లడించారు. సభలో పోలీసులను మోహరించారన్న కాంగ్రెస్ ఆరోపణను ప్రశ్నించగా, గవర్నర్‌పై దాడి జరిగాకే మార్షల్స్ వచ్చారని సమాధానమిచ్చారు.

మద్దతు ధర కోసమే

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యమని చైర్మన్, ఎంపి గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో సహకరించుకునే ధోరణిలో ముందుకు పోవాలే తప్ప కలహించుకోరాదన్నారు. బషీర్‌బాగ్‌లోని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో గుత్తా సుఖేందర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గుత్తా మాట్లాడుతూ వ్యవసాయం సంక్షోభంలో ఉందని, దేశానికే మనం దిక్సూచి అయ్యే లక్ష్యంతో రాష్ట్ర వ్యవసాయానికి సిఎం కెసిఆర్ దిశా నిర్దేశం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని అందులో భాగంగానే పంటకు పెట్టుబడి పథకాన్ని ముందుకు తెచ్చారని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. చట్టసభలలో ఉన్నది అందరూ రైతు బిడ్డలేనని అయితే రైతుకు మాత్రం న్యాయం జరగడం లేదన్నారు. రైతు సమన్వయ సమితి చైర్మన్, వ్యవసాయ మంత్రిగా తాను బండికి రెండు చక్రాలుగా పని చేసి రాష్ట్ర వ్యవసాయాన్ని ఉన్నత పథంలోకి తీసుక వెళ్ళాల్సిన బాధ్యత ఉందని పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఉచిత కరెంటు, సాగునీటి పెద్ద ఎత్తున పథకాలు, రెండు పంటలకు పెట్టుబడి, ప్రతీ 5వేల ఎకరాలకు ఒక విస్తరణాధికారి వ్యవస్థ మన రాష్ట్రంలోనే ఉన్నాయన్నారు. రైతు సమన్వయ సమితులు ఎవరి మీద పెత్తనం చేయడానికి కాదని, పరస్పర సహకారంతో కుటుంబ సభ్యులుగా పనిచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, పట్నం మహేందర్ రెడ్డి, జగదీష్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇంద్రకరణ్ రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, రైతు సమితుల కో ఆర్డినేటర్‌లు తదితరులు పాల్గొన్నారు.

2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తాం : కెటిఆర్

వ్యవసాయంలో విప్లవాత్మక సంస్కరణలకు సిఎం కెసిఆర్ నాయకత్వంలో శ్రీకారం చుట్టామని, 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఐటిశాఖ మంత్రి కె. తారక రామారావు అన్నారు. రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎంఎస్. స్వామినాథన్‌తో సహా పలు శాస్త్రవేత్తలు చేసిన సిఫార్సులను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఎకరా సాగుకు నీరు ఇవ్వడం ద్వారా హరిత విప్లవం, చెరువులు, కుంటలను పరిరక్షించుకుని, అందులో చేపలు పెంపకం చేపట్టడం



ద్వారా నీలి విప్లవం, గొర్రెల పంపిణీతో మాంసోత్పత్తితో గులాబీ విప్లవం, పాల ఉత్పత్తుల్ని పెంచడంతో క్షీర విప్లవం సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



ఇంజిన్ సమస్యతో వెనక్కొచ్చిన ఇండిగో విమానం

ముంబయి/అహ్మదాబాద్ : దాదాపు 186 మంది ప్రయాణికులతో అహ్మదాబాద్ నుంచి లక్నోకు బయలుదేరిన ఇండిగో విమానం ఇంజిన్‌లో సమస్య తలెత్తడంతో ప్రయాణికులు, సిబ్బంది కలవరపాటుకు గురయ్యారు. ప్రాట్ అండ్ వైట్నీ ఇంజిన్లతో నడిచే ఎయిర్‌బస్ ఎ320 నియో విమానం ఎగిరిన 40 నిమిషాలకే తిరిగి అహ్మదాబాద్ విమానాశ్రయానికి తిరిగొచ్చేసింది. ఆకాశంలో ఉండగానే విమానం తాలూకు ఒక ఇంజిన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అంతా బెంబేలు పడ్డారు. కానీ ఉదయం 10.04 గంటలకు ఆ విమానం అర్ధాంతరంగా అహ్మదాబాద్ విమానాశ్రయంలో సురక్షితంగా దిగాక అందరూ బతికారా దేవుడా అనుకుంటూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రయాణికులెవరికీ ఎలాంటి హానీ జరగలేదని విమానాశ్రయం డైరెక్టర్ మనోజ్ గంగల్ తెలిపారు. అహ్మదాబాద్ నుంచి కోల్‌కతా (లక్నో గుండా) బయలుదేరిన 6ఇ–244 విమానం నింగిలోకి ఎగిరిన కొంతసేపటికి రెండో ఇంజిన్‌లో సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయని ఇండిగో తన ప్రకటనలో పేర్కొంది. నిర్వహణ ప్రమాణాల మేరకు విమాన సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టి మళ్లీ విమానాశ్రయానికి విమానాన్ని వెనక్కి మళ్లించారు. పి అండ్ డబ్ల్యు ఇంజిన్లకు 'తగిన రక్షణ చర్యలు' ప్రభుత్వం తీసుకుందని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా చెప్పిన కొన్ని రోజులకే ఈ ఘటన జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

నిట్‌లో విద్యార్థుల ఘర్షణ, కత్తులతో దాడి



మనతెలంగాణ/నిట్ క్యాంపస్ : స్ప్రింగ్ ఫ్రీ –2018 మూడు రోజుల కార్యక్రమం ముగింపు వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రముఖ టాలీవుడ్ సింగర్ రేవంత్ డిజెలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో బిటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థి జస్ప్రిత్‌సింగ్‌పై ఆరుగురు విద్యార్థులు ఇనుపరాడ్లు, కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో జస్ప్రిత్ సింగ్‌కు తీవ్రగాలయాలు కాగా చికిత్స నిమిత్తం ఎన్ఐటి అంబులెన్స్‌లో హన్మకొండలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడ్డ విద్యార్థులు ఉత్తర భారతదేశానికి చెందిన వారు. ఈ ఆరుగురు విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేసి కాజీపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాడిలో గాయపడ్డ విద్యార్థి ఆరోగ్య ప్రస్తుతం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మన తెలంగాణ/నర్మెట్ట : పంటలు పండక తెచ్చిన అప్పులు తీరక ఏమి చేయాలో తెలియక మండల కేంద్రానికి చెందిన రైతు బండి వెంకటమల్లయ్య (75) సోమవారం వ్యవసాయ భూమి వద్ద పక్క రైతు దేవరకొండ అంజయ్య భూమిలోని చెట్టుకు తాడుతో ఉరేసుకొని మృతి చెందాడు. బంధువులు, గ్రామస్తుల వివరాల ప్రకారం... వెంకట మల్లయ్య భార్య కూడా గత రెండు సంవత్సరాల క్రితం మరణించింది. ఆయన వ్యవసాయ భూమిలో 4 బోర్లు వేసినా నీళ్ళు పడక పోవడంతో అప్పులు ఎక్కువై ఏమి చేయాలో తెలియక మనస్థాపం చెంది ఉరేసుకున్నాడు. మృతునికి ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ వడిచర్ల గోవర్ధన్ కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా హాస్పిటల్‌కు పంపించినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి...

మన తెలంగాణ / కోడేరు : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లి గ్రామంలో ఓ రైతు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సాయిపల్లి గ్రామానికి చెందిన తాళ్ల గోపాల్ (40) వ్యవసాయ పొలంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రోజు వారీగా రాత్రి సమయంలో వ్యవసాయ పొలం వద్దకు కాపలా వెళ్లాడు. అక్కడే పురుగుల మందు తాగి తెల్లవారుజామున ఇంటికి వచ్చి తన పిల్లలను చూసుకుంటున్న గోపాల్‌ను చూసిన భార్య గౌరమ్మకు అనుమానం వచ్చి అడిగి చుట్టుపక్కల వారిని పిలిచింది. గోపాల్‌ను కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో నాగర్ కర్నూల్ తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు. గోపాల్ ఆత్మహత్యతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పశువులపై విరుచుకుపడుతున్న చిరుత

మన తెలంగాణ/రామాయంపేట : పశువులపై చిరుత దాడులు చేస్తూనే ఉంది. మొన్న లక్ష్మాపూర్, కాట్రియల్లో ఆవు, లేగ దూడలపై దాడి చేయగా తాజాగా ఆదివారం రాత్రి లక్ష్మాపూర్‌లో రెండు దూడలపై దాడి చేసి చంపివేసింది. దీంతో అక్కడి ప్రజలు రాత్రిల్లో బయటకి వెళ్లాలంటేనే జంకుతున్నారు. బాధితుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వెల్మల లక్ష్మి తన పొలంలో పశువులను కట్టేసింది. అక్కడికి ఉదయం వెళ్లి చూసే సరికి రెండు దూడలు మృతి చెంది ఉన్నాయి. ఒకదాన్ని పూర్తిగా చిరుత తిని వేయగా మరోదాన్ని చంపేసింది.చిరుత వరుస దాడుల మూలంగా ఆయా గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. చిరుతను త్వరలో బంధించి ప్రజలతో పాటు పశువులను కాపాడాలని వారు అటవీ అధికారులను వేడుకుంటున్నారు.

పోల్కంపల్లిలో ప్రేమజంట ఆత్మహత్య



మన తెలంగాణ/ దౌల్తాబాద్: మండల పరిధిలోని పోల్కంపల్లి కి చెందిన అనంతయ్య, నర్సమ్మలకు ఇద్దరు కొడుకులు. అందులో పెద్ద కుమారుడు ప్రవీణ్‌కుమార్ (20) కోస్గిలో ఐటిఐ చేసి హైదరాబాద్‌లో ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన భీమప్ప, బుగ్గమ్మల కూతురు మంజుల (18) మహబూబ్‌నగర్‌లో ఇంటర్‌మీడియట్ పూర్తి చేసి ప్రస్తుతం ఇంటి దగ్గర ఉంది. ఇరువురు కొన్ని రోజులు గా ప్రేమించుకుంటున్నారన్నారు. ఈవిషయం తెలియని మంజుల తల్లిదండ్రులు ఆమెకు కొడంగల్ మండలం రావులపల్లికి చెందిన వ్యక్తితో పెళ్ళి ఖాయం చేశారు. విషయం తెలుసుకున్న ప్రవీణ్‌కుమార్ ఆదివారం హైదరాబాద్ నుంచి తన సొంత గ్రామానికి వచ్చాడు. ఇరువురు కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రవీణ్‌కుమార్‌కు చెందిన పొలం దగ్గర చింత చెట్టుకు ఒకే తాడుతో ఇరువురు ఉరేసుకొని ఉండటాన్ని స్థానికులు గమనించారు. విషయాన్ని ఇరు కుటుంబాల వారికి తెలియజేశారు. పోలీసులు శవాలను పోస్టుమార్టం నిమిత్తం కొడంగల్ ఆసుపత్రికి పంపించారు. మృతురాలు మంజుల తల్లి బుగ్గమ్మ ఫిర్యాదు మేర కు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం నేడు అంబేద్కర్ విగ్రహాల వద్ద మహాధర్నా



మన తెలంగాణ / హైదరాబాద్/ ఉస్మానియా యూనివర్సిటీ: పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని, ఢిల్లీకి ముఖ్యమంత్రి కెసిఆర్ అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్ళాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 13న రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల ఎదుట మహాధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్‌హౌజ్‌లో సోమవారం ఆయన మాదిగ విద్యార్థి సమాఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలోపెట్టుకుని 13న నిర్వహించాల్సిన బంద్‌ను రద్దు చేసుకున్నామని, అయితే రాష్ట్ర ప్రభుత్వం లాగా మొండి వైఖరితో తాము లేమని చెప్పారు. రవాణాకు, రాకపోకలకు, విద్యార్థుల చదువులకు, పరీక్షలకు ఎలాంటి ఆటంకం జరగకుండా ఈ నెల 13న పెద్ద సంఖ్యలో అంబేద్కర్ విగ్రహాల ఎదుట మహాధర్నా చేపట్టాలని ఆయన ఎమ్మార్పీఎస్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాజ్య సభ సీట్ల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను ప్రవేశపెట్టాలని ఆయన రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మాదిగ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, పల్లెర్ల సుధాకర్ పాల్గొన్నారు.

నాడు పదవుల కోసం పెదవులు మూసుకున్నారు





▶▶ ఇప్పుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలా?
▶▶ కాంగ్రెస్‌పై మంత్రి కెటిఆర్ ధ్వజం

మన తెలంగాణ/చండూరు : కాంగ్రెస్ ప్రభుత్వం కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రానికి చిల్లిగవ్వ ఇచ్చే ప్రసక్తే లేదని నిండు సభలో చెప్పినప్పుడు కాంగ్రెస్ నేతలు, ఈ ప్రాంత ఉద్దండులు పదవుల కోసం పెదవులు మూసుకున్నారని, కాని ఇప్పుడు రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉంటుందని మంత్రి కె.తారకరామారావు విమర్శించారు. మునుగోడు నియోజకవర్గ ప్రగతి సభలో చండూరు మండలంలో చౌరస్తాలో నిర్మించినఅమరవీరుల స్థూపం,స్వర్గీయ ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహావిష్కరణ తెలంగాణ తల్లి విగ్రహం మూడు కోట్లతో సిసి,డ్రైనేజీ పనులను ప్రారంభించారు. అనంతరం ప్రగతి సభలో మాట్లాడుతూ గత మూడున్నర ఏళ్ల కాలంలోనే తెలంగాణ రాష్ట్రంలో కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధి సాధించిందని వచ్చే ఎన్నికల నాటికి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగు నీరు ఇవ్వకపోతే కెసిఆర్ ఓటు అడిగే ప్రసక్తే లేదని హామీ ఇచ్చారు. ఆ హామీని నెలబెట్టుకున్నందుకే తెలంగాణ ప్రాంత మంత్రులు, శాసనసభ సభ్యులు,అధికారులు ఎన్నికలలోపు తాగు నీటిని అందించేందుకు కృత నిశ్చయంతో ఉందన్నారు. అదే విధంగా మునాయిదాలో ఘట్టుప్పల్ మండలాన్ని ప్రకటించి కొన్ని అనివార్య కారణాల వల్ల ఘట్టుప్పల్ మండలం నిలిచిపోయిందని, త్వరలోనె ఘట్టుప్పల్ ప్రజలు శుభవార్త వింటారని హామీ ఇచ్చారు. ఎంపి, ఎంఎల్ఏ విన్నపం మేరకు మునుగోడు నియోజకవర్గంలో దండు మల్కాపురంలో పరిశ్రమలు స్థాపించడానికి రాచకొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు.

టిఆర్ఎస్‌లో భారీగా చేరికలు

నాయకులు కర్నాటి విద్యాసాగర్, చండూరు జడ్‌పిటిసి, టిడిపి ఫ్లోర్ లీడర్ అన్నెపర్తి సంతోష శేఖర్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, జడ్‌పిటిసి ఆధ్వర్యంలో 500 మంది కెటిఆర్, జగదీశ్‌రెడ్డి, ఎంఎల్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపి భూరనర్సయ్యగౌడ్, జడ్‌పి చైర్మన్ బాలునాయక్, ఎంఎల్ఏ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, గాదరి కిశోర్, ఫైళ్ళ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెయ్యి కుటుంబాలకు హైస్పీడ్ బ్రాండ్ బ్యాండ్ సేవలు

మన తెలంగాణ / మహేశ్వరం : ఈ సంవత్సరం చివరి నాటికి తెలంగాణ రాష్ట్రంలో కోటి కుటుంబాలకు హై స్పీడ్ బ్రాండ్ బ్యాండ్ సేవలను అందిస్తామని మంత్రి కెటిఆర్ తెలిపారు. సోమవారం మహేశ్వరం మండలం రావిరాల ఫ్యాబ్‌సిటీలో రూ.260కోట్లతో 20 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయనున్న ఆప్టికల్ ఫైబర్ ప్లాంటుకు మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తో కలిసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్య క్రమంలో మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ ఈఫైబర్ టెలి కమ్యూనికేషన్ 4జి 5జి బ్రాండ్ బ్యాండ్ నెట్ వర్క్‌ను తెలంగాణలోని అన్ని గ్రామాలకు విస్తరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని అందులో భాగంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని సిరిగిరిపురం తుమ్మలూర్ మన్సాన్‌పల్లి మహేశ్వరం గ్రామాల్లో టిఫైబర్ గ్రిడ్‌ను పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిందని గుర్తు చేశారు. హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్ లిమిటెడ్ వారు ఫైబర్ ప్లాంటుకు అనుమతి కోరగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఫ్యాబ్ సిటీలో 20 ఎకరాల స్థలాన్ని కేటాయించి మౌలిక సౌకర్యాలు కల్పించిందన్నారు. మొదటి యూనిట్‌ను రూ. 260 కోట్లతో చేపట్టి సంవత్సర కాలంలో ఫైబర్ కేబుల్ ముడిసరుకు తయారు చేస్తామని,వెయ్యి మందికి ఉద్యోగా వకాశాలు కల్పిస్తామని అన్నారు. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూకేషన్స్ లిమిటెడ్ చైర్మన్ మహేంద్ర శుక్లా మేనేజింగ్ డైరెక్టర్ మహేంద్ర సహతా, ఐటి ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ పాల్గొన్నారు.

లష్కరే తొయిబాలో చీలిక

'జైషే మన్‌ఖాఫ్'ను రూపొందించిన అమీర్ హంజా

న్యూఢిల్లీ: ప్రపంచ ఉగ్రవాది హఫీజ్ సయీద్‌తో సంబంధం ఉన్న జమాత్ ఉద్ దావా(జెయుడి)పై పాకిస్థాన్ ప్రభుత్వం నిషేధం విధించడంతో లష్కరే తొయిబా(ఎల్ఇటి)లో చీలిక ఏర్పడింది. దానిని కూడా హఫీజ్ సయీదే స్థాపించారు. పాకిస్థాన్ ప్రభుత్వం సయీద్ గ్రూపుకు విరాళాలివ్వడాన్ని నిషేధించడంతో ఆ గ్రూపు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడిపోయింది. దాంతో లష్కరే తొయిబాలో కూడా చీలిక ఏర్పడింది. అందిన సమాచారం ప్రకారం ఇప్పుడు లష్కరే తొయిబా రెండుగా చీలిపోయింది. అందిన వార్తలు నమ్మదగినవే అయితే కొత్తగా ఏర్పడిన గ్రూపును లష్కరే తొయిబా సహ వ్యవస్థాపకుడు మౌలానా అమీర్ హమ్జా ఏర్పాటు చేశారు. దానికి ఆయన 'జైషే మన్‌ఖాఫ్' అని పేరును కూడా పెట్టారు. ముంబయి ఉగ్రదాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌కు మౌలానా అమీర్ హమ్జా అత్యంత సన్నిహితుడు. పాకిస్థాన్‌లో జమాత్ ఉద్ దావా, ఫలాహ్ ఎ ఇన్సానియత్ గ్రూపులు నడుపుతున్న సయీద్ నుంచి హమ్జాకు ఇన్నాళ్లు విరాళాలు అందాయి. పాకిస్థాన్ ప్రభుత్వం సయీద్ గ్రూపులపై విధించిన నిషేధం కారణంగానే మౌలానా అమీర్ హమ్జా వేరుకుంపటి పెట్టినట్లు సమాచారం. కొత్తగా ఏర్పాటు చేసుకున్న ఉగ్రవాద గ్రూపుకు హమ్జా ఇప్పుడు విరాళాలు సేకరిస్తున్నాడు. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ నమ్మకాన్ని చురగొనడానికి అతడిప్పుడు జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు నిర్వహించాలని కూడా ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం.

కాంగ్రెస్ పనైపోయింది : మురళీధర్‌రావు



మన తెలంగాణ/ ఆదిలాబాద్ : కాంగ్రెస్ పార్టీ అన్ని రాష్ట్రాలలో తుడిచిపెట్టుకు పోతుందని, దీనికి ఇటీవల వస్తున్న ఎన్నికల ఫలితాలే నిదర్శనమని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావ్ అన్నారు. బిజెపి ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రైతు పంచాయతీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోతున్న కాంగ్రెస్‌రాష్ట్రంలో యాత్రలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కెసిఆర్ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాల కారణంగానే రాష్ట్రంలో, జిల్లాలో రైతు ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఆదిలాబాద్ జిల్లాలో గులాబీ రంగు పురుగు సోకి పత్తి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తించక పోవడం శోచనీయమన్నారు. తెలంగాణ కోసం ఉద్యమించిన వారిని, సామాజిక న్యాయం కావాలని ఉద్యమించిన వారిని పక్కన పెట్టి కాంట్రాక్టర్లను పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. ఆదిలాబాద్ మార్కెట్‌లో తేమ పేరిట పత్తి రైతులను వ్యాపారులు దోచుకుంటున్నా పట్టించుకోని సిఎం కెసిఆర్ దేశ రాజకీయాలను శాసిస్తానని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.సాగునీటి వనరులను పెంచి వ్యవసాయానికి అవసరమైన సాగునీటిని అందిస్తామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం నాలుగేళ్లలో ఎన్ని ఎకరాలకు నీరందించారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క రైతు సంతోషంగా లేడని, రుణమాఫీ పేరిట రైతులను దగా చేసిన ప్రభుత్వం పంటసాగు సాయం చేస్తామని గొప్పలు చెప్పుకుంటుందన్నారు. రైతులకు అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కి ఖైదీ హల్‌చల్



మన తెలంగాణ/చర్లపల్లి : చర్లపల్లి కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీ ఖాజా పాషా చర్లపల్లి జైలు పెట్రోల్ పంపు పక్కన ఉన్న విద్యుత్ హైటెన్షన్ టవర్ ఎక్కి మూడు గంటల పాటు హల్ చల్ చేశాడు. రంగారెడ్డి జిల్లా నావబ్‌పేట్ శేర్‌గుడెంకు చెందిన ఖాజాపాషా 2012లో భానుర్ వద్ద తన భార్యను అతి కిరాతకంగా హత్య చేసిన కేసులో మెదక్ జిల్లా కోర్టు న్యాయమూర్తి మార్చి 8వ తేదీ 2013న జీవిత ఖైదు శిక్షను విధించారు. అప్పటి నుంచి చర్లపల్లి కేంద్ర కారాగారంలో శిక్షఖైదీగా శిక్ష అనుభవిస్తున్న ఖాజాపాషా మంచి ప్రవర్తన కారణంగా 2017లో చర్లపల్లి సెంట్రల్ జైలులోని పెట్రోల్ పంపులో పని చేసేందుకు జైలు అధికారులు ఎంపిక చేశారు. జిల్లా కోర్టు తీర్పును సవాలు చేస్తూ ఖాజాపాషా హైకోర్టులో అప్పీలుకు వెళ్లగా ఈ నెల 7న హైకోర్టు జీవితఖైదీ శిక్ష విధించడంతో మానసికంగా కృంగిపోయిన ఖాజాపాషా సోమవారం జైలు పెట్రోల్ పంపు పక్కన ఉన్న హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కాడు. జైలు సిబ్బంది విద్యుత్ టవర్ వద్దకు చేరుకుని ఎంత మాట్లాడినా కిందకు దిగలేదు. వివిద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్ ప్రసారం కాకుండా నిలివేశారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు మూడు గంటల శ్రమించి పోలీసులు, జైలు అధికారులు స్కైలిఫ్ట్‌తో విద్యుత్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది చకచక్యంగా వ్యవహరించి కిందకు దింపారు.

ఖైదీ డిమాండ్స్ : సంఘటనా స్థలానికి చేరుకున్న జైళ్ల శాఖ డిఐజి సైదయ్య, మల్కాజిగిరి, డిసిపి ఉమామహేశ్వరశర్మ, ఎసిపి కృష్ణమూర్తి, జైలు సూపరింటెండెంట్ ఎంఆర్ భాస్కర్ ఖాజాపాషాతో మాట్లాడగా తనకు అన్యాయం చేసి తన భార్య చావుకు కారణమైన శంకర్‌పల్లి ఎస్ఐ నాగరాజును సస్పెండ్ చేయాలని, తన ఇద్దరు పిల్లలను మంచి చదువులు చదివించాలి, తను రాసిన కవితలను పుస్తకం అచ్చువేయించాలని కోరాడు.

అదనపు కట్నం కోసం కిరోసిన్ పోసి నిప్పంటించిన భర్త



▶▶ మృతదేహంతో భర్త ఇంటి ముందు కుటుంబ సభ్యుల ఆందోళన
▶▶ భర్త, అత్త, మామలపై కేసు నమోదు

మన తెలంగాణ / మంథని : అదనపు కట్నం కోసం కట్టుకున్న భార్యకు నిప్పంటించగా, వారం రోజులుగా హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చివరకు తుది శ్వాస విడిచిన విషాదకర ఘటన మంథని మండలం రచ్చపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలానికి చెందిన సంధ్యారాణి (21) కి మంథని మండలం రచ్చపల్లి (అడ్డ్యాల) గ్రామానికి చెందిన మలవేన సంతోష్‌తో గత ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆసమయంలో అమ్మాయి కుటుంబసభ్యులు కట్న కానుకలు, అన్ని లాంఛనాలతో ఘనంగా వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కుమారులు కలుగగా, సంసారం సాఫీగా సాగుతున్న నేపథ్యంలో సంధ్యారాణికి అత్తగారి ఇంటి నుంచి అదనపు వరకట్నం వేధింపులు మొదలయ్యాయి. అదనంగా రూ.3 లక్షలు తేవా లని సంధ్యారాణిని భర్తతో పాటు అత్త, మామలు నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారు. ఇదే క్రమంలో 5న సోమవారం రాత్రి సంధ్యారాణిని ఇంట్లో కట్టివేసిన అత్త, భర్త సంతోష్ నోట్లో గుడ్డలు కుక్కి బయటకు ఏలాంటి అరుపులు వినపడకుండా కిరోసిన్ పోసి నిప్పంటించారని మృతురాలి తల్లి స్వరూప కన్నీటి పర్యంతమవుతూ తెలిపింది. సంధ్యరాణిని గాంధీ హాస్పటల్‌కు చికిత్స నిమిత్తం తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. తన కూతురుని అల్లుడు సంతోష్, అతని తల్లి, తండ్రిలు కలిసి కిరోసిన్ పోసి హత్య చేశారని తన కూతురు సంధ్యారాణి పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మృతురాలి మృతదేహంతో సంతోష్ ఇంటి ముందు ధర్నా, అందోళనకు దిగారు. సంతోష్ తరపు బంధువులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు సంధ్యారాణి భర్త, అత్త, మామలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోచంపల్లిలో కివీస్ బృందం



న్యూజిలాండ్ దేశానికి చెందిన ఐదు గురు పర్యాటకుల బృందం సోమవారం పోచంపల్లిని సందర్శించింది. భారతదేశ పర్యటనలో వున్న వీరు హైదరాబాద్ పర్యటనలో భాగంగా పోచం పల్లిని సందర్శించారు. మండల కేంద్రం లోని పలు వస్త్రాల షాపులలో పోచంపల్లి చేనేత ఉత్పత్తుల ను పరిశీలించారు. అనంతరం చేనేత కార్మికులతో మాట్లా డారు. వస్త్రాల తయారీ విధానాన్ని తెలుసుకున్నారు.

– మన తెలంగాణ/భూదాన్‌పోచంపల్లి

ఫోటో తీసుకుంటానంటూ ఆభరణాలతో పరార్

నిందితుడిని పట్టుకున్న పోలీసులు



మన తెలంగాణ/మన్సూరాబాద్ : బంగారు ఆభరణాలు బాగున్నాయి ఫోటో తీసుకుని ఇస్తానని ఆభరణాలతో పరారైన నిందితుడు కటకటాల పాలైన సంఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎల్బీనగర్ డిసిపి కార్యాలయంలో సోమవారం డిసిపి వెంకటేశ్వర్‌రావు వివరాలు తెలిపారు. వనస్థలిపురం శక్తినగర్ కాలనీ రాణి విష్ట రెసిడెన్సిలో నివాసం ఉండే ఎడవల్లి రామకృష్ణ (38) టివి మెకానిక్ పని చేస్తుంటాడు. దీంతో అతనికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో డబ్బులు సునాయాసంగా సంపాదించాలని ఆలోచనతో, రోడ్ల మీద నడుచుకుంటూ వెళ్లే వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులను పరిచయం చేసుకుంటాడు. పరిచయం చేసుకుని వారిని వారి ఇంటి వద్ద వదిలి పెడుతుంటాడు. ఇలా పరిచయాలు పెంచుకుని వారి ఇంటికి వెళ్లి సోదరి, సోదరుడు పెళ్లి నిశ్చయం జరిగింది, మీఅభరాణాలు బాగా ఉన్నాయని ఫోటో తీసుకుని ఇస్తానని అక్కడినుంచి పారిపోతాడు. ఇతని మీద గతేడాది మూడు కేసులు నమోదు కాగా, ఈ సంవత్సరంలో రెండు కేసులు నమోదు జరిగాయని తెలిపారు. సోమవారం ఉదయం వాహనాలు తనిఖీల్లో భాగంగా నిందితుడి వద్ద ద్విచక్ర వాహనం సరియైన ధృవ పత్రాలు లేక పోవడంతో అనుమానంతో పోలీసులు విచారణ చేపట్టారు. దీంతో మొత్తం విషయాలు బయటికొచ్చాయి. నిందితుడి నుంచి టివిఎస్ విక్టర్ బైక్ (ఎపి 12 డి 6705) వాహనం, ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు.

బిఎల్‌ఎఫ్ వల్లనే బిసిలకు రాజ్యసభ టికెట్లు

తమ్మినేని వీరభద్రం




మన తెలంగాణ/వరంగల్ బ్యూరో : బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బిఎల్‌ఎఫ్) ఆవిర్భావం, మహాజన పాదయాత్ర నేపథ్యంలోనే టిఆర్ఎస్ లాంటి పార్టీలు బిసిలకు రాజ్యసభ టికెట్లు ఇచ్చాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. అసలు కుర్చీని వాళ్ల దగ్గరే పెట్టుకొని సీట్లు ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదన్నారు. దళితుడిని సిఎం చేస్తానని చెప్పి కెసిఆర్ చేయలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 119 అసెంబ్లీ స్థానాల్లో 65 సీట్లు బిసిలకు ఇస్తారా? అని తమ్మినేని వీరభద్రం టిఆర్ఎస్, కాంగ్రెస్‌లను ప్రశ్నించారు. సోమవారం హన్మకొండలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ బిఎల్‌ఎఫ్ రానున్న ఎన్నికల్లో 119 స్థానాల్లో పోటీ చేయనుందని ప్రకటించారు. రాష్ట్రంలో నిర్బంధం తీవ్రమవుతుందన్నారు. టిజాక్ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంను అరెస్ట్ చేశారని, అంతకుముందు మంద కృష్ణ మాదిగను అరెస్ట్ చేశారన్నారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ప్రాంతీయ పార్టీల నేతృత్వంలో ప్రత్యామ్నాయ ఫ్రంట్ ఏర్పాటు వృథా ప్రయాస కార్యక్రమమని సిపిఎం భావిస్తుందన్నారు. రాష్ట్రాల అధికారులు, విధులకు సంబంధించి సందర్భం వస్తే ఫ్రంట్‌కు సంబంధించి ఆలోచిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య, జి.రాములు, పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కరాచీలో భారతీయ వైద్యుడి

కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన సుప్రసిద్ధ సర్జన్ డా.సుభాష్ గుప్త పాకిస్తాన్‌లోని కరాచీలో మూడు లేదా నాలుగు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహించనున్నారు. ఈ మేరకు కరాచీలోని డో యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (డియుహెచ్ఎస్)లోని ఓజా క్యాంపస్‌కు డా.గుప్త తన బృందంతో చేరుకుంటారని పాకిస్తాన్ మీడియా వెల్లడించింది. 'డాక్టర్ గుప్త ఈ నెలలో కరాచీకి వస్తున్నారు. డియుహెచ్ఎస్‌లోని ఓజా క్యాంపస్‌లో మూడు లేదా నాలుగు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తారు' అని డియుహెచ్ఎస్ వైస్ చాన్సలర్ ప్రొ.సయీద్ ఖరేషీ సోమవారం ఇక్కడ జరిగిన గ్యాస్ట్రో ఎంటరాలజీపై జరిగిన మెడికల్ కాన్ఫరెన్స్‌లో తెలిపారు. శస్త్ర చికిత్సలు చేయడంతో పాటు సంక్లిష్టమైన సర్జరీలు చేయడంలో పాకిస్తాన్ వైద్యులకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు. ఢిల్లీకి చెందిన 56 ఏళ్ల డా.గుప్త ప్రస్తుతం మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని లివర్, బిలియారీ సైన్సెస్ డిపార్ట్‌మెంట్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

బయోపిక్‌లో నటించబోతున్నాడు



బాలీవుడ్‌లో ప్రస్తుతం బయోపిక్స్ హవా నడుస్తోంది. ఈ నేపథ్యంలో స్టార్ హీరో షారుఖ్‌ఖాన్ కూడా ఓ బయోపిక్‌లో నటించేందుకు సిద్ధం కానున్నాడు. ప్రస్తుతం అతను 'జీరో' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. ఏప్రిల్ చివరికి ఈ సినిమా షూటింగ్‌ను ముగించబోతున్నాడు. అనంతరం ఆస్ట్రోనాట్ రాకేష్ శర్మ జీవితం ఆధారంగా తెరకెక్కబోయే బయోపిక్ కోసం షారుఖ్ సిద్ధమవుతాడు. ఇందుకోసం అతను మూడు నెలల సమయాన్ని తీసుకోనున్నాడు. ఈ సమయంలోనే రాకేష్ శర్మ గురించి షారుఖ్ అన్ని అంశాలను క్షుణ్ణంగా తెలుసుకొని సినిమా కోసం మానసికంగా, శారీరకంగా సిద్ధమవుతాడట. ఈ చిత్రానికి 'సెల్యూట్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మొదలయ్యే ఈ చిత్రం వచ్చే ఏడాది పూర్తవుతుంది. వచ్చే ఏడాది చివరలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని ఫిల్మ్‌మేకర్స్ ప్లాన్ చేశారట. భారీ బడ్జెట్‌తో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కే ఈ చిత్రాన్ని సమ్‌థింగ్ స్పెషల్‌గా రూపొందించనున్నారు. బాలీవుడ్‌లో ఇప్పటివరకు వచ్చిన బయోపిక్స్ కంటే పూర్తిగా కొత్తదనంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తారట.



నాగార్జున

ఈ ఏడాదిలోనే బంగార్రాజు

'సోగ్గాడే చిన్ని నాయనా' సినిమా ఎంత హిట్ అయిందో ఆ సినిమాలో బంగార్రాజు పాత్ర అంత పాపులర్ అయింది. అప్పట్లోనే నాగార్జున చెప్పేశాడు బంగార్రాజు పాత్రతో సినిమా చేస్తానని. ఇక ఈ చిత్ర దర్శకుడు కళ్యాణ్‌కృష్ణ అన్నపూర్ణ బ్యానర్‌కు రెండు హిట్‌లు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ ఏడాదిలోనే ఎలాగైనా 'బంగార్రాజు' సినిమా పూర్తి చేయాలని నాగార్జున నిర్ణయించుకున్నాడట. ప్రస్తుతం రవితేజ హీరోగా కళ్యాణ్‌కృష్ణ ఓ సినిమా చేస్తున్నాడు. ఇది పూర్తయిన తర్వాత ఆయన 'బంగార్రాజు' సినిమాపై దృష్టిపెడతాడు. అలాగే నానీతో కలిసి మల్టీస్టారర్‌ను పూర్తిచేసిన తర్వాత నాగార్జున ఈ చిత్రాన్ని చేయాలని నిర్ణయించుకున్నాడు. 'బంగార్రాజు' చిత్రాన్ని పూర్తిచేసి వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలన్నది. నాగార్జున ఆలోచన అని తెలిసింది. అదే సమయంలో ఈ ఏడాది చివరలో అన్నపూర్ణ బ్యానర్‌లో నాగచైతన్య హీరోగా ఓ సినిమాను ప్రారంభిస్తాడట నాగార్జున. ఆయన నిర్మించే ఈ చిత్రాన్ని ఓ కొత్త దర్శకుడు తెరకెక్కిస్తాడు. అంటే వచ్చే ఏడాది అన్నపూర్ణ బ్యానర్‌లో రెండు సినిమాలు విడుదలవుతాయన్న మాట.

నిర్మాతగా ఉండటమే నాకు ఇష్టం

నిఖిల్, సిమ్రాన్ పరీంజ, సంయుక్త హెగ్డే హీరోహీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా అనిల్ సుంకరతో ఇంటర్వ్యూ...

అందుకే రీమేక్ చేశాం..

నాకు ఎప్పటినుండో 'శివ'లాంటి హిట్ సినిమా చేయాలనే కోరిక ఉండేది. కన్నడలో ఘన విజయాన్ని సాధించిన 'కిరిక్ పార్టీ' కంటెంట్ ఆ సినిమాకు ఎంతో కొంత దగ్గరగా ఉండడంతో దాన్ని తెలుగులో 'కిరాక్ పార్టీ'గా రీమేక్ చేశాం. మేము ఆశించిన విధంగా మంచి ఔట్‌పుట్ వచ్చింది. దీంతో సినిమా విజయం సాధిస్తుందని నమ్మకంగా ఉన్నాం.

ఒకేసారి ఫోకస్ చేయలేమని...

ముందుగా ఈ చిత్రానికి రాజుసుందరంను దర్శకుడిగా తీసుకోవాలని అనుకున్నాం. కానీ ఆయన తెలుగు, తమిళం భాషల్లో రీమేక్ చేద్దామన్నారు. కానీ రెండు భాషల్లో ఒకేసారి అంటే ఫోకస్ చేయలేమని వద్దనుకున్నాం. ఆతర్వాత శరణ్ కొప్పిశెట్టికి ఈ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశాన్ని కల్పించాం.



అనిల్ సుంకర

సహాయం చేస్తామన్నారు...

నిఖిల్‌కు 'కిరిక్ పార్టీ' సినిమాను చూపించేటప్పుడు అతని వెంట సుధీర్‌వర్మ, చందూ మొండేటి కూడా వచ్చారు. వాళ్లు కూడా సినిమా చూసి ఎంతో బాగుందని అన్నారు. శరణ్ కూడా వాళ్ల దగ్గర గతంలో పనిచేసి ఉండటంతో ఏదైనా సహాయం కావాలన్నా చేస్తామన్నారు. చివరికి ఈ చిత్రానికి సుధీర్‌వర్మ స్క్రీన్‌ప్లే, చందూ మొండేటి మాటలు రాయడం జరిగింది.

పెద్ద ప్లస్ పాయింట్...

చాలా మంది యువకులు పల్లెటూరి నుండి నగరానికి ఇంజనీరింగ్ చేయడానికి వస్తారు. మొదటి సంవత్సరంలో భయం భయంగా ఉండే ఆ కుర్రాళ్లు రెండవ సంవత్సరానికి వచ్చిన తర్వాత కొంత మారుతారు. చివరి సంవత్సరానికి వచ్చేటప్పటికి పూర్తిగా మారిపోతారు. ఈ విషయాన్ని ఇంతకుముందు ఏ సినిమాలో కూడా పూర్తిగా చూపించలేదు. కానీ మా సినిమాలో చూపించాం. అదే ఈ సినిమాలో పెద్ద ప్లస్ పాయింట్.

అభిరుచికి తగ్గట్టుగా...

సినిమా ఒరిజినల్ వర్షన్ 2 గంటల 45 నిముషాలు ఉంటుంది. దాన్ని తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టు మార్పులు చేసి 2 గంటల 25 నిముషాలకు కుదించాం. రెండు పాటలను తీసేస్తే ఇంకా 8 పాటలు మిగిలాయి. ఇక ఈ చిత్రాన్ని 90 శాతం వరకు మేమే రిలీజ్ చేయనుండగా... మిగతాది వేరేవాళ్లు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు.

నిర్మాతగా సక్సెస్ అయ్యా...

దర్శకుడిని కావాలని నేను ఇండస్ట్రీకి వచ్చాను. కానీ విఫలమయ్యాను. అయితే నిర్మాతగా సక్సెస్ అయ్యాను. కాబట్టి నిర్మాతగా ఉండటమే నాకు ఇష్టం.

ఆ సినిమా ప్రయత్నాల్లో...

శర్వానంద్‌తో చేయాలనుకున్న సినిమా ఇంకా ఫైనల్ కాలేదు. స్టోరీ పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రానికి 'దండుపాళ్యం' ఫేమ్ శ్రీనివాసరాజును దర్శకుడిగా అనుకున్నాం. కథ పూర్తయ్యాక అన్నీ ఫైనల్ చేస్తాం.

బ్రహ్మానందానికి హాస్య నటబ్రహ్మ బిరుదు ప్రదానం



బ్రహ్మానందానికి వీణను బహూకరిస్తున్న శాసనసభాపతి మధుసూధనాచారి. చిత్రంలో టి.సుబ్బరామిరెడ్డి, జయప్రద, జీవిత, రాజశేఖర్, జితేందర్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, శ్రీనివాస్‌గౌడ్.

హాస్యనటుడు బ్రహ్మానందం సార్థక నామధేయుడని... ఆయన పేరులోనే ఆనందం ఉందని తెలంగాణ శాసనసభాపతి మధుసూధనాచారి పేర్కొన్నారు. ఆయన యావత్ జాతికి హాస్యాన్ని పంచుతున్న మహానటుడని కొనియాడారు. టిఎస్‌ఆర్ కాకతీయ లలితా కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మహబూబ్‌నగర్‌లో జరిగిన కాకతీయ కళా వైభవ మహోత్సవానికి మధుసూధనాచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా 1100 చిత్రాలు పూర్తిచేసిన బ్రహ్మానందంకు 'హాస్య నటబ్రహ్మ' బిరుదును ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం చేతికి మధుసూధనాచారి బంగారు కంకణం తొడిగి వీణ, జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం మధుసూధనాచారి మాట్లాడుతూ కాకతీయ కళా వైభవం కార్యక్రమాల ద్వారా కాకతీయుల కీర్తిని విశ్వవ్యాప్తం చేయడానికి టి.సుబ్బరామిరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ "తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కాకతీయ కళా వైభవోత్సవాలను నిర్వహిస్తాం. తెలుగువారి సత్తా, శక్తిని అందరికీ తెలియజేస్తాం. బ్రహ్మానందం ఓ జీనియస్ నటుడు. 1100 చిత్రాల్లో నటించి ఆయన రికార్డు సృష్టించారు. ఇక కాకతీయ కళావైభవోత్సవానికి రాజకీయాలతో సంబంధం లేదని... కళలను ప్రోత్సహించేందుకే ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నాం" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జయప్రద, జీవిత, రాజశేఖర్, శ్రద్ధాదాస్, అలీ, శ్రీనివాస్ రెడ్డి, రఘుబాబు, మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి, ఎంపీలు జితేందర్ రెడ్డి, నంది ఎల్లయ్య, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు బాబు మోహన్, శ్రీనివాస్ గౌడ్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా హీరోకు జోడీగా...



వరుణ్‌తేజ్, అదితిరావు హైదరీ

మెగా ఫ్యామిలీ హీరోలు అందరూ ఒక దారిలో వెళ్తుంటే వరుణ్‌తేజ్ మాత్రం డిఫరెంట్ కథలను ఎంచుకుంటున్నాడు. ఫిదా, తొలిప్రేమ సక్సెస్‌లతో ప్రస్తుతం ఈ యంగ్ హీరో మంచి ఊపు మీదున్నాడు. తనకంటూ ఓ మార్కెట్‌ను సెట్ చేసుకున్న అతను తన రెమ్యునరేషన్‌ను కూడా పెంచేశాడు. అయితే ఈ మెగా హీరో నెక్స్ట సినిమా తన కెరీర్‌లోనే బెస్ట్ సినిమాగా నిలవడం ఖాయమని తెలిసింది. స్పేస్ బ్యాక్‌గ్రౌండ్‌తో వరుణ్ ఈ సినిమా చేయబోతున్నాడు. ఘాజీ సినిమాతో మంచి సక్సెస్‌ను అందుకున్న సంకల్ప్ రెడ్డి ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నాడు. ఇకపోతే ఈ సినిమాలో హీరోయిన్ కోసం గత కొంత కాలంగా సినిమా యూనిట్ వెతుకుతోంది. మొదట కొంత మంది మోడల్స్‌తో ఆడిషన్ చేశారు. కానీ ఎవరు హీరోయిన్ పాత్రకు సెట్ కాకపోవడంతో బాలీవుడ్ భామను తీసుకోవాలనుకున్నారు. చివరికి సుధీర్‌బాబుతో 'సమ్మోహనం' సినిమా చేస్తున్న అదితిరావు హైదరీని ఈ చిత్ర కథానాయికగా ఎంపికచేశారు. కథ నచ్చడంతో ఆమె ఈ సినిమాకు డేట్స్ అడ్జస్ట్ చేసే పనిలో ఉందట. ఇక వచ్చేనెల చివరలో సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లాలని దర్శకుడు ప్లాన్ చేస్తున్నాడు. అన్ని పనులను పూర్తిచేసి ఈ ఏడాది చివరలోనే సినిమాను విడుదల చేయాలని ఫిల్మ్‌మేకర్స్ నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాలోని తన పాత్ర కోసం వరుణ్ బరువు తగ్గించుకునే పనిలో ఉన్నాడు.

'ఊ.పె.కు.హ' గీతాల ఆవిష్కరణ

రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో 'నిధి' ప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఊ.పె.కు.హ'. ఊళ్లో పెళ్లికి కుక్కల హడావుడి అనేది క్యాప్షన్. జెబి క్రియేషన్స్ పతాకంపై శ్రీమతి భాగ్యలక్ష్మి నిర్మిస్తున్న ఈ చిత్రంలో సాక్షి చౌదరి కథానాయిక. అనూప్ రూబెన్స్ సంగీతమందించిన ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. బిగ్ సీడీని జెమిని కిరణ్ విడుదల చేయగా... ఆడియో సీడీలను రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "సాధారణంగా చిన్న సినిమా, పెద్ద సినిమా అని అంటుంటారు. నా సినిమాను చిన్న సినిమా అన్న ప్రతిసారి పెద్ద వసూళ్లు వచ్చాయి. నేను సంగీత దర్శకుడు రాజ్‌కోటితో కలిసి పనిచేసేటప్పుడు అతని వద్ద దిలీప్ అనే కీబోర్డ్ ప్లేయర్ ఉండేవాడు. ఆయనే ఇప్పుడు ఎ.ఆర్.రెహమాన్ అయ్యారు. అలాగే ఇప్పుడు అనూప్ కూడా తాను కీబోర్డు ప్లేయర్‌నని చెప్పుకోవడం వింటుంటే ఆనందంగా ఉంది. అర్బన్ కామెడీ సినిమా ఇది. ఇందులో 80 మంది నటీనటులు నటించారు. నిధి ప్రసాద్ చక్కగా సినిమా తీశాడు. నేను త్రివిక్రమ్‌తో జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, మహేష్‌తో 'శ్రీమంతుడు' సినిమాలు చేసినప్పుడు ఎంత ఆనందం కలిగిందో ఈ సినిమా చేసినప్పుడు కూడా అంతే ఆనందం కలిగింది. భాగ్యలక్ష్మి, విక్రమ్‌లు సినిమాను చక్కగా నిర్మించారు. తప్పకుండా సినిమా పెద్ద హిట్ అవుతుంది" అని అన్నారు. దర్శకుడు నిధి ప్రసాద్ మాట్లాడుతూ "అనూప్ రూబెన్స్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. నా సినిమాకు సంగీతాన్ని అందించాలని అడిగే సమయంలో అతను చాలా బిజీగా ఉన్నాడు. అయినా కూడా నేను అడిగానని ఈ సినిమాకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు.



'ఊ.పె.కు.హ' ఆడియో వేడుకలో రాజేంద్రప్రసాద్, సాక్షి చౌదరి, జెమిని కిరణ్, నిధి ప్రసాద్, భాగ్యలక్ష్మి

మా సినిమా కోసం తన విలువైన సమయాన్ని కేటాయించారు. అందుకు అనూప్‌కు థాంక్స్. సినిమా బాగా వచ్చింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చెప్పారు. అనూప్‌రూబెన్స్ మాట్లాడుతూ "ఇంతకుముందు నిధి ప్రసాద్ చేసిన సినిమాకు నేను కీబోర్డు ప్లేయర్‌గా పనిచేశాను. ఆయనతో అప్పటి నుండి మంచి పరిచయం ఉంది. ఆయనతో ఉన్న స్నేహం కారణంగా ఆయన అడగగానే మ్యూజిక్ అందించాను. ఈ సినిమా హిట్ అయి నిధి ప్రసాద్ మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. సాక్షి చౌదరి మాట్లాడుతూ "అనూప్ చాలా మంచి మ్యూజిక్ అందించారు. కుటుంబం అంతా కలిసి చూసేలా సినిమా ఉంటుంది. నిధిప్రసాద్ సినిమాను చక్కగా తెరకెక్కించారు" అని పేర్కొన్నారు.

అప్పుడే ఆ బాధను మరచిపోయేదాన్ని

తెరపై అద్భుతంగా ప్రేమను పండించే కొన్ని జంటలు నిజ జీవితంలో కూడా ప్రేమలో పడి... విడిపోతుంటారు. సినీ లోకంలో ఇది సాధారణ విషయంగా మారింది. ఇలా కలవడం, విడిపోవడం సాధారణమే అయినా... అందరి విషయాల్లో ఒకేలా ఉండదు. ప్రేమ విషాదం కొందరి సినీ జీవితాలనే కాకుండా వ్యక్తిగత జీవితాలపై సైతం తీవ్ర ప్రభావం చూపింది. బాలీవుడ్ హాట్ బ్యూటీ కత్రినాకైఫ్ సైతం ప్రేమలో విఫలమై చెప్పడానికి వీలుకాని బాధను అనుభవించిందట. ముందుగా కండల వీరుడు సల్మాన్‌ఖాన్‌తో ప్రేమలో పడ్డ ఈ భామ... ఆ బంధం తెగిపోయాక ఆ బాధ నుంచి విముక్తి కావడానికి చాలా కష్టపడింది. అనంతరం మరో హీరో రణబీర్ కపూర్‌తో ప్రేమను పంచుకున్న కత్రినాకు... ఈ బంధం నుంచి కూడా విడిపోక తప్పలేదు. ఈసారి మాత్రం తను ఎంతో నరకయాతనను అనుభవించానని చెప్పింది ఈ భామ. అయితే ఆ వేదన నుంచి బయటపడడానికి వ్యాయామాన్ని ఆసరాగా తీసుకున్నానని... ఒక్కోసారి అతిగా వ్యాయామం చేసేదాన్నని, అప్పుడే ఆ బాధను మరచిపోయేదాన్నని పేర్కొంది.



కత్రినాకైఫ్

నచ్చనిది ఇంతవరకు చేయలేదు



రాశీఖన్నా

యంగ్ బ్యూటీ రాశీఖన్నాకు సినిమా రంగంపై మంచి అవగాహన వచ్చేసింది. పరిచయమైంది హిందీ సినిమా 'మద్రాస్ కేఫ్'తో అయినా బాలీవుడ్‌ను వదిలేసి తెలుగు చిత్రాలకే పరిమితమైంది. 2014లో శ్రీనివాస్ అవసరాల తీసిన 'ఊహలు గుసగుసలాడే' సినిమాతో తెలుగులో కెరీర్ మొదలుపెట్టిన ఈ ముంబయ్ చిన్నది అతి తక్కువ సమయంలోనే తెలుగులో ఎక్కువ సినిమాలు చేసింది. ఈ ప్రయాణం ద్వారా వచ్చిన అనుభవంతో సినిమా రంగం గురించి పెద్ద లెక్చర్లే ఇచ్చేస్తోంది. ఇటీవల వరుణ్‌తేజ్ 'తొలిప్రేమ' చిత్రంతో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకున్న ఈ భామ మాట్లాడుతూ "ఇష్టం లేకుండా సినిమా రంగంలో ఏమీ చేయలేం. వంద శాతం సృజనాత్మకతతో కూడుకున్న చిత్ర పరిశ్రమలో అదే స్థాయిలో మనసు లగ్నం చేసి నటిస్తేనే మంచి స్థానానికి చేరుకోగలం" అని పేర్కొంది. "ఇప్పటివరకు నాకు నచ్చిన చిత్రాల్లో మాత్రమే నటిస్తూ వస్తున్నాను. నచ్చని సినిమా ఇంతవరకు చేయలేదు. అనవసరంగా ఒప్పుకున్నాననే భావన మనసులో కలిగితే కెమెరా ముందు సరిగా నటించలేం. అలాంటి పరిస్థితి తలెత్తకూడదనే నాకు నచ్చిన కథలకే ఎక్కువగా ప్రాధాన్యతనిస్తున్నాను. ఏ విషయంలో అయినా మొహమాటానికి పోతాను కానీ కథల ఎంపికలో మాత్రం నాకు ఎలాంటి మొహమాటం లేదు" అని చెప్పింది రాశీఖన్నా.

అందరికీ పంచాలన్నదే నా ఆలోచన



మనీషా కోయిరాల

ఇప్పుడు చాలామంది సీనియర్ నటులు పుస్తకాలు రాసేస్తున్నారు. తమ జీవితాలను పుస్తక రూపంలో మలచి అభిమానులకు కొత్త అనుభవాన్ని పంచుతున్నారు. వీరి జీవితంలో జరిగిన ఎన్నో తెలియని సంఘటనలు, వాటి వెనుక ఉన్న కారణాలు తెలుసుకునే అవకాశం ఈ పుస్తకాలతో కలుగుతోంది. బాంబే, భారతీయుడు, ఒకే ఒక్కడు వంటి దక్షిణాది చిత్రాల్లో నటించిన బాలీవుడ్ భామ మనీషా కొయిరాలా కూడా ఓ పుస్తకం రాస్తోంది. తన జీవితం గురించే రాస్తున్నా ఈ పుస్తకం ఆటోబయోగ్రఫీ మాత్రం కాదంటోంది మనీషా. "నాకు పుస్తకాలు చదవడమంటే ఎంతో ఇష్టం. ఇక నా విజ్ఞానాన్ని అందరికీ పంచాలన్నదే నా ఆలోచన. నేను రాస్తున్నది నా ఆటోబయోగ్రఫీ కాదు. అయితే ఇందులో నా జీవితం, సినీ జీవితం గురించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు మాత్రం ఉంటాయి. నాకు ఆరోగ్యం బాగాలేనప్పుడు... చాలా విషయాలు రాశాను. అవే ఇప్పుడు నా పుస్తకానికి మూలం" అని అంటోంది మనీషా కోయిరాలా. ఈ భామ గతంలో క్యాన్సర్‌తో బాధపడి... ఆ మహమ్మారి నుంచి బయటపడ్డ సంగతి తెలిసిందే. క్యాన్సర్‌తో మనీషా చేసిన పోరాటమే ఆమె రాస్తున్న పుస్తకానికి మెయిన్ థీమ్.



ఎయిర్‌టెల్ రూ.16,500 కోట్లు సమీకరణకు ఆమోదం

ముంబై: విదేశీ బాండ్లు, ఎన్‌సిడి(నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్స్) ద్వారా రూ.16,500 కోట్లు సమీకరించే ప్రతిపాదనకు సోమవారం ఎయిర్‌టెల్ బోర్డు ఆమోదం తెలిపింది. స్పెక్ట్రమ్ రుణాలతో సహా నిర్వహణ కోసం ఈ నిధులను సమీకరించనున్నట్టు సంస్థ తెలిపింది. రిలయన్స్ జియో నుంచి గట్టి పోటీ ఎదురవడంతో ఇటీవల ఎయిర్‌టెల్‌కు లాభాలు తగ్గిపోయాయి. ఈనేపథ్యంలో ఎయిర్‌టెల్ కంపెనీ నిధుల సమీకరణ ద్వారా కంపెనీని విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఎన్‌సిడిల జారీ ద్వారా నిధుల సమీకరణ చేపట్టేందుకు కంపెనీ చేసిన ప్రతిపాదనకు బోర్డు అనుమతి లభించడంతో స్టాక్‌మార్కెట్లో ఎయిర్‌టెల్ కౌంటర్ బలపడింది. ప్రస్తుతం ఎన్‌ఎస్‌ఇలో ఈ షేరు 5.21 శాతం పెరిగి రూ. 423 వద్ద స్థిరపడింది. ప్రయివేట్ ప్లేస్‌మెంట్ కింద వివిధ దశలలో ఎన్‌సిడిల జారీ ద్వారా రూ.10 వేల కోట్లను సమీకరించేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు నిధుల సమీకరణకు అనుమతి లభించిందని భారతీ ఎయిర్‌టెల్ పేర్కొంది. అంతేకాకుండా ఎఫ్‌సిసిబిల ద్వారా 100 కోట్ల డాలర్లు (రూ. 6500 కోట్లు) సమీకరించేందుకు బోర్డు అంగీకరించినట్లు వెల్లడించింది.

బుల్ జంప్

- నిఫ్టీ 195, సెన్సెక్స్ 611 పాయింట్లు ర్యాలీ
- నాలుగు శాతం లాభపడిన ఐటిసి
- ప్రపంచ మార్కెట్ల ప్రోత్సాహంతో సూచీల జోరు



ముంబై: కొద్ది రోజులుగా చతికిలబడిన మార్కెట్లు ఒక్కసారిగా జంప్ చేశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల అంశాలతో సోమవారం సెన్సెక్స్ 600 పాయింట్లకు పైగా లాభపడింది. ఆఖరికి 33,917 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 194 పాయింట్లు పెరిగి 10,421 వద్ద స్థిరపడింది. ఆసియా, యూరోపియన్ మార్కెట్ల లాభాలతో సూచీలు ఆద్యంతం భారీగా ర్యాలీ చేశాయి. 2017 జూలై తరువాత ఈ స్థాయిలో సూచీలు ర్యాలీ చేయడం ఇదే మొదటిసారి. అయితే ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లు మాత్రం బలహీనంగానే కదలాడాయి. ట్రేడింగ్‌లో పిఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లు తప్ప మిగతా అన్ని రంగాలకు చెందిన షేర్లు లాభపడ్డాయి. ఐటిసి 4శాతం ర్యాలీ చేయడంతో ఎఫ్‌ఎంసిజి రంగ సూచీ అత్యధికంగా 3శాతం లాభపడింది.ఇక కీలకమైన నిఫ్టీ బ్యాంక్ సూచి 367.75 పాయింట్లు 1.51 శాతం లాభపడి 24,664 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 33,468 నుంచి 33,962 పాయింట్ల మధ్య శ్రేణిలో కదలాడింది. ఇక నిఫ్టీ సూచీ 10,295 నుంచి 10,433.65 శ్రేణిలో ట్రేడ్ అయ్యింది. మిడ్ సెషన్‌లో ప్రారభమైన ర్యాలీ ట్రేడింగ్ ముగిసే వరకు కొనసాగడంతో బిఎస్‌ఇ సెన్సెక్స్ 33917.94 వద్ద, నిఫ్టీ 10,421.40 పాయింట్ల వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో ఎన్‌టిపిసి, వేదాంత లిమిటెడ్, ఐటిసి, భారతీ ఎయిర్ షేర్లు 4 నుంచి 5 శాతం లాభపడ్డాయి. టెక్ మహీంద్ర, అరబిందో ఫార్మా, కోల్ ఇండియా షేర్లు నష్టపోయాయి. కొద్ది రోజులుగా మార్కెట్లు భేరిష్ ఉండడంతో.. షేర్ల విలువలు తగ్గాయి. దీంతో తగ్గుముఖం పట్టిన షేర్లను చౌక ధరలకు కొనుగోలు చేసేందుకు మదుపరులు ఆసక్తి చూపడం కూడా మార్కెట్లు లాభాలకు కారణమైంది.


పుంజుకున్న మిడ్, స్మాల్ క్యాప్‌లు

కొద్ది రోజులుగా నేలచూపులు చూస్తున్న బిఎస్‌ఇ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు.. సోమవారం 0.7 శాతం పుంజుకున్నాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 1366 లాభపడగా, 1363 నష్టాలను నమోదు చేశాయి.

ఎఫ్‌పిఐల పెట్టుబడులు

అమ్మకాలకే ప్రాధాన్యమిస్తున్న ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) శుక్రవారం భారత్ స్టాక్‌మార్కెట్లో రూ.550 కోట్లను ఇన్వెస్ట్ చేశారు. గత కొంతకాలంగా పెట్టుబడుల బాటలో సాగుతున్న దేశీ ఫండ్స్(డిఐఐలు) స్వల్పంగా రూ. 65 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించాయి. గత బుధ, గురువారాల్లో ఎఫ్‌పిఐలు రూ. 1,080 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకోగా, డిఐఐలు రూ. 1,075 కోట్లను ఇన్వెస్ట్ చేశాయి.





ఆంధ్రా బ్యాంక్ షేరు 10 శాతానికి పైగా పతనం

ఆంధ్రా బ్యాంక్, స్టెర్లింగ్ బయోటెక్ షేర్లు సోమవారం స్టాక్‌మార్కెట్లో 10 శాతం వరకు పతనమయ్యాయి. సందేశరా గ్రూప్ కంపెనీకు చెందిన స్టెర్లింగ్ బయోటెక్ పాల్పడిన రూ.5 వేల కోట్ల రుణం మోసం కేసులో ఆంధ్రాబ్యాంక్ మాజీ డైరెక్టర్ అనూప్ ప్రకాశ్ గార్గ్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ ప్రభావం బ్యాంక్ షేర్లపై తీవ్ర ప్రభావం చూపింది. కుంభకోణం అంశం మరోసారి తెరపైకి రావడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. దీంతో ఆంధ్రాబ్యాంకు షేరు సోమవారం 52వారాల కనిష్టానికి పతనమైంది. ఏ దశలో 15శాతానికి పైగా నష్టపోయి రూ.32.55 వద్దకు చేరింది. బ్యాంక్ షేరు ఏడాది కనిష్ట, గరిష్ట ధరలు వరుసగా రూ.32.55లు, రూ.76.10లుగా ఉన్నాయి. సందేశరా గ్రూపు ఆంధ్రా బ్యాంక్ కన్సార్షియం నుంచి అక్రమ పద్ధతిలో రూ.5 వేల కోట్ల మేరకు బ్యాంక్ రుణం పొందిందని ఆరోపణలు ఉన్నాయి. సందేశారాస్ గ్రూప్ (స్టెర్లింగ్ బయోటెక్)నకు రుణ లబ్ధి చేకూర్చేందుకు రూ.2 కోట్లను అనూప్ స్వీకరించినట్లు ఇడి పేర్కొంది.


యునిటెక్ ఆస్తులను వేలం వేస్తాం

గృహ కొనుగోలుదారులను మోసం చేశారు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: గృహ కొనుగోలుదారులను మోసం చేశారనే ఆరోపణల కేసులో రియల్టీ సంస్థ యునిటెక్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సకాలంలో ఇళ్లను నిర్మించని కారణంగా కొనుగోలుదారుల చెల్లించిన సొమ్మును తిరిగి ఇచ్చేయాలని, దీనికోసం యునిటెక్ ఆస్తులను వేలం వేస్తామని కోర్టు హెచ్చరించింది. గృహ కొనుగోలు దారులను దారుణంగా మోసం చేశారంటూ యునిటెక్‌పై ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బోర్డు డైరెక్టర్లు వ్యక్తిగత ఆస్తులు సహా సంస్థ ఇతర దేశీ, విదేశీ ఆస్తుల వివరాలను అందించాలని ఆదేశించింది. మార్చి 5వ తేదీన ఆస్తుల పూర్తి వివరాలతో ఒక అఫిడవిట్‌ను సమర్పించాలని కంపెనీని కోర్టు కోరింది. అయితే ఈ జాబితా అసంపూర్తిగా ఉందని కంపెనీ పేర్కొనడంతో సుప్రీం మండిపడింది. పూర్తి జాబితాను 15రోజుల్లో సమర్పించాలని కోర్టు చెప్పింది. తదుపరి విచారణను మార్చి 26వ తేదీకి వాయిదా వేసింది.

జెఎం ఫైనాన్స్, ఎఆర్‌సికి రూ.25 లక్షల జరిమానా

కేసును తప్పుదోవ పట్టించారంటూ జెఎం ఫైనాన్స్ లిమిటెడ్, ఎఆర్‌సి లిమిటెడ్‌కు సుప్రీంకోర్టు రూ.25 లక్షల జరిమానా విధించింది. కస్టమర్లకు తిరిగి డబ్బులు చెల్లించేందుకు కోర్టులో సొమ్మును డిపాజిట్ చేస్తారని విశ్వసించామని, కస్టమర్లను సమస్యనుంచి పక్కదారి పట్టించారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు 25 లక్షల రూపాయల జరిమానా కూడా విధించింది.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33917.94	610.80	1.83%
నిఫ్టీ	10421.40	194.55	1.90%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29110	31133.69	–0.34%
ముంబై	29850	31925.13	0.13%
ఢిల్లీ	29850	31925.13	0.67%
కోల్‌కతా	29990	32074.87	0.2%
కేరళ	28150	30106.95	0.18%
బెంగళూరు	28550	30534.76	0.18%
హైదరాబాద్	29110	31133.69	0.21%
గల్ఫ్	1402.73	1500.25	–0.65%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	ఆదివారం	మార్పు (%)
చెన్నై	41500.00	41500.00	0.00
ముంబై	41500.00	41500.00	0.00
ఢిల్లీ	41500.00	41500.00	0.00
కోల్‌కతా	41500.00	41500.00	0.00
హైదరాబాద్	41500.00	41500.00	0.00



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	330	విశాఖపట్నం	330
వరంగల్	332	చిత్తూరు	362
విజయవాడ	332	చెన్నై	370
గోదావరి	322	బెంగళూరు	365

మొబైల్స్‌పై ఫ్లిప్‌కార్ట్ ఆఫర్



న్యూఢిల్లీ: ఇ– కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ మొబైల్స్‌పై భారీ తగ్గింపు ధరలను ప్రకటించింది. ప్రత్యేక సేల్‌లో భాగంగా మోటరోలా, సాంసంగ్, షియోమీ తదితర కంపెనీ మోడల్స్ ధరలను తగ్గించింది. ఈ ఆఫర్‌ను మార్చి 13 నుంచి 15 వరకు 'మొబైల్ బొనాంజా సేల్' పేరిట అందిస్తోంది. ఎస్‌బిఐ క్రెడిట్ కార్డుతో కొనుగోలు చేసేవారికి 5 శాతం తగ్గింపు ధరను అందించనుంది. అలాగే బై బ్యాక్, ఎక్స్‌ఛేంజ్, నో కాస్ట్ ఇఎంఐ వంటి ఆప్షన్లు కూడా ఇస్తోంది. సామ్‌సంగ్ గెలాక్సీ ఆన్ నెకట్స్ రూ.9,499, గెలాక్సీ ఆన్ 5 రూ.6,290, ఎల్‌జి కె7 ఐ రూ.4,999కి లభించనున్నాయి. గూగుల్ పిక్సల్ 2 ఎక్స్‌ఎల్ మోడల్‌ను రూ.49,999 ధరకు విక్రయించనుంది. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు నుంచి కొనుగోలు చేస్తే 5 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. ఇక లెనొవా కె8 ప్లస్ రూ.7,999కి లభించనుండగా.. వాస్తవ ధర రూ.9,999గా ఉంది. ఒప్పో ఎఫ్3 ధరను రూ.16,990 నుంచి రూ.11,990కి తగ్గించింది.

అమెజాన్‌కు కొరియర్ రూ.కోటి మోసం

న్యూఢిల్లీ: ఇ–కామర్స్ సంస్థ అమెజాన్‌కు డెలివరీ కొరియర్‌గా పనిచేస్తున్న యువకుడు కోటి రూపాయలకు పైగా మోసం చేశాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. బెంగళూరుకు చెందిన 25 ఏళ్ల దర్శన్ అలియాస్ ధ్రువ ఏక్‌దంత డెలివరీ కొరియర్ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. తన నలుగురు స్నేహితులతో కలిసి అమెజాన్‌లో ఖరీదైన వస్తువులను ఆర్డర్ చేస్తూ వచ్చాడు. ఖరీదైన వస్తువులను స్నేహితుల ద్వారా ఆర్డర్ ఇచ్చేలా చేశాడు. వాటికి డబ్బులు చెల్లించలేదు. ఆరు నెలల పాటు ఇలా మోసం చేశాడు. అయితే అమెజాన్‌లో నిర్వహించిన ఆడిట్‌లో ఈ విషయం బయటపడింది. గతేడాది సెప్టెంబరు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 4,604 వస్తువులను ఆర్డర్ చేశాడని, వీటి విలువ రూ.1.3 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆ వస్తువులను కొరియర్ ఏజెన్సీలో పనిచేసే దర్శన్ మాత్రమే డెలివరీ చేయడానికి వచ్చేవాడు. వారికి వస్తువులు ఇచ్చి, డబ్బులు మాత్రం తీసుకునేవాడు కాదు. అమెజాన్ కార్డు పేమెంట్ సిస్టమ్‌ను హ్యాక్ చేసి కస్టమర్లు డబ్బులు చెల్లించినట్లుగా చూపించాడు. ఫిబ్రవరి నెలలో ఆడిట్ జరగడంతో మోసం బయటపడింది.

పారిశ్రామిక ఉత్పత్తి మెరుగైంది..

జనవరిలో 7.5 శాతం వృద్ధి





ముంబై: జనవరి నెలలో దేశీయ పారిశ్రామిక ఉత్పత్తి పటిష్టమైన వృద్ధిని నమోదు చేసింది. తయారీ రంగంలో వేగవంతమైన వృద్ధి కారణంగా పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) 7.5 శాతం నమోదైందని కేంద్ర గణాంకాల శాఖ(సిఎస్‌ఒ) ప్రకటించింది. గతేడాది డిసెంబర్ ఇది 7.1 శాతంగా మాత్రమే ఉండగా, ఈసారి స్వల్పంగా పుంజుకుంది. 2017 సెప్టెంబర్‌లో 8.8 శాతంతో పోలిస్తే సూచీ ఇప్పటికీ కనిష్ఠ స్థాయిలోనే ఉంది. ఈమేరకు గణాంకాలను సిఎస్‌ఒ సోమవారం విడుదల చేసింది. తయారీ రంగంలో గణనీయమైన వృద్ధి ఐఐపి సూచీ పెరుగుదలకు దోహదం చేసింది. జనవరిలో తయారీ రంగం సూచీ 8.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. అలాగే విద్యుత్ రంగంలో వృద్ధి 7.6 శాతంగా ఉండడం కూడా ఐఐపికి కలిసి వచ్చింది. పారిశ్రామిక ఉత్పత్తిలో స్వల్పంగా వృద్ధి నమోదు కావడంతో నాలుగో త్రైమాసికంలో ఆరోగ్యకరమైన వృద్ధి దిశగా ఆశలు చిగురించాయి. అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) 7.2 శాతంగా ఉంది. నవంబర్‌లో ఐఐపి 8.8 శాతంకో 25 నెలల గరిష్ఠ స్థాయిలో ఉండగా.. డిసెంబర్‌లో 7.1 శాతంతో మందగించి.. మళ్లీ ఇప్పుడు స్వల్పంగా పుంజుకుంది.

రిటైల్ ద్రవ్యోల్బణం ఊరట

జనవరిలో 4.4 శాతం నమోదు





న్యూఢిల్లీ: ఫిబ్రవరి నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం దిగివచ్చింది. కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం.. 2018 ఫిబ్రవరిలో సిపిఐ(వినిమయ ధరల సూచీ) ఆధారిత ద్రవ్యోల్బణం 4.44 శాతానికి తగ్గింది. అంతకుముందు ఫిబ్రవరి నెలలో 5.05 శాతంతో పోలిస్తే ఈసారి స్వల్పంగా ఊరటను కల్గించింది. మొత్తానికి ఈసారి ఆర్‌బిఐ సమీక్షలో వడ్డీ రేట్ల తగ్గింపునకు అవకాశాలు కనిపిస్తున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఆర్‌బిఐ మధ్యకాలిక లక్ష్యం 4 శాతంతో పోలిస్తే తాజాగా గణాంకాలు దిగిరావాల్సి ఉంది. ఆహార ద్రవ్యోల్బణం దిగువకు పడిపోవడంతో జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం దిగివచ్చింది. 4.7 శాతం నుంచి 3.26 శాతానికి తగ్గింది. పప్పు ధాన్యాలు 17.35 శాతంతో దిగివచ్చింది.

సిద్దిపేటలో జపాన్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్

కంపెనీకి అనుమతి పత్రాలను అందజేసిన మంత్రులు కెటిఆర్, ఈటల, మహేందర్‌రెడ్డి

మన తెలంగాణ / హైదరాబాద్ : జపాన్‌కు చెందిన ప్రముఖ ఫుడ్స్ కంపెనీ 'ఈసే ఫుడ్స్' (ఐఎస్‌ఈ ఫుడ్స్) సిద్దిపేటలో ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీని ప్రారంభించనున్నది. ఈ మేరకు కంపెనీకి అనుమతులు, రాయితీలను ప్రభుత్వం తరఫున మంత్రులు కెటి. రామారావు, ఈటల రాజేందర్, మహేందర్ రెడ్డిలు కంపెనీ సీనియర్ ప్రతినిధి బృందానికి సోమవారం హైదరాబాద్‌లో అందజేశారు. కంపెనీ ప్రతినిధి బృందంతో పాటు జపాన్ ప్రధాన మంత్రి ప్రత్యేక సలహాదారు మిత్సుహైరో మియాకోషీ, ఇసే ఫుడ్స్ ఛైర్మన్, జపాన్ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో మంత్రులు సమావేశం అయ్యారు. ఇసే ఫుడ్స్ సుమారు సుమారు 47 బిలియన్ యెన్ల అమ్మకాలను గత ఏడాది నమోదు చేసుకున్నట్లు తెలిపింది. ఇప్పటికే వివిధ దేశాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లను నెలకొల్పిన జపాన్‌కు చెందిన ఇసే ఫుడ్స్ ఇప్పుడు సిద్ధిపేటలోని నంగనూర్ మండలంలోని నర్మెట్ట గ్రామంలో సుమారు 140 ఎకరాల్లో పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఇందులో తయారయ్యే ఆహార ఉత్పత్తులను హైదరాబాద్‌లోని నేషనల్ బ్యాడ్మింటన్ అకాడమి ద్వారా టోక్యో ఒలంపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు నాణ్యమైన పౌష్టికాహార అవసరం నిమిత్తం అందించే ఒక అవగాహనా ఒప్పందం సైతం తెలంగాణ ప్రభుత్వం, జపాన్ ఫుడ్ సంస్థల మధ్య కుదిరింది. కోడిగుడ్ల ప్రాసెసింగ్ పరిశ్రమతో పాటు కోళ్ల ఫాం ద్వారా వెలువడే వ్యర్థాలతో ఎరువులను సైతం తయారు చేయనుంది. పౌల్ట్రీ టెక్నాలజీలో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఇక్కడి విద్యార్థులను శిక్షణ కోసం జపాన్ తీసుకెళ్లేందుకు కూడా అవకాశం కల్పించనున్నట్లు ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొనింది.

లిథియం బ్యాటరీ పరిశోధనా కేంద్రం

సుజుకి కంపెనీ భాగస్వామ్యంతో లిథియం అయాన్ బ్యాటరీల పరిశోధనా (ఆర్ అండ్ డి) కేంద్రం ఏర్పాటు కానుంది. రెండు మూడేళ్లలో ఈ కేంద్రంలో బ్యాటరీలు ఉత్పత్తి ప్రారంభం కానుంది. జపాన్‌కు చెందిన కంపెనీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం పట్ల మంత్రి కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు. జపాన్‌లో పెట్టుబడుల కోసం పర్యటన చేసిన సందర్భంగా ఈ కంపెనీతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఇప్పటికే జైకా (జపాన్ బ్యాంకు) వంటి ఆర్థిక సంస్థలు తెలంగాణలో పలు ప్రాజెక్టులకు పెట్టుబడుల సహకారం అందిస్తున్నాయని గుర్తు చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ఏర్పాటు చేయడం లక్ష్యంగా నిర్ధేశించుకున్నట్లు తెలిపారు. మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ పౌల్ట్రీ రంగంలో తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో ఉందన్నారు. ఇలాంటి రాష్ట్రంలో ఇసే ఫుడ్స్ వంటి కంపెనీ ఏర్పాటు చేయడం ఇక్కడ పరిశ్రమ అభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని తెలిపారు.



విశ్వాస పరీక్ష నెగ్గిన సంగ్మా సర్కార్



షిల్లాంగ్: మేఘాలయ అసెంబ్లీలో సోమవారం కాన్రాడ్ కె సంగ్మా ప్రభుత్వం విశ్వాస తీర్మానం సునాయాసంగా నెగ్గింది. ఆయన ప్రభుత్వానికి అనుకూలంగా 35 ఓట్లు, వ్యతిరేకంగా 20 ఓట్లు పడ్డాయి. ఒక ఓటు చెల్లకుండా పోయింది. మరొక ఎంఎల్ఎ గైర్హాజరయ్యారు. తాత్కాలిక సభాపతి ఓటేయలేదు. ప్రతిపక్ష నాయకుడు ముకుల్ సంగ్మా రెండు స్థానాల నుంచి పోటీచేసి రెండూ గెలిచాడు. బిజెపి, ప్రాంతీయ పార్టీలు కలుపుకుని సంగ్మా నేతృత్వంలోని మేఘాలయ డెమోక్రటిక్ అలయెన్స్(ఎండిఎ) ప్రభుత్వం మార్చి 6న ప్రమాణస్వీకారం చేసింది. ఎండిఎలో ఆరు కాంగ్రేసేతర ఎంఎల్ఎలు , ఒక స్వతంత్ర ఎంఎల్ఎ ఉన్నారు. విశ్వాస తీర్మానం చర్చను ఆరంభిస్తూ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు ముకుల్ సంగ్మా నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పిపి)పై ధ్వజమెత్తారు. కాన్రాడ్ సంగ్మా ఎన్‌పిపి, భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకోవడంపై నిప్పులు చెరిగారు. 'అసలు ప్రభుత్వానికి కూటమిలోని ఏ పార్టీ నేతృత్వం వహిస్తోందో అసెంబ్లీకి తెలియాలి. ఎన్‌పిపియా లేక బిజెపినా లేక కూటమిలోని ఇతరులా ఎవరు నేతృత్వం వహిస్తున్నారో తెలియాలి' అంటూ ఆయన నిలదీశారు. మేఘాలయ చరిత్రలోనే కాషాయ వర్గ ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయడం ఇదే మొదటిసారని పేర్కొన్నారు.

బిజెపిలోకి నరేష్ అగర్వాల్



న్యూఢిల్లీ : సమాజ్ వాది పార్టీ (ఎస్‌పి) సీనియర్ నాయకుడు నరేష్ అగర్వాల్ సోమవారం నాడు బిజెపిలో చేరారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అగర్వాల్ గతంలో ఎస్‌పి ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. రాజ్యసభ సభ్యునిగా కూడా ఉన్నారు. 'ఒక చలనచిత్ర నటితో నన్ను సమానంగా చూశారు. నాకు ఇవ్వాల్సిన టికెట్‌ను ఆమెకిచ్చారు. ఏ విధమైన నిబంధనలు పెట్టకుండానే (బిజెపిలోకి) వస్తున్నాను. రాజ్యసభ టికెట్‌ను నాకు కావాలని కోరుకోవడం లేదు' అని అగర్వాల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు, సిఎం అఖిలేష్ యాదవ్ రాజ్యసభ సీటును జయా బచన్‌కు ఇవ్వడం పట్ల అగర్వాల్ అసంతృప్తి గురవడంతోనే బిజెపిలో చేరినట్టు తెలుస్తోంది.

దాడులు ఆపండి : సిపిఐ(ఎం)

అగర్తలా : త్రిపురలో ప్రతిపక్షాలపై జరుగుతున్న దాడులను తక్షణం ఆపాలని బిజెపి– ఐపిఎఫ్‌టి భాగస్వామ్యపక్షంలో కొత్తగా ఏర్పాటయిన ప్రభుత్వానికి సిపిఐ(ఎం) జనరల్ సెక్రెటరీ సీతారాం ఏచూరి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పే, దాడుల్లో గాయపడిన వారికి చికిత్సం అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా క్షతగాత్రులకు నష్టపరిహారం కూడా చెల్లించాలన్నారు. ఆర్‌ఎస్ఎస్ విగ్రహాలను మాత్రమే కూల్చివేయగలదు, కానీ వారి భావజాలాన్ని కాదని ఏచూరి స్పష్టం చేశారు. దక్షిణ త్రిపుర జిల్లా బెలోనియాలో కమ్యూనిస్టు నాయకుడు లెనిన్ విగ్రహాన్ని కూల్చివేసిన కాలేజీ స్వేర్‌ను ఏచూరి సోమవారం సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బిజెపి కార్యకర్తలే విగ్రహాన్ని కూల్చివేశారని ఆయన ఆరోపించారు. ఆర్‌ఎస్ఎస్ కనుసన్నల్లోనే ఈ హింసాత్మక ఘటన జరిగిందన్నారు. గతంలో కూడా దేశం ఇలాంటి ఘటనలను చవిచూసిందని చెప్పారు. ఈ తరహా రాజకీయాలతో ఎప్పటికీ ఎప్పటికీ పైచేయి సాధించలేరని ఏచూరి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం జరిగిన అంశాలను సిపిఐ(ఎం) పార్లమెంట్‌లో లేవనెత్తుతామని ఆయన చెప్పారు. కాగా, త్రిపురలో జరిగిన ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందడానికి గల కారణాలు ఏమిటని విలేకరులు ప్రశ్నించగా, ఏచూరి స్పందిస్తూ ఎన్నికల ఫలితాలపై పార్టీ కూలంకశంగా సమీక్షిస్తోందన్నారు.

కశ్మీర్ ఆర్థిక మంత్రి బర్తరఫ్



శ్రీనగర్ : జమ్మూ కశ్మీర్ ఆర్థిక మంత్రి హసీబ్ ద్రాబూను మంత్రి మండలి నుంచి బర్తరఫ్ చేశారు. కశ్మీర్ వివాదం రాజకీయ మిళితం కాదని, ఇది సామాజిక అంశం అని ఆయన చెప్పడం పై దుమారానికి దారితీసింది. ఈ వ్యాఖ్యలు వెలుగులోకి రావడంతో పిడిపి నేత, ఆర్థిక మంత్రి కూడా అయిన హసీబ్‌ను మంత్రివర్గం నుంచి తొలిగిస్తున్నట్లు సోమవారం ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ప్రకటించారు. బర్తరఫ్ విషయాన్ని గవర్నర్ ఎన్ఎన్ వోహ్రాకు లేఖ ద్వారా తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. జమ్మూ కశ్మీర్ పరిస్థితిని రాజకీయాలకు ముడిపెట్టరాదని, కల్లోలిత రాష్ట్రంగా పేర్కొనరాదని , సామాజిక అంశాలతో కూడిన కశ్మీరీ సమాజంగా దీనిని పరిగణించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. తన అవగావహన మేరకు గత 50, 70 ఏళ్లుగా ఈ అంశంపై తప్పుడు అవగావహన సాగుతోందని, ఇది మూలం లేని చుట్టూ ప్రదక్షణగా ఉందన్నారు.


కార్చిచ్చులో 10 మంది మృతి



థేని : తమిళనాడు థేని జిల్లాలోని అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటల్లో కనీసం 10 మంది మృత్యువాత పడ్డారు. ట్రెక్కింగ్‌కు వచ్చిన వీరంతా ప్రమాదవశాత్తూ మంటల్లో చిక్కుకుని మరణించారని తమిళనాడు ప్రభుత్వం తెలిపింది. ' పది మంది చనిపోయారు, మంటల నుంచి రక్షించిన వారిలో 17 మందిని వెంటనే ఆసుపత్రికి తరలించాం. మిగతా వారికి ఎలాంటి వైద్య సహాయం అవసరం లేదు' అని రెవెన్యూ పరిపాలన శాఖ కమిషనర్ కె.సత్యగోపాల్ విలేకరులకు తెలిపారు. కాగా, చనిపోయిన వారిలో ఆరుగురు చెన్నైకు, ముగ్గురు ఈరోడ్‌కు చెందిన వారు ఉన్నారని పోలీసులు చెప్పారు. సమాచారం తెలియగానే సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి కె.పళనిస్వామి ఘటనాస్థలికి చేరుకున్నారు. కాగా, అడవిలో మంటలను ఆర్పేందుకు ఐఎఎఫ్ సిబ్బంది హెలికాప్టర్లతో యత్నిస్తున్నారు. అయినప్పటికీ మంటలు ఇంకా ఎగిసిపడుతూనే ఉన్నాయని, ఉదయం నుంచి సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారని రక్షణ శాఖ పేర్కొంది.


ముగ్గురు తీవ్రవాదులు హతం

శ్రీనగర్ : దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా హకురా ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు, తీవ్రవాదులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు తీవ్రవాదులు హతమైనట్లు ఆర్మీ వెల్లడించింది. హకురా ప్రాంతంలో తీవ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు ఆ ప్రాంతంలో ఆదివారం రాత్రి కూంబింగ్ నిర్వహించినట్లు ఓ ఆర్మీ అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో భద్రతా దళాలకు తీవ్రవాదులు తారసపడగా ఇరువర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయని చెప్పారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు తీవ్రవాదులు మృతి చెందగా, వారిలో ఇద్దరిని గుర్తించారు. తాజా ఎన్‌కౌంర్‌తో అనేక ప్రాంతాల్లో భద్రతా దళాలకు, అల్లరి మూకలకు మధ్య ఘర్షణలు తలెత్తాయన్నారు. సౌరా, ఆంకార్, పాత బర్జుల్లా, లాల్ చౌక్, ఇతర ప్రదేశాల్లో రాళ్లు రువ్వుకున్న ఘటనలు కూడా జరిగినట్లు నివేదికలు అందాయన్నారు. దక్షిణ కశ్మీర్, శ్రీనగర్‌లో ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు పాఠశాలలు, విద్యా సంస్థలను మూసి వేయించారు. కశ్మీర్ యూనివర్శిటీ సోమవారం క్లాసులను రద్దు చేయడంతో పాటు పరీక్షలను కూడా వాయిదావేసింది. లోయ వ్యాప్తంగా మొబైల్ ఇంటర్నెట్ స్పీడును తగ్గించారు. పౌరులు తమ ఆదేశాలను పాటించాలని, అదే విధంగా తమకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



ముంబయిలోని ఓ ఫ్లైఓవర్ మీదుగా రైతుల యాత్ర

జై కిసాన్



● ముంబయి వీధుల్లో రైతు మహా జనసంద్రం ● మండుటెండను లెక్కచేయకుండా తరలిన వేలాది మంది అన్నదాతలు

ముంబయి: రైతుల ప్రదర్శనతో సాగర తీరాన ఉన్న ముంబై మహానగరం జన సంద్రంగా మారింది. చుట్టుముట్టిన పలు సమస్యలతో దిక్కుతోచని రైతులు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి ఒక్కటయి, మహాప్రదర్శనగా ముంబైలో అసెంబ్లీ ముట్టడి చేయడం గతంలో స్థానికంగా జరిగిన కార్మికుల భారీ ప్రదర్శనను తలపించింది. నాసిక్‌లో పిల్లవాగులా మొదలైన ప్రదర్శన ముంబైకి వచ్చే సరికి సముద్రంగా మారింది. ఆజాద్ మైదాన్ అంతా ఎరుపు జెండాలతో ఎగిసిపడే సముద్రంగా మారింది. దాదాపు అరలక్ష మంది రైతులు నేతలకు పట్టని తమ సమస్యల గురించి గళం విప్పి చెప్పేందుకు దూరభారాలు తమకు కొత్తకాదనే రీతిలో పాదయాత్రగా మహానగరానికి తరలివచ్చారు. దేశ వాణిజ్య రాజధాని ఉన్నట్లుండి వ్యవసాయ కూలీలు, రైతుల కూడలిగా మారింది. 180కిలో మీటర్ల దూరం ప్రయాణించి రైతులు ముంబైకి సోమవారం చేరారు. గత కొద్ది రోజులుగా మండిస్తోన్న ఎండలను లెక్కచేయకుండా వారి ప్రయాణం సాగింది. తొలుత సియోన్ ప్రాంతంలోని కెజె సోమైయ్య గ్రౌండ్‌లో సేదదీరిన రైతులదండు నెమ్మదిగా స్థానిక ఆజాద్ మైదాన్‌కు చేరారు. పంటలు ఎండిపోవడం, విద్భర తదితర ప్రాంతాల్లో ఎండిన పొలాల్లోనే రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం బిజెపి పాలిత రాష్ట్రం మహారాష్ట్రలో నిత్య సత్యంగా మారింది. ఈ దశలో రగులుతున్న రైతాంగ ఆగ్రహం పాదయాత్రగా సాగింది. సిపిఎం అనుబంధమైన ఆలిండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో రైతుల యాత్ర సాగింది. ఉదయం పదకొండు గంటలకు ఆజాద్ మైదానం నుంచి అసెంబ్లీ వరకూ రైతుల పాదయాత్రను తొలుత తలపెట్టారు. థానే నుంచి వచ్చిన వేలాది మంది గిరిజనులు రైతుల యాత్రలో కలిశారు. ముంబైలో బాలీవుడ్ యావత్తూ రైతాంగానికి సంఘీభావం ప్రకటించింది. రైతుల ప్రదర్శనకు వీలుగా ముంబై మహానగరంలో రహదారులలో ట్రాఫిక్ నిలిచిపోయింది. పలు రాజకీయ పార్టీల నేతలు రైతు ప్రతినిధులను కలిశారు. వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. ముంబై శివార్లలోని ములుంద్‌లో రాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్ రైతుల ప్రదర్శనకు స్వాగతం పలికారు. సమస్యలను పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. తమ డిమాండ్లపై నిర్థిష్ట ప్రకటన వెలువడే వరకూ తమ నిరసన ఆగబోదని రైతులు ప్రకటించారు. దీనితో ముంబైలో ఉద్రిక్తత నెలకొంది. ప్రతిపక్ష కాంగ్రెస్, ఎన్‌సిపి, మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన, శివసేన నేతలు హుటాహుటిన వచ్చి రైతులను కలిశారు. వారితో ముచ్చటించేందుకు యత్నించారు. అయితే ముంబైలో అసెంబ్లీ ముట్టడే లక్ష్యంగా వారి దండు కదిలింది. ఎంఎన్ఎస్ అధినేత రాజ్‌థాకరే, శివసేన నేత ఆదిత్యాథాకరేలు వేర్వేరుగా రైతులను కలిశారు. గత నవంబర్‌లో మహారాష్ట్ర ప్రభుత్వం రైతులకు భారీ స్థాయి రుణమాఫీని ప్రకటించింది. గత నెలలో రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్ విద్యాసాగర్ రావు చేసిన ప్రసంగంలో దాదాపు 31 లక్షల మంది రైతులు బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ 12,000 కోట్లు జమ చేసినట్లు ప్రకటించారు. అయితే ఇవన్నీ ఉత్తిమాటలని తమకు సాయం అందలేదనే ఆగ్రహంతో రైతాంగం ఈ మహా ప్రదర్శనకు తలపెట్టింది. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలు చేయాలని, వ్యవసాయ కడగండ్లను తీర్చేందుకు శాశ్వత పథకాలు అవసరం అని రైతాంగం కోరుతోంది. ఉత్పత్తి వ్యయంలో ఒకటిన్నర రెట్లు సాగుదార్లకు చెల్లించాలని కోరుతున్నారు, కనీస మద్దతు ధరలను సరైన విధంగా ఖరారు చేయాల్సి ఉందని డిమాండ్ చేస్తున్నారు. ముంబై చరిత్రలోనే కాదు మహారాష్ట్రలోనే ఈ స్థాయిలో రైతాంగం దండుగా కదలడం ఇదే తొలిసారి అని విశ్లేషకులు తెలిపారు. మహారాష్ట్రలో రైతుల బాధలను తీర్చేందుకు కేంద్రం దిగిరావాలని కాంగ్రెస్ అధ్యక్షులు ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు.





దిగివచ్చిన మహారాష్ట్ర ప్రభుత్వం

డిమాండ్లకు అంగీకారం.. లిఖితపూర్వక హామీ

ముంబయిలో సాగిన మహా రైతు ప్రదర్శనతో మహారాష్ట్ర ప్రభుత్వ దిగివచ్చింది. రైతుల డిమాండ్లలో అనేకం తాము తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం ప్రకటించింది. దీనితో రైతులు తమ ఉద్యమం విరమించుకునేందుకు సోమవారం సాయంత్రం అంగీకరించారు. వారం రోజుల పాటు 170 కిలోమీటర్ల మేర రైతుల ప్రదర్శన సాగిన తరువాత, అసెంబ్లీకి అతి దగ్గరికి చేరి ఇక ముట్టడికి రైతులు సిద్ధపడ్డ దశలో రాష్ట్రంలోని ఫడ్నవిస్ ప్రభుత్వం వారి డిమాండ్లను అంగీకరిస్తున్నట్లు తెలిపింది. ప్రత్యేకించి గిరిజన రైతులు ఎక్కువగా ప్రదర్శనకు తరలివచ్చారు. వర్గాలు కులాలు మతాలకు అతీతంగా అంతా ఒక్కటిగా సమస్యల సాధనకు కదిలారు. అటవీ భూములను తాము సాగుచేస్తున్నామని వాటిని తమకు బదలాయించాలని గిరిజన రైతులు డిమాండ్ చేస్తున్నారు. తరాలుగా అటవీ హక్కుల చట్టం పరిధిలోనే తాము వాటిని సాగు చేస్తున్నామని వీటిపై తమకు న్యాయం దక్కాలని వారు కోరుతున్నారు. రెండున్నర గంటల పాటు గిరిజన నేతలతో సుదీర్ఘ చర్చలు జరిగాయి. తరువాత డిమాండ్లను అంగీకరిస్తున్నట్లు ప్రభుత్వం రాతపూర్వకంగా తెలిపింది. దీనితో ఉద్యమ విరమణకు మార్గం ఏర్పడింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ నాయకత్వంలోని కేబినెట్ సబ్‌కమిటీ రైతుల ప్రతినిధులతో చర్చలు జరిపింది. ప్రదర్శనకు వచ్చిన రైతులను ప్రత్యేక రైళ్లలో వారి గమ్యస్థానాలకు చేరుస్తామని తెలిపింది. ఆరు నెలల వ్యవధిలో రైతులకు అటవీ భూముల కేటాయింపునకు అంగీకరించింది. రుణమాఫీలకు నిబంధనల సరళీకృతానికి ఆమోదం తెలిపింది. ఇనామ్, దేవస్థానం, గైరాన్ ఇతర భూముల లావాదేవీల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపింది. తమ ఆలోచనలను ప్రభుత్వం వినేలా చేయడంలో, వారు సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చేలా చేయడంలో విజయం సాధించామని కిసాన్ సభ కార్యదర్శి అజిత్ నవాలే తెలిపారు. పింఛన్ల పెంపుదల వంటి వాటిపై కూడా రాతపూర్వక హామీ వెలువడింది.

రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చేవరకు ఆందోళన



మన తెలంగాణ/న్యూఢిల్లీ: రిజర్వేషన్ల పెంపు అధికారాన్ని రాష్ట్రాలకు ఇచ్చే విషయంపై కేంద్రం స్పష్టత ఇచ్చేవరకు తమ ఆందోళను పార్లమెంటులో కొనసాగిస్తామని టిఆర్ఎస్ ఎంపిలు వెల్లడించారు. సోమవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే లోక్ సభలో స్పీకర్ వెల్‌లోకి దూసుకు వెళ్లి తమ నిరసన తెలియజేశారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను 12గంటలకు వాయిదా వేయగానే, పార్లమెంట్‌లోని గేట్ నంబర్ 4 వద్ద బైటాయించి తమ నిరసన తెలియజేశారు. 12గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగానే మరోసారి లోక్ సభలో గట్టిగా నినాదాలు ఇస్తూ తమ నిరసనను తెలియజేశారు. స్పీకర్ వారిని శాంతించి, తమ తమ సభా స్థానాలలోకి వెళ్లమని కోరినప్పటికీ, ఈ అంశంపై సుదీర్ఘమైన చర్చ జరిగేంతవరకు తాము ఈ ఆందోళనను విరమించేది లేదని టిఆర్ఎస్ ఎంపిలు స్పష్టం చేశారు. సభ మంగళవారానికి వాయిదా పడింది. అనంతరం టిఆర్ఎస్ ఎంపి కవిత మాట్లాడుతూ రిజర్వేషన్ల విషయంలో ఒకే దేశం, ఒకే నీతి ఉండాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ ఎంపీలు ఇన్ని రోజులు ఆందోళన చేస్తొన్న కేంద్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు పేరుతో, అధికార బిజెపి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని, సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా 29 ఏళ్లుగా తమిళనాడు లో ఏ విధంగా 69 శాతం రిజర్వేషన్లు కొనసాగుతున్నాయని కేంద్రప్రభుత్వాన్ని ఎంపి కవిత ప్రశ్నించారు. రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం తన దగ్గర పెట్టుకోవడం సరికాదని సూచించారు. ఇదే విషయంపై లోక్ సభలో టీఆర్ఎస్ పక్షనేత జితేందర్ రెడ్డి మాట్లాడుతూ న్యాయం ప్రకారమే మా పార్టీ ఎంపిలు పోరాటం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్ట్రం లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ల శాతం పెరిగిందని అన్నారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో మేం కోరు తున్న రిజర్వేషన్ల అంశాన్ని చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. తమిళనాడు, మహారాష్ట్ర తో సహా పలు రాష్ట్రాల్లో రిజర్వేషన్ల లో చాలా తేడాలున్నాయని తెలిపారు. తెలంగాణ మాదిరిగానే, ఏపి, హర్యానా, పంజాబ్ పలు రాష్ట్రాలు రిజర్వేషన్ల హక్కు రాష్ట్రానికే ఉండాలని కోరుతున్నాయన్నారు.

13 రోజుల జ్యుడిషియల్ కస్టడీ

తీహార్ జైలుకు కార్తి చిదంబరం



న్యూఢిల్లీ : ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో అరెస్టయిన కార్తి చిదంబరంను 13 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అనుమతిస్తూ ఢిల్లీ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, తనకు ప్రాణహాని ఉందని అందువల్ల తీహార్ జైలులో ప్రత్యేక సెల్‌ను కేటాయించాలని చేసుకున్న అతని అభ్యర్థనను తోసిపుచ్చింది. దీంతోపాటు తన తండ్రి మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం అనేక సున్నితమైన అంశాల్లో నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో తనకు ప్రాణహాని ఉన్నందున తాను బెయిల్ కోసం చేసుకున్న పిటిషన్‌ను సత్వరమే విచారించాలన్న మరో అభ్యర్థనను కూడా కోర్టు తిరస్కరించింది. మూడు రోజుల పోలీసు రిమాండ్ ముగియడంతో పోలీసులు సోమవారం కార్తి చిదంబరంను ప్రత్యేక జడ్జి సునీల్ రాణా ముందు హాజరు పర్చారు. అతనికి ఇక కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరం లేదని న్యాయమూర్తి తెలిపారు. 'ఇక మీదట సిబిఐ కోరుతున్నట్టుగా పోలీసు కస్టడీలో ఉండాల్సిన అవసరం లేదు. కార్తిని జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేస్తున్నాం. అతడిని మార్చి 24న కోర్టులో హాజరుపర్చాలి' అని ఆయన ఆదేశించారు. అతనికి ఎలాంటి ప్రత్యేక సెల్ కాని, ఇతర సౌకర్యాలు కాని ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అయితే, కస్టడీలో ఉన్నన్ని రోజులు ఆయనకు సరైన భద్రత, రక్షణ కల్పించాలని లాకప్ ఇన్‌చార్జి, జైలు సూపరింటెండెంట్‌లను న్యాయమూర్తి ఆదేశించారు.

మోడీ, మేక్రాన్ పడవ ప్రయాణం





వారణాసి : భారతీయ సుసంపన్న సంస్కృతికి ఆలవాలం అయిన పుణ్యక్షేత్రం కాశీలో ఫ్రాన్స్ అధ్యక్షులు ఎమ్మాన్యుయెల్ మేక్రాన్ పర్యటించారు. వారణాసికి ప్రాతినిధ్యం వహించే ప్రధానిమోడీతో కలిసి సోమవారం ఆయన పడవ షికారు చేశారు. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న మేక్రాన్ ఆదివారం ప్రేమ సంకేతం తాజ్‌మహల్ వద్ద భార్య బ్రిగిట్టేతో కొద్ది సేపు ఉన్నారు. ఆగ్రా నుంచి వారణాసికి చేరుకున్న ఫ్రాన్స్ అధినేతకు సాదర స్వాగతం లభించింది. ఓ వైపు పూల రెక్కలు చల్లుతూ, మరో వైపు షెహనాయి వాయిద్యం మోగిస్తూ ఉండగా , మంత్రోచ్ఛారణల నేపథ్యంలో పూర్తి స్థాయి ఆధ్యాత్మిక వాతావరణంలో మేక్రాన్ విచ్చేశారు. ఆ తరువాత అలంకృత బోటులో అస్సీ దశ్వమేథ్ ఘాటుల మధ్య విహారం చేశారు. ఆయన వెంట బోటులో ప్రధాని మోడీ, యుపి సిఎం యోగి ఆదిత్యానాథ్ ఆసీనులు అయి ఉన్నారు. మార్గ మధ్యంలో ఫ్రాన్స్ అధినేతకు ప్రధాని మోడీ ఘాటుల విశేషాలు తెలియచేశారు. ఘాటుల వెంబడి వందలాది మంది విద్యార్థులు భారత్, ఫ్రాన్స్‌ల పతాకాలను చేతబూని వారణాసికి వచ్చిన విశేష అతిధికి స్వాగతం పలికారు. కొన్ని చోట్ల సాంస్కృతిక కళాకారుల బృందాలు రామ్‌లీలాను ప్రదర్శించాయి. ఆర్యుల సంస్కృతితో మూలాలున్న ఫ్రాన్స్ నుంచి వచ్చిన అధినేతకు కళ్లకు కట్టేలా బుద్ధుడి జీవిత చరిత్రతో కూడిన ఘట్టాలను ప్రదర్శించారు. ఈ విధంగా గంగా ఒడ్డున పూర్తి స్థాయిలో సరికొత్త సాంస్కృతిక శోభ సంతరించుకుంది. అంతకు ముందు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ట్రేడ్ ఫెసియిలేషన్ సెంటర్‌కు చెందిన ఓపెన్ ఆడిటోరియం నుంచి మేక్రాన్, మోడీలు చేతులు పట్టుకుని నడుస్తూ ఉండగా అక్కడ కూడా కళాకారుల జాత జరిగింది. భారత, ఫ్రాన్స్ దేశాల నేతల గంగా షికారు బజ్రా బోటులో ఉత్సాహంగా 20 నిమిషాల పాటు సాగింది. తులసీ, ప్రభూ, చేతాసింగ్ ఇతర ఘాటుల ద్వారా ప్రయాణం జరిగింది.

బనారస్ చీరలు, భదోహీ తివాచీలతో మంత్రముగ్ధులు

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బనారస్ చీరల తయారీ గురించి ప్రత్యక్షంగా ఫ్రాన్స్ అధ్యక్షులు తెలుసుకున్నారు. అక్కడి చేనేత వస్త్రకారులు ఆయనకు చీరలు వడికే విధానం గురించి వివరించారు. తరువాత మోడీతో కలిసి వివిధ రకాల వస్త్రాలను చూశారు. ప్రత్యేకించి భదోహీ తివాచీలు ఆయనను ఆకట్టుకున్నాయి. ఈ ప్రాంతంలో ఈ తివాచీల తయారీ కీలక పరిశ్రమగా ఉంది. కాశీలో ప్రధాన పూజారి విశ్వంభర నాథ్ మిశ్రా ఆధ్వర్యంలో సాంప్రదాయక కళాకారులు రామ రాజ్యాభిషేకం ప్రదర్శన ఇచ్చారు.

2 జి కుంభకోణం దర్యాప్తును ఆరు నెలల్లో ముగించండి!

న్యూఢిల్లీ: 2జి కుంభకోణం కేసు ముగింపులో విపరీతమైన ఆలస్యం చేస్తున్నందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ(సిబిఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి)లను సుప్రీంకోర్టు సోమవారం మందలించింది. 'అదృశ్య హస్తాలేవైనా 2జి కుంభకోణం దర్యాప్తును అడ్డుకుంటున్నాయా?' అని సుప్రీంకోర్టు ఆ సంస్థలను ప్రశ్నించింది. ఒకవేళ 2జి కుంభకోణం దర్యాప్తులో ఎవరైనా జోక్యం చేసుకుంటున్నట్లయితే తెలపాలని కూడా ఆదేశించింది. 2జి కుంభకోణంకు సంబంధించిన అన్ని కేసుల్లో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా తుషార్ మెహతాను నియమించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన కోర్టు ధిక్కార పిటిషన్‌ను విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలిచ్చింది. ధిక్కార పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఇదిలా ఉండగా ఈ కేసులో దృష్టంతా మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరంపై మళ్లింది. ఎయిర్‌సెల్–మ్యాక్సిస్ ఒప్పందంకు సంబంధించి ఈ దృష్టి మళ్లింది. ఎయిర్‌సెల్–మ్యాక్సిస్ ఒప్పందంలో విదేశీ పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు(ఎఫ్ఐపిబి) అనుమతిలో ఆయన పాత్రపై నిఘా ఉంది. 2జి కేసులో మాజీ రాజా సహా నిందితులందరినీ ఢిల్లీ కోర్టు విముక్తులను చేసింది.



ఖలీదా జియాకు బెయిల్

ఢాకా : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, ప్రధాన ప్రతిపక్షం బిఎన్‌పి అధినేత ఖలీదా జియాకు కోర్టు తాత్కాలిక ఊరటను కల్పించింది. అవినీతి కేసులో ఐదేళ్ల జైలు శిక్షకు గురైన ఆమెకు నాలుగు నెలల బెయిల్‌ను మంజూరు చేసింది. జియా అనాథ ట్రస్ట్‌కు ఉద్దేశించిన 2.50 లక్షల డాలర్ల విదేశీ విరాళాలను ఆమె స్వాహా చేసినందుకు ఫిబ్రవరి 8న కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే ఢాకాలోని హైకోర్టు సోమవారం ఖలీదాకు నాలుగు నెలల తాత్కాలిక బెయిల్‌ను మంజూరు చేసింది. ఆమె వయస్సును పరిగణనలోకి తీసుకుని ఈ బెయిల్‌ను మంజూరు చేసినట్టు న్యాయమూర్తులు ఎం. ఇనాయతుర్ రహీం, షాహిదుల్ కరీంలతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఖలీదా జియాపై విధించిన 2.10 టాకాల(బంగ్లాదేశ్ కరెన్సీ) జరిమానాపై కూడా ధర్మాసనం స్టే విధించింది. జాతీయ ఎన్నికల నుంచి ఖలేదా జియాను దూరంగా ఉంచడానికే ఆమెపై రాజకీయ దురుద్దేశంతో కేసును బనాయించారని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బిఎన్‌పి) ఆరోపించింది. కాగా కేసు విషయంలో ప్రభుత్వ జోక్యం ఏమి లేదని నేటి కోర్టు ఉత్తర్వు రుజువు చేసిందని బంగ్లాదేశ్ న్యాయ శాఖ మంత్రి అనీసుల్ హఖ్ విలేకరులతో అన్నారు. ఖలీదా జియాపై ఉన్న డజన్లకొద్దీ కేసులో ఈ అవినీతి కేసు ఒకటి.

భాషా పండితుల కోర్సులకు ప్రాధాన్యత

మన తెలంగాణ/ హైదరాబాద్: భాషా పండితుల కోర్సులు చేసే వారికి ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, లేకపోతే అందరూ వృత్తి విద్యాకోర్సుల పట్ల మొగ్గు చూపితే భాషా శాస్త్రాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది.ఆంధ్రవిశ్వవిద్యాలయం, వెంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో తెలుగు, ఉర్దూ, అరబిక్, సంస్కృతం ఇతర భాషా శాస్త్రాల అధ్యాపకుల్నిలా, హిందీ బోధనలకు బదిలీ చేయడాన్ని సయ్యద్ రహ్మతుల్లా, ఇతరులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. భాషా శాస్త్రాల్లో విద్యా సంవత్సరాల వారీగా ఎంతమంది చొప్పున విద్యార్థులు చేరారో, మంజూరైన పోస్టుల వివరాలు అందజేయాలని బెంచ్ ఆ రెండు వర్సిటీలను ఆదేశించింది. చదివినది ఒకటి బదిలీ చేసినది మరొక శాఖ వంటి వివరాలు కూడా ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

పాకిస్థాన్‌లో తొలి హిందూ దళిత సెనేటర్ ప్రమాణస్వీకారం



ఇస్లామాబాద్: పాకిస్థాన్ చట్టసభలో సెనేటర్‌గా ఎన్నికైన తొలి హిందూ దళిత మహిళ కృష్ణ కుమారి కొల్హీ సోమవారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. పాకిస్థాన్ ఎగువ సభ లో పదవీ ప్రమాణస్వీకారం చేసిన మొత్తం 51 మంది సెనేటర్లలో ఆమెకూడా ఒకరు. సింధ్ ప్రాంతానికి చెందిన థర్ జిల్లాలోని సు దూర నాగర్‌పర్కర్ గ్రా మానికి చెందిన మహిళ ఆమె. బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ(పిపిపి)తరఫున ఆమె సింధ్ మైనారిటీ సీటు నుంచి ఎగువసభకు ఎన్నికయ్యారు. సమాఖ్య, ప్రాంతీయ అసెంబ్లీలు మార్చి 3న ఎన్నుకున్న సెనేటర్లతో ప్రిసైడింగ్ అధికారి సర్దార్ యాకూబ్ ఖాన్ నాసర్ ప్రమాణ స్వీకారం చేయించారు. పనామా పేపర్ల కుంభకోణంలో నిందితుడుగా ఉన్న మాజీ ఆర్థిక మంత్రి ఇషాఖ్ దర్ ప్రమాణస్వీకారానికి హాజరు కాలేదు. ఆయన అనారోగ్యం కారణంగా లండన్‌లోనే ఉండిపోయారు.

అటవీ సందర్శకులపై ఆంక్షలు

మన తెలంగాణ / హైదరాబాద్ : వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఆటవీ ప్రాంతాల్లో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా అవసరమైన మేరకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆటవీశాఖ నిర్ణయించింది.ఇందుకోసం జిల్లాల్లోని ఆటవీ అధికారులంతా అప్రమత్తంగా ఉండడంతో పాటు అగ్ని ప్రమాదం జరగడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రికరించాలని సూచించింది. తమిళనాడులోని తేని డివిజన్‌లోని అడవిలో జరిగిన భారీ అగ్ని ప్రమాదానికి పలువురు ప్రాణాలను కోల్పోయిన నేపథ్యంలో రాష్ట్ర ఆటవీశాఖ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సూచలనలతో పాటు హెచ్చరికలను జారీ చేసింది. వీటిని అమలు చేసేందుకు ఆటవీశాఖ అధికారులు, తగిన సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఆటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలకు ఆస్కారమున్న ప్రాంతాల్లో సందర్శకులను, పర్యాటకులను అనుమతించరాదని, అనధికార సందర్శనలను పూర్తిగా నిషేధించాలని అటవీశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆటవీ ప్రాంతాల్లో లోపలికి వెళ్లే, బయటకు వచ్చే మార్గాల్లో ప్రత్యేక తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సందర్శకుల వద్ద అగ్గిపెట్టెలు, అగ్గి పుల్లలతో పాటు బీడీలు, సిగరెట్లు, లైటర్లు తదితర వస్తువులు లేకుండా చూడాలన్నారు. జిల్లాల్లో సున్నితమైన, అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే ప్రాంతాలను ఆటవీ అధికారులు గుర్తించిన తర్వాత ఆయా ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా విపత్తు నిర్వహణ కింద చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు, గ్రీన్ బ్రిగేడ్ సభ్యులు, హరిత రక్షిత సభ్యులు భాగస్వాములుగా ఉండాలన్నారు. ఇప్పటికే అగ్ని ప్రమాద ప్రాంతాలను గుర్తించిన అధికారులు కొత్తవాటిని సైతం గుర్తించాలన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా మంటలను అదుపు చేయడానికి వినియోగించే బ్లోయర్లను అదనంగా సమకూర్చుకోవాలన్నారు. బేస్ క్యాంపు, స్ట్రైక్ ఫోర్స్ సభ్యులను అవసరాలకు అనుగుణంగా అగ్నిప్రమాద ప్రాంతాల్లో మోహరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. బీడీ ఆకులు కోసేవారితో పాటు కాంట్రాక్టర్లు, వారి ఏజెంట్లు, పశువుల కాపరులు, పశువుల యాజమానులు, ఎన్టీఎఫ్‌సి కలెక్టర్లు ఒకవేళ అగ్నిప్రమాదం జరిగితే చిక్కుకుపోకుండా దూరంగా ఉండాలన్నారు.

శాస్త్రవేత్తల అభిప్రాయాలు కోరిన రాష్ట్ర ప్రభుత్వం

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ధాన్యం, పప్పులు, వేరుశనగ ఉత్పత్తులకు సంబంధించి ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపన, జిల్లాల వారీగా అవసరాలపై శాస్త్రవేత్తలు అభిప్రాయాలను తెలపాలని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారధి కోరారు. ఆహార శుద్ధి పరిశ్రమలు ఎగుమతులకు అవసరమైన ఉత్పత్తుల పెంపుదలపై శాస్త్రవేత్తలు దృష్టిసారించాలన్నారు. సచివాలయంలో ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుపై శాస్త్రవేత్తలతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎండుమిర్చి,పసుపు పంటల ఉత్పత్తులను సమీక్షించి వాటికి తగిన కోల్డ్ స్టోరేజ్‌ల అవసరాన్ని అంచనా వేసినట్లు చెప్పారు.

పట్టుపురుగుల అథారిటీ పునరుద్ధరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : పట్టుపురుగుల పెంపక అభివృద్ధి నిధి అథారిటీని ప్రభుత్వం పునరుద్ధరించింది.ఈ మేరకు వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారధి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెరికల్చర్ డైరెక్టర్ ఛైర్మన్‌గా ఇతర అధికారులు సభ్యులుగా ఈ అథారిటీ పనిచేయనుంది. అధికారులు కాకుండా మరో ఇద్దరిని కూడాఈ అథారిటీలో సభ్యులుగా నియమించారు.అలాగేస్పైస్ ప్రాసెసింగ్ యూ నిట్ నెలకొల్పేందుకు జాతీయ ఆహార సాంకేతిక పరిశోధన సంస్థ నివే దించిన డిపిఆర్‌కు అనుమతిని ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కొల్లాపూర్ ఎక్స్‌ప్రెస్ మణుగూరు వరకు పొడిగింపు

మన తెలంగాణ / హైదరాబాద్ : కొల్లాపూర్ – హైదరాబాద్ – కొల్లాపూర్ ఎక్స్‌ప్రెస్ (నెం.11304) ను ఈ నెల 14 నుంచి మణుగూరు వరకు పొడిగించాలని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) నిర్ణయించింది. ఈ రైలు ఈ నెల 14న కొల్లాపూర్‌లో ఉదయం 7:35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1:30గంటలకు మణుగూరుకు చేరుకుంటుంది. మార్గమధ్యలో కేసముద్రంలో ఈ రైలు ఆగుతుందని ఎస్‌సిఆర్ సిపిఆర్‌ఓ ఎం.ఉమాశంకర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదిలా ఉండగా ప్రయాణికుల అదనపు రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్ – నర్సాపూర్ – సికింద్రాబాద్ (నెం.07256 /07255) మధ్య, హైదరాబాద్ – కాకినాడ టౌన్ – హైదరాబాద్ (నెం.07075 / 07076) మధ్య ఈ నెల 16, తిరుగు ప్రయాణంలో ఈ నెల 18న ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సిపిఆర్‌ఓ మరొక ప్రకటనలో తెలిపారు.

భరించలేకే హెడ్‌ఫోన్ విసిరారు

- అప్పుడే నా కంటికి తగిలింది
- నొప్పి ఉన్నా భరిస్తూనే గవర్నర్‌ను సాగనంపా
- దాడి క్రమాన్ని వివరించిన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్





మన తెలంగాణ/ హైదరాబాద్ : గవర్నర్ ప్రసంగం ముగిసాక జాతీయ గీతం జనగణ మన పాడేందుకు లేచిన సమయంలో హెడ్ ఫోన్ వచ్చి తన కంటికి తగిలిందని శాసనమండలి ఛైర్మన్ కె.స్వామిగౌడ్ తెలిపారు. సరోజిని ఆసుపత్రి వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ఘటనాక్రమాన్ని వివరించారు. అసెంబ్లీలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం ప్రారంభించినప్పటి నుండి ప్రతిపక్షాలు కాగితాలు విసురుతూనే ఉన్నారని చెప్పారు. అయితే కాగితాలు గవర్నర్ ఉన్నంత దూరం వరకు రాకపోవడంతో పది నిమిషాల తరువాత హెడ్ ఫోన్స్ విరగ్గొట్టి మొదటిసారి విసిరారని చెప్పారు. అది కూడా గవర్నర్ దగ్గరకు వచ్చి పడిందని, అప్పుడు ఎవరికి తగలలేదన్నారు. అయినప్పటికీ గవర్నర్ ఆగగకుండా ప్రసంగాన్ని కొనసాగించడంతో భరించలేని ప్రతిపక్ష సభ్యులు చివర్లో జనగణమన కోసం అందరూ లేచి నిల్చున్న సమయంలో మరో హెడ్‌ఫోన్ విసిరారన్నారు. అప్పుడు భరించలేని నొప్పి ఉన్నప్పటికీ భరిస్తూనే గవర్నర్‌ను సాగనంపానని, అనంతరం డాక్టర్‌లకు చూపించాక వారి సూచన మేరకు ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. కంటికి స్కానింగ్ చేసిన డాక్టర్‌లు 24 గంటలు 'అబ్జర్వేషన్'లో ఉండాలని చెప్పడంతో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యానని, మంగళవారం మరో పరీక్ష నిర్వహించిన తరువాత గాయం తీవ్రతపై పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

సభాధ్యక్షత వహించనున్న డిప్యూటీ ఛైర్మన్

శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ కంటికి గాయం కావడంతో ఆసుపత్రిలో చేరినందున మంగళవారంజరిగే మండలి సమావేశాలకు డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్‌రావు నిర్వహించనున్నారు. ఇంతకాలం జూబ్లిహాల్‌లో శాసనమండలి సమావేశాలు జరగ్గా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాడుకున్న శాసన మండలి భవనాన్ని తెలంగాణకు అప్పగించడంతో మండలి భవనంలోనే జరగనున్నాయి.ముఖ్యమంత్రి కెసిఆర్ సైతం మంగళవారం మండలిలో జరిగే సమావేశాలకు హాజరుకానున్నారు. ఇప్పటికే ఆయన ఛాంబర్‌ను శాసనసభ సిబ్బంది తీర్చిదిద్దారు.

భౌతిక దాడి సంప్రదాయం కాదు : 'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ప్రశ్నించే హక్కు ఉంది. విపక్ష సభ్యులకు ప్రజా సమస్యలను సభలో లేవనెత్తయే హక్కూ ఉంది. వాటికి తగిన పరిష్కారాలను ప్రభుత్వం నుంచి డిమాండ్ చేసే హక్కూ ఉంది. కానీ భౌతికంగా దాడికి దిగడం మాత్రం ప్రజాస్వామ్య సంప్రదాయం కా దు.రాజ్యాంగ పదవులపై ఇలావ్యవహరించడం సరైంది కాదు'అని తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ వ్యాఖ్యానించారు.

స్పీకర్, షబ్బీర్ అలీ పరామర్శ : ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలి ఛైర్మన్ స్వామి గౌడ్‌ను శాసనసభ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి పరామర్శించారు.ఆయన త్వరగాకోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే శాసన మండలి ప్రతిపక్ష నాయకులు షబ్బీర్ అలీ, సిఎల్‌పి ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి కూడా పరామర్శించారు. ఇంకా పలువురు మంత్రులు,ఎం ఎల్ ఏలు, ఎంఎల్‌సిలు, ప్రజాప్రతినిధులు ఆసు పత్రికి వెళ్ళిన వారిలో ఉన్నారు.

నా కాళ్లకూ దెబ్బలు తాకాయి

స్వామిగౌడ్‌పై ఏమీ విసరలేదు : కోమటిరెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ : అసెంబ్లీలో సోమవారం పోలీసులను తమ మీదికి ఎగదోసిన సమయంలో తన కాళ్లకూ దెబ్బలు తాకాయని కాంగ్రెస్ ఎంఎల్‌ఏ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌పై తాను ఉద్దేశ పూర్వకంగా ఏమీ విసరలేదని, గవర్నర్ ప్రసంగం అర్థరహితంగా సాగడంతో నిరసన తెలిపామని చెప్పారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో కోమటిరెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఇలాంటి ఘటన తాను ఎప్పుడూ చూడలేదన్నారు. రైతుల సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు ప్రస్తావన లేకపోవడంతో పోడియం వద్దకు పోయి నిరసన తెలిపేందుకు వెళ్తుంటే 50–60 మంది పోలీసులు అడ్డుకున్నారని అన్నారు. వారు తోయడంతో తనకు, సహచర ఎంఎల్‌ఏలు టి.రామ్మోహన్‌రెడ్డికి గాయాలయ్యాయని చెప్పారు. రాష్ట్రంలో రైతులకు మద్దతు ధర ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని కోమటిరెడ్డి విమర్శించారు. రూ.20 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు రైతులకు కేటాయించలేవా? నీ అయ్య సొమ్ము ఏమన్నా పోయిందా? అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడిని ఇటీవల సిఎం ప్రశ్నించారని గుర్తు చేశారు. అదే రకంగాతాము కూడా కెసిఆర్‌ను ప్రశ్నిస్తునున్నట్లు చె ప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఇప్పటి వరకు 5 లక్షల కోట్లు పెట్టారని వరి, మొక్కజొన్న,పసుపు పంటలకు మద్దతు ధర పెంచితే కెసిఆర్ సొమ్ము ఏమన్నా పోతుందా అని ప్రశ్నించారు.

ప్రజలు కెసిఆర్‌ను సస్పెండ్ చేయబోతున్నారు

కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేస్తున్నారా అని మీడియా ప్రశ్నించగా 'మరో ఆరేడు నెలల్లో ప్రజలు, నిరుద్యోగులు, రైతులు..సిఎం కెసిఆర్‌ని సస్పెండ్ చేయబోతు న్నారన్నారు. హత్యా రాజకీయాలతో, ఓట్ల రాజకీయాలతో గెలవాలని చూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో టీఆర్‌ఎస్ కు 106 సీట్లు కాదని, ఆరు సీట్ల కంటే ఎక్కువ వచ్చే పరిస్థితి లేదన్నారు.

వ్యక్తిత్వాలపై దాడులు ఆపాలి

మహిళా సంఘాల డిమాండ్



మన తెలంగాణ / హైదరాబాద్ : వ్యక్తిగత విషయాలను వార్తలుగా ప్రసారం చేసి వారిని బహిరంగ అవమానానికి గురిచేసే ధోరణులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని మహిళా సంఘాలు పేర్కొన్నాయి. ఇలాంటి ప్రసారాలు ప్రైవసీ హక్కుకు భంగకరమని మహిళా సంఘాల ప్రతినిధులు అన్నారు. జీవించే హక్కులో ప్రైవసీ భాగమని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహిళా సంఘాల ప్రతినిధులు కె.లలిత, మధుమిత సిన్హా, వి. సంధ్య, ఎం.లక్ష్మి, శాలిని మహాదేవ్ తదితరులు సోమవారం మీడియాతో మాట్లాడుతూ, ఓ బాధితురాలి బెడ్‌రూం, బాత్‌రూం దృశ్యాలను, ఆమె భర్త, బంధువులు ఆమెని తిడుతూ బెదిరిస్తున్న దిగ్భ్రాంతి కలిగించే వీడియోలను ఓ ఛానెల్ పదేపదే చూపించిందని, దాదా పు అన్ని ఛానెళ్ళూ ఈ వార్తను 'బ్రేకింగ్ న్యూస్'గా ప్రసారం చేశాయని అన్నారు. కేవలం భర్త ఆరోపణలపై ఆధారపడి బాధితురాలికి వివాహేతర సంబంధాన్ని అంటగట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. అర్థరాత్రి ఒక మహిళ ఇంట్లోకి అనుమతి లేకుండా ప్రవేశించడం, వీడియోలు తీయడం ఆమె వ్యక్తిగత ప్రైవసీని ఉల్లంఘించడమేనని అన్నారు. ఈ దృశ్యాలను అన్ని ఛానళ్ళూ వెబ్‌సైట్ల నుండి వెంటనే తీసేయాలని డిమాం డ్ చేశారు. బాధ్యతాయుతంగా, నీతిగా రిపోర్టింగ్ చేయడానికి నేషనల్ బ్రాడ్‌కాస్టింగ్ స్టాండర్డ్స్ అథారిటి రూపొందించిన నియమావళిని అమలు పరుచాలని, ప్రతి తెలుగు ఛానెల్ ఒక అంతర్గత కమిటీని నియమించుకోవాలని, ఆ కమిటి సభ్యుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని మహిళా సంఘా లు డిమా ండ్ చేశాయి. గ్రంథాలయాల నుండి హాస్టళ్ళ కు రాత్రి సమయాల్లో తిరిగి వెళ్తున్న విద్యార్థినులను చూపిస్తూ చెడు పనులకి, అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని టీవీ ఛానెళ్ళు వ్యాఖ్యానాలు చేయడంపై మహిళా సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యంతో కూడుకున్న ప్రసారాల వల్ల విద్యార్థినులకు, ట్రాన్స్‌జెండర్లకి, సమాజంలో అధికారం, డబ్బులేని అనేక మందికి జరిగే హాని అపారమని ఆందోళన వ్యక్తం చేశారు. పోయిన పరువు ప్రతిష్టలను ఛానెళ్ళు తిరిగి ఇస్తాయా అని ప్రశ్నించారు. టిఆర్‌పి రేటింగ్‌ల కోసం బాధ్యత మరిచి చేసే ప్రసారాలతో చేయడాన్ని ఇప్పటికైనా ఛానెళ్లు మానాలని కోరారు.

శ్రీనగర్ జైలులో ఎన్ఐఎ ఆపరేషన్

శ్రీనగర్ : జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సోమవారం అసాధారణ రీతిలో శ్రీనగర్ సెంట్రల్ జైలులో సోదాలు నిర్వహించింది. ఈ క్రమంలో పాకిస్థాన్ జెండాను, రెండు డజన్లకు పైగా సెల్‌ఫోన్లను, జిహాదీ సాహిత్యాన్ని స్వాధీనపర్చుకుందని, సమాచారం నిక్షిప్తంఅయి ఉన్న హార్డ్‌వేర్‌ను కూడా సీజ్ చేసిందని సంస్థ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. జైలులక్ష భారీ స్థాయిలో అక్రమాలకు సంబంధించిఅందిన సమాచారంతో ఉన్నట్లుండి ఉన్నత స్థాయి నియా బృందం జైలుపై దాడికి దిగింది. ముందుగా జైలు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిందీ లేనిదీ వెల్లడికాలేదు. ఏకంగా 20 ఎన్ఐఎ దళాలు స్థానిక పోలీసులు, అదనంగా సిఆర్‌పిఎఫ్, ఎన్ఎస్‌బి బలగాలతో మెరుపుదాడి స్థాయిలో జైలులోకి దూసుకువెళ్లాయి. వెళ్లుతూనే జైలులో పలు చోట్ల సోదాలు నిర్వహించారు. స్థానిక మెజిస్ట్రేట్‌లు, సాక్ష్యులు, కొందరు డాక్టర్లు వెంట రాగా ఎన్ఐఎ సాగించిన ఆపరేషన్ సంచలనం కల్గించింది. జైలులో పాతికవరకూ సెల్‌ఫోన్లు,పలు సిమ్‌కార్డులు, ఐదు ఎస్‌డి కార్డులు, పెన్‌డ్రైవ్‌లు కనుగొన్నారు. వీటిని దర్యాప్తు సంస్థ స్వాధీనపర్చుకుంది. హిజ్బుల్ ముజాహిద్దీన్‌కు చెందిన పోస్టరు, పాకిస్థానీ జెండా ఒకటి కూడా వాటిలో ఉంది.

ఎడ్‌సెట్ షెడ్యూల్ విడుదల

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ ఎడ్‌సెట్ షెడ్యూల్‌ను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఈ నెల 5వ తేదీన సిలబస్ కమిటీ సమావేశం జరగ్గా, ఎడ్‌సెట్ కమిటీ తొలి సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి చివరకు షెడ్యూల్‌ను ఎడ్‌సెట్ కమిటీ ఖరారు చేసింది. ఆన్‌లైన్‌లో సమర్పించాల్సిన దరఖాస్తులకు మంగళవారం తుదిరూపు ఇవ్వనుంది. ఈ నెల 15వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 20వ తేదీ వరకు సమర్పించవచ్చునని, దరఖాస్తుల్లో మార్పుల చేర్పులు సవరణలను మే 5వ తేదీ వరకు చేసుకోవచ్చని తెలిపారు. సాధారణ అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ఫీజును 650 రూపాయలుగా నిర్ధారించిన కమిటీ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మాత్రం రూ. 450లుగా ఖరారు చేసింది. రూ. 500 అపరాధ రుసుముతో ఏప్రిల్ 30వ తేదీ వరకు, 2వేల రూపాయల ఫైన్‌తో మే 15వ తేదీ వరకు, 5వేల రూపాయల అపరాధ రుసుంతో మే 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.మే 20వ తేదీ వరకు హాల్‌టిక్కెట్లు అందుబాటులోకి వస్తాయని, 21 నుంచి 26వ తేదీ వరకు అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. htpp://edcet.tsche.ac.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. మే 31, జూన్ 1వ తేదీన పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని, ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక పరీక్ష, మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు మరో పరీక్ష ఉంటుందని తెలిపారు. జూన్ 3వ తేదీన ప్రాథమిక కీ విడుదల చేసి 5వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. చివరగా పరీక్ష ఫలితాలు, ర్యాంకులను జూన్ 11వ తేదీన విడుదల చేయనున్నట్లు అధికారులు వివరించారు.

లాసెట్ , పిజిఎల్‌సిఇటి షెడ్యూల్ విడుదల

రాష్ట్రంలో న్యాయవిద్య కోర్సుల్లో ప్రవేశానికి షెడ్యూల్ విడుద లయింది. ఈనెల 22న టిఎస్‌లాసెట్, పిజి లా సెట్ నోటిఫికేషన్‌లు విడుదల కానున్నాయి. ఈ నెల 25నుంచి రూ. 800 రిజిస్ట్రేషన్ ఫీజుతో దరఖాస్తు ఫారాలు అందుబాటులోకి రానున్నాయి. ఎస్సీ,ఎస్టీలకు రూ. 500 రిజిస్ట్రేషన్ ఫీజుగా నిర్ణయమైంది. ఏప్రిల్ 25లోగా రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. 500రూపాయల అపరాధ రుసుముతో మే 2 వరకు, 1000రూపాయల అపరాధ రుసుముతో మే 9 వరకు, రూ. 2000అపరాధ రుసుముతో మే 16 వరకు, రూ. 4000 రూపాయల అపరాధ రుసుముతో మే 23 వరకు దరఖాస్తులను సమర్పించవచ్చని స్పష్టం చేసింది. మే 17 నుంచి 20 వరకు దరఖాస్తు ఫారాల పరిశీలన జరుగుతుందని, మే 22 నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొనింది. మే 25న ఉదయం 11 గంటల నుంచి మద్యాహ్నం 12గంటల వరకు ఆన్‌లైన్ పద్ధతిలో ప్రవేశ పరీక్షలు జరుగుతాయని పేర్కొనింది. మే 28న ప్రాథమిక కీ విడుదలవుతుందని, మే 29 వరకు అభ్యంతరాలను స్వీకరణ ఉంటుందని స్పష్టం చేసింది. పరీక్షల ఫలితాలను, ర్యాంకులను జూన్ 10న ప్రకటించనున్నట్లు తెలియజేసింది.

గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణకు ఆధునిక పరిజ్ఞానం

పాథాలజిస్టు డాక్టర్ కె.సుశీల

మన తెలంగాణ / హైదరాబాద్: గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణకు ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని బసవ తారకం ఇండో అమెరికన్ ఆసుప్రతి అధ్యయన కేంద్రం ఎథిక్స్, అధ్యయన కమిటి సభ్య కార్యదర్శి, సీనియర్ పాథాలజిస్ట్ డాక్టర్ కె.సుశీల తెలిపారు. ప్రముఖ అంతర్జాతీయ వైద్య సంస్థలైన బిడి లైఫ్ సైన్సెస్, బెర్టాన్, డికిన్సన్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో కొత్త ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ సుశీల మాట్లాడుతూ ద్రవ రూపంలో ఉండే లికిండ్ బేస్డ్ సైటాలజీ (ఎల్‌బిసి) పరీక్ష ద్వారా గర్భాశయ క్యాన్సర్ పూర్వ గాయాలు, వైవిధ్య కణాలతో పాటు ఇతర సైటోలాజికల్ కేటగిరీలకు చెందిన వాటిని తేలికగా నిర్ధారించవచ్చన్నారు. ఒకేసారి పరీక్షలు నిర్వహించడమే కాకుండా దానికి అనుబంధంగా ఉండే పరీక్షలను చేయాల్సిన అవసరం కూడా లేదని ఆమె వివరించారు. ప్రారంభ దశలోనే అసాధారణ కణాల మార్పులను గుర్తించే సామర్థం ఇందులో ఉందన్నారు. మహిళలకు సాధారణ పరీక్షలలో గర్భాశయ క్యాన్సర్ కూడా భాగమైందన్నారు. ఈ నేపథ్యంలో ఆధునిక విధానం వల్ల మేలు జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 'పాప్ స్మియర్' పరీక్ష కొనసాగుతోందని, అసాధారణ పరిస్థితులను గుర్తించే సామర్థ్యమున్న దీనికి కొన్ని పరిమితులున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో మరింత మెరుగైన సాంకేతికవైపు అడుగులు వేయాల్సిన అవశ్యకత ఏర్పడిందని వివరించారు. ఈ సందర్భంగా బిడి ఇండియా ఎండి పవన్ మాచర్ల మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ ప్రాణాంతంగా మారేందుకు గత కారణాలతో పాటు దాని పూర్వాపరాలను గుర్తించడం అనివార్యమైందన్నారు. మాంఛెస్టర్ సైటాలాజీ సెంటర్ మాజీ నిర్దేశకురాలు డాక్టర్ మీనాక్షి దేశాయ్ మాట్లాడుతూ దేశంలోని మహిళల్లో అత్యంత తరచుగా వచ్చే క్యాన్సర్‌గా గర్భాశయ క్యాన్సర్ రెండవ స్థానంలో ఉందన్నారు. దేశంలో కాన్సర్ పట్ల అవగాహన పెద్దగా లేదని, చికిత్స వ్యయం కూడా చాలా ఎక్కువగా ఉండడంతో అందరూ అందుకోలేని పరిస్థితి ఉందన్నారు. తొలి దశలోనే స్క్రీనింగ్ చేసి సకాలంలో వ్యాధిని గుర్తిస్తే ప్రాణాంతకం నుంచి తప్పించుకోవచ్చని వివరించారు.

ఐర్లాండ్ రికార్డు విజయం



హరారే: గ్రూప్–ఎలో భాగంగా యూఎఇతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్ 226 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 313 పరుగులు చేసింది. ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ అద్భుత సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. చెలరేగి ఆడిన స్టిర్లింగ్ 15 ఫోర్లు, ఐదు సిక్సర్లతో 126 పరుగులు చేశాడు. కెప్టెన్ విలియమ్ పోర్టర్ ఫీల్డ్ పది ఫోర్లు, రెండు సిక్స్‌లతో 92 పరుగులు చేశాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 205 పరుగులు జోడించారు. కెవిన్ ఓబ్రి యాన్ 50 పరుగులు చేసి తనవంతు పాత్ర పోషించాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన యూఎఇ 91 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని చవిచూసింది. రాంకిన్ నాలుగు, సిమి సింగ్ మూడు, మెక్ కార్టి రెండు వికెట్లు తీసి యూఎఇ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. మరో మ్యాచ్‌లో విండీస్ డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం 54 పరుగులతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. ఈ ఓటమితో నెదర్లాండ్స్ ప్రపంచకప్ అర్హత పోటీల నుంచి నిష్క్రమించింది. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌కు ఓటమి తప్పలేదు. ముందుగా బ్యాటింగ్ చేసిన విండీస్ 309 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 28.4 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 167 పరుగులు మాత్రమే చేసి పరాజయం పాలైంది.

భారత మహిళల ఓటమి

బోల్టన్ అజేయ శతకం, ఆసీస్ జయభేరి



వడోదర: ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో భారత మహిళా క్రికెట్ జట్టు ఓటమి పాలైంది. సోమవారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా 8వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో సిరీస్‌లో 1–0 ఆధిక్యాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 200 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియా 32.1 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్ నికొలె బోల్టన్ అజేయ శతకంతో జట్టుకు ఘన విజయం సాధించి పెట్టింది. సునాయాస లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియాకు ఓపెనర్లు బోల్టన్, అలీసా హిలీ శుభారంభం అందించారు. ఇద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు తీసుకెళ్లారు. అలీసా దూకుడుగా ఆడుతూ స్కోరును పరిగెత్తించింది. చెలరేగి ఆడిన అలీసా 29 బంతుల్లోనే ఆరు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 38 పరుగులు చేసి ఔటైంది. తర్వాత వచ్చిన కెప్టెన్ మెక్ లానింగ్ అండతో బోల్టన్ జోరును కొనసాగించింది. ఇద్దరు సమన్వయంతో ఆడుతూ జట్టును లక్ష్యం వైపు నడిపించారు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన లానింగ్ ఐదు ఫోర్లతో 33 పరుగులు సాధించింది. మరోవైపు ఎలిసె పెరీ 25 (నాటౌట్) తో కలిసి బోల్టన్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేసింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన బోల్టన్ 101 బంతుల్లో 12 ఫోర్లతో 100 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. దీంతో ఆస్ట్రేలియా మరో 17.5 ఓవర్లు మిగిలివుండగానే లక్ష్యాన్ని అందుకుంది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌ను ఆస్ట్రేలియా బౌలర్లు తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. అమంద వెల్లింగ్టన్, జెస్ జొనాసెన్‌లు అద్భుత బౌలింగ్‌తో భారత ఇన్నింగ్స్ కుప్పకూల్చారు. అమందకు మూడు, జొనాసెన్ నాలుగు వికెట్లు దక్కాయి. భారత జట్టులో ఓపెనర్ పూనమ్ రౌత్ (37), వికెట్ కీపర్ సుష్మా వర్మ (41) రాణించారు. పూజా వస్త్రాకర్ ఏడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 51 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. మిగతావారు విఫలంతో భారత్ భారీ స్కోరును సాధించలేక పోయింది.



ప్రతీకార విజయం

చెలరేగిన ఠాకూర్, సుందర్, రాణించిన కార్తీక్, పాండే
లంకపై టీమిండియా గెలుపు



కొలంబో: నిదహాస్ ముక్కోణపు టోర్నమెంట్‌లో టీమిండియా వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఆతిథ్య శ్రీలంకను చిత్తు చేసింది. ఈ గెలుపుతో తొలి మ్యాచ్‌లో లంక చేతిలో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. వర్షం వల్ల మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగుల చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ మరో 9 బంతులు మిగిలి ఉండగానే కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ప్రారంభంలోనే షాక్ తగిలింది. పేలవమైన ఫాంతో సతమతమవుతున్న కెప్టెన్ రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లోనూ నిరాశ పరిచాడు. ఒక ఫోర్, మరో సిక్స్‌తో 11 పరుగులు చేసిన రోహిత్‌ను ధనంజయ వెనక్కి పంపాడు. ఆ వెంటనే మరో ఓపెనర్ శిఖర్ ధావన్ కూడా వెనుదిగిరాడు. సిరీస్‌లో అద్భుతంగా రాణిస్తున్న ధావన్ ఈసారి విఫలమయ్యాడు. కేవలం 8 పరుగులు మాత్రమే చేసి ధనంజయ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. ఈ దశంలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను లోకేష్ రాహుల్, సురేశ్ రైనా తమపై వేసుకున్నారు. ఇద్దరు లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు తీసుకెళ్లారు. అయితే ధాటిగా ఆడుతున్న రైనా (27; 15 బంతుల్లో 2x4, 2x6)ను ప్రదీప్ వెనక్కి పంపాడు. ఆ వెంటనే రాహుల్ (18) కూటా ఔటయ్యాడు. కానీ తర్వాత వచ్చిన దినేష్ కార్తీక్‌తో కలిసి మనీష్ పాండే మరో వికెట్ కోల్పోకుండానే భారత్‌ను గెలిపించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన పాండే మూడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 42 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కార్తీక్ ఐదు ఫోర్లతో వేగంగా 39 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. దీంతో భారత్ ఘన విజయం అందుకుంది. అంతకుముందు లంకను భారత బౌలర్లు అనుకున్న స్కోరుకంటే తక్కువ పరుగులకే కట్టడి చేయడంలో సఫలమయ్యారు. ఒక దశలో 10 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 90 పరుగులతో పటిష్టస్థితిలో కనిపించిన లంకను భారత బౌలర్లు తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. శార్దూల్ ఠాకూర్ అద్భుత బౌలింగ్‌తో లంక బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చాడు. అసాధారణ రీతిలో చెలరేగిన ఠాకూర్ 4 ఓవర్లలో 27 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. వాషింగ్టన్ సుందర్ కూడా అద్భుత బౌలింగ్‌ను కనబరిచాడు. 4 ఓవర్లలో 21 పరుగులకే రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును తక్కువ స్కోరుకు కట్టడి చేశారు. లంక జట్టులో ఓపెనర్ కుశాల్ మెండిస మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో వేగంగా 55 పరుగులు చేశాడు.

యూకి బాంబ్రీ సంచలనం

- **12వ సీడ్ లుకాస్‌కు షాక్, పరిబాస్ ఓపెన్**


కాలిఫోర్నియా: ఇక్కడ జరుగుతున్న బిఎన్‌పి పరిబాస్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత స్టార్ యూకి బాంబ్రీ పెను సంచలనం సృష్టించాడు. రెండో రౌండ్‌లో బాంబ్రీ 6–4, 6–4 తేడాతో ఫ్రాన్స్‌కు చెందిన ప్రపంచ 12వ ర్యాంక్ ఆటగాడు లుకాస్ పాయిలేపై సంచలన విజయం సాధించాడు. యూకి కెరీర్‌లో ఇప్పటి వరకు ఇదే అత్యుత్తమ విజయం కావడం విశేషం. గతంలో అతను ప్రపంచ 14వ ర్యాంక్ క్రీడాకారుడిని ఓడించాడు. ఈసారి లుకాస్‌ను ఓడించడం ద్వారా రికార్డును తిరగ రాశాడు. లుకాస్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత స్టార్ యూకి పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. చూడచక్కని షాట్లతో అలరించిన యూకి ఏదశలోనూ ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. కళ్లు చెదిరే ఏస్‌లు సంధిస్తూ ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఈ క్రమంలో వరుసగా రెండు సెట్లను గెలిచి మూడో రౌండ్‌కు దూసుకెళ్లాడు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన యూకి ఏదశలోనూ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా గంట పది నిమిషాల్లోనే మ్యాచ్‌ను





సొంతం చేసుకున్నాడు. మూడో రౌండ్‌లో యూకి అమెరికా ఆటగాడు శామ్ క్వెరిను ఎదుర్కొంటాడు.





జొకోవిచ్ ఔట్...

మరోవైపు మాజీ నంబర్‌వన్, సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. రెండో రౌండ్‌లో జొకోవిచ్ జపాన్‌కు చెందిన క్వాలిఫయర్ టారో డానియల్ చేతిలో కంగుతిన్నాడు. మూడు సెట్ల సమరంలో డానియరల్ 7–6, 4–6, 6–1 తేడాతో జొకోవిచ్‌ను ఓడించాడు. తొలి సెట్‌లో పోరాటం నువ్వా నేనా అన్నట్టు సాగింది. ఇద్దరు సర్వం ఒడ్డడంతో రసవత్తర సమరం తప్పలేదు. ఇద్దరు ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా శ్రమించారు. దీంతో సెట్ టైబ్రేకర్ వరకు వెళ్లింది. ఇందులో డానియల్ పైచేయి సాధించి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. కాగా, రెండో సెట్‌లో మాత్రం సెర్బియా యోధుడు నొవాక్ పుంజుకున్నాడు. తనకు మాత్రమే సాధ్యమయ్యే షాట్లతో జపాన్ ఆటగాడిని హడలెత్తించాడు. ఇదే క్రమంలో సెట్‌ను కూడా దక్కించుకున్నాడు. కానీ, ఫలితాన్ని తేల్చే మూడో సెట్‌లో మాత్రం సీన్ మళ్లీ రివర్స్ అయ్యింది. ఈసారి డానియల్ ఆధిపత్యం చెలాయించాడు. దూకుడుగా ఆడుతూ ముందుకు సాగాడు. ఇదే సమయంలో నొవాక్ ఒత్తిడికి గురయ్యాడు. దీంతో వరుస తప్పిదాలకు పాల్పడ్డాడు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న డానియల్ 6–1తో సెట్‌ను గెలిచి మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. మరో పోటీలో స్విట్జర్లాండ్ దిగ్గజం, టాప్ సీడ్ రోజర్ ఫెదరర్ విజయం సాధించాడు. అర్జెంటీనా ఆటగాడు ఫెడరికొ డెల్బొనిస్‌తో జరిగిన పోరులో ఫెదరర్ 6–3, 7–5తో జయకేతనం ఎగురు వేశాడు. తొలి సెట్‌ను సునాయాసంగా గెలుచుకున్న ఫెదరర్‌కు రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ తప్పలేదు. అయితే చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకోవడంలో సఫలమైన ఫెదరర్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. వర్షం వల్ల మ్యాచ్‌కు చాలా సార్లు అంతరాయం కలిగింది.

దక్షిణాఫ్రికా జయభేరి

రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఓటమి, సిరీస్ సమం

పోర్ట్ ఎలిజబెత్: ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో సిరీస్‌ను 1–1తో సమం చేసింది. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 239 పరుగులకు ఆలౌటైంది. తర్వాత 101 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య సౌతాఫ్రికా నాలుగు వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఒకవైపు ఆస్ట్రేలియా బౌలర్లు వరుస క్రమంలో వికెట్లు తీసినా లక్ష్యం మరి చిన్నదిగా ఉండడంతో ఫలితం లేకుండా పోయింది. ఓపెనర్ ఐడెన్ మార్‌క్రమ్ మూడు ఫోర్లతో 21 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ డీన్ ఎల్గర్ (5) నిరాశ పరిచాడు. కాగా, స్టార్ ఆటగాళ్లు హాషిం అమ్లా, డివిలియర్స్‌లు జాగ్రత్తగా ఆడుతూ జట్టును లక్ష్యం దిశగా నడిపించారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో జట్టును ఆదుకున్న డివిలియర్స్ ఈసారి కూడా కీలకమైన పరుగులు సాధించాడు. ధాటిగా ఆడిన ఎబి డివిలియర్స్ 4ఫోర్లు, ఒక సిక్స్‌తో 28 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మరోవైపు ఆమ్లా మూడు ఫోర్లతో 27 పరుగులు చేసి జట్టు విజయంలో తనవతు సహకారం అందించాడు. కాగా, కెప్టెన్ డుప్లెసిస్ 2(నాటౌట్)తో కలిసి బ్రూన్ 15 (నాటౌట్) మిగతా లాంఛనాన్ని పూర్తి చేశాడు. అంతకుముందు ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 239 పరుగులకు ఆలౌటైంది. సఫారీ బౌలర్లు వరుసగా వికెట్లు తీస్తూ ఆసీస్ ఇన్నింగ్స్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. మిచెల్ మార్ష్ 45 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. వికెట్ కీపర్ టీమ్ పైన్ 28 పరుగులు చేశాడు. చివర్లో హాజిల్‌వుడ్ రెండు ఫోర్లు, ఒక సిక్స్‌తో 17 పరుగులు చేసి వెనుదిరిగాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన రబడా రెండో ఇన్నింగ్స్‌లోనూ చెలరేగి పోయాడు. ఈసారి ఆరు వికెట్లు పడగొట్టాడు. కేశవ్ మహారాజ్, ఎన్‌గిడిలకు రెండేసి వికెట్లు లభించాయి. రబడాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.





హాంకాంగ్‌కు నేపాల్ షాక్

- **సూపర్ సిక్స్‌కు అఫ్గాన్, ప్రపంచకప్ క్వాలిఫయింగ్ పోటీలు**

బులవాయో: ప్రపంచకప్ అర్హత పోటీల్లో అఫ్గానిస్థాన్ జట్టు సూపర్ సిక్స్‌కు అర్హత సాధించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో నేపాల్ ఐదు వికెట్ల తేడాతో హాంకాంగ్‌పై సంచలన విజయం సాధించింది. నేపాల్ విజయం సాధించడంతో అఫ్గాన్ మెరుగైన రన్‌రేట్‌తో గ్రూప్–బి నుంచి మూడో జట్టుగా సూపర్ సిక్స్‌కు దూసుకెళ్లింది. జింబాబ్వే, స్కాంట్లాండ్ జట్లు ఇంతకుముందే సూపర్ సిక్స్‌కు చేరిన విషయం తెలిసిందే. కాగా గ్రూప్–ఎ నుంచి విండీస్, ఐర్లాండ్, యూఎఇ జట్లు ముందంజ వేశాయి. కాగా, నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన హాంకాంగ్ 153 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ నిజాకత్ ఖాన్ 4ఫోర్లు, సిక్స్‌తో 47 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఎహసాన్ ఖాన్ (21), కెప్టెన్ బాబర్ హయాత్ 20 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టులో సందీప్ మూడు, కరమ్, బసంత్ రగ్మి రెండేసి వికెట్లు పడగొట్టారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన





నేపాల్ 40.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రోహిత్, సంపత్ కామి అద్భుత బ్యాటింగ్‌తో నేపాల్ విజయంలో కీలక పాత్ర పోషించారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన రోహిత్ ఆరు ఫోర్లతో 48 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి సంపత్ సహకారం అందించాడు. ధాటిగా ఆడిన సంపత్ 4ఫోర్లతో 37 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. దీంతో నేపాల్ ఘన విజయాన్ని అందుకుంది. ఈ టోర్నీలో నేపాల్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం.

జింబాబ్వే-స్కాట్లాండ్ మ్యాచ్ టై

మరోవైపు జింబాబ్వే–స్కాట్లాండ్ జట్ల మధ్య జరిగిన చివరి మ్యాచ్ టైగా ముగిసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 46.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ సాలోమన్ మైర్ 35 పరుగులు చేశాడు. వికెట్ కీపర్ బ్రాండన్ టైలర్ 4ఫోర్లు, ఒక సిక్స్‌తో 44 పరుగులు సాధించాడు. మరోవైపు క్రెగ్ ఎర్విన్ ఐదు బౌండరీలు, ఒక సిక్స్‌తో 57 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతావారు విఫలం కావడంతో జింబాబ్వే ఇన్నింగ్స్ తక్కువ పరుగులకే పరిమితమైంది. ప్రత్యర్థి జట్టులో షరీఫ్ ఐదు, మిఖాయిల్ లిస్క్ నాలుగు వికెట్లు పడగొట్టారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 49.1 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. దీంతో మ్యాచ్ టైగా ముగియక తప్పలేదు. ఓపెనర్‌గా దిగిన కెప్టెన్ కైల్ కోట్జార్ 4ఫోర్లు, రెండు సిక్సర్లతో వేగంగా 39 పరుగులు చేశాడు. రిచి బెరింగ్టన్ 4ఫోర్లతో 47 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిఖాయిల్ లిస్క్ 28 పరుగులతో అజేయంగా నిలిచాడు. జింబాబ్వే జట్టులో క్రీమర్, చిసారొ మూడుసి వికెట్లు పడగొట్టారు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.